


SHIVA SURYA TELUGU DAILY
# శివసూర్య
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక





కర్నూలు సంపుటి : 03, సంచిక : 289 చీఫ్ ఎడిటర్.. పేజిలు : 08, వెల రూ. 2రూ/ ఆదివారం - 28 - జూన్ - 2026
Published From Kurnool : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

## వెలిగొండకు నేనే శంకుస్థాపన చేశా..
# పూర్తిచేసే బాధ్యత కూడా నాకే వచ్చింది
## 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమం ప్రారంభం

బ్లేడు, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా తిరిగాయి!

- ★మార్కాపురం జిల్లాలో చంద్రబాబు పర్యటన
- ★వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తనదేనని ప్రజలకు హామీ
- ★గత పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని వెల్లడి
- ★ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు మేలని, యువత టెక్నాలజీపై దృష్టి పెట్టాలని పిలుపు




అమరావతి: తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని, ఇప్పుడు దానిని పూర్తి చేసి జాతికి అంకితం చేసే బాధ్యత కూడా తనపైనే ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే గత పాలకులు కేవలం ప్రారంభోత్సవం చేసి చేతులు దులుపుకొన్నారని ఆయన విమర్శించారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని మిగతా 2 లో



### 85 వేల అక్కచెల్లెమ్మల జీవితాలతో చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారు

- మధ్యాహ్న భోజనం వండుతున్న వారి జీవితాలతో చంద్రబాబు ఆడుకుంటున్నారన్న జగన్
- స్మార్ట్ కిచెన్ పేరుతో వారిని రోడ్డున పడేసే కుట్ర చేస్తున్నారని మండిపాటు
- వారికి బకాయి పెట్టిన జీతాలను వెంటనే విడుదల చేయాలి

### ఏపీకి తమిళనాడు సీఎం విజయ్?..
### కాకినాడ హోర్డింగ్ వెనుక అసలు కథేంటి?

అమరావతి: తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్ ఏపీ పర్యటనకు రాబోతున్నారా? కాకినాడలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారా? ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ ఇది. విజయ్‌కు స్వాగతం పలుకుతూ






### మార్కెట్లోకి 'మేడిన్ ఆంధ్ర' బంగారం..
## కర్నూలులో అమ్మకాలు ప్రారంభం

- 'మేడిన్ ఆంధ్ర' పేరుతో మార్కెట్లోకి వచ్చిన బంగారం
- కర్నూలు జిల్లా జొన్నగిరి గనుల నుంచి ఉత్పత్తి ప్రారంభం
- ఏపీ మ్యాప్, 999 స్వచ్ఛత ముద్రతో 50, 100, 500 గ్రాముల బిస్కెట్లు
- ప్రస్తుతానికి 100 కిలోల విక్రయం.. త్వరలో పూర్తిస్థాయిలో లభ్యత

కర్నూలు: ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నిజమైంది. మిగతా 2 లో



### ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో
## ఏ ఒప్పందాలు జరిగాయి?

- చంద్రబాబు, రేవంత్, డీకే శివకుమార్ భేటీపై హరీష్ స్పందన
- తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే చారిత్రక ఒప్పందం అని రేవంత్ అంటున్నారని విమర్శ
- శిష్యుడు సీఎం అయ్యాడని చంద్రబాబు గుండ్రేవులను తీసుకొస్తున్నారని ఆరోపణ



# మూసీ రివర్‌బెడ్‌లో ఉన్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలి
### మూసీ మొదటి దశ ప్రాజెక్ట్ పైన అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్: మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టు మొదటి దశ ప్రాజెక్టు పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. మూసీ రివర్‌బెడ్‌లో ఉన్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ఎంపీ వేం నరేందర్ రెడ్డి ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో మూసీ మొదటి దశ ప్రాజెక్ట్ పైన అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాజెక్టులో భాగంగా అవసరమైన చోట భూ సేకరణ కోసం ఆసక్తి ఉన్న వాళ్లకు టీడీఆర్ ఇవ్వాలి లేదా పరిహారం చెల్లించాలని చెప్పారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం తీసుకుంటున్న రక్షణ శాఖ భూముల్లో ఉన్న నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వమే తరలించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే నెక్లెస్ రోడ్డులో ప్రజల సందర్శనార్థం మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. మూసీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టబోయే పనులను ఆ ఎక్స్‌పీరిన్స్ సెంటర్‌లో ప్రతిబింబించాలని చెప్పారు. ప్రాజెక్టుపైన ఈ సందర్భంగా ప్రజల అభిప్రాయాలను కూడా సేకరించాలని సూచించారు.



## బారిస్టర్ అయిన ఒవైసీ చట్టాలను సరిగా చదవాలి

- ఆ రెండు చట్టాల గురించి ఒవైసీ చదవాలి: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- పాస్‌పోర్ట్, పౌరసత్వంపై ఒవైసీ వ్యాఖ్యలను ఖండించిన కిషన్ రెడ్డి
- ఓటరు జాబితా సవరణ నేపథ్యంలో ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం
- ప్రజల్లో అనవసర ఆందోళన సృష్టించవద్దని ఒవైసీకి హితవు

హైదరాబాద్: పాస్‌పోర్ట్‌ను పౌరసత్వంతో ముడిపెడుతూ ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఒవైసీ వ్యాఖ్యలు చట్టవిరుద్ధమని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆయన విమర్శించారు.


### రూ. 200 కోట్లతో భద్రాచలం ఆలయం అభివృద్ధి పనుల ప్రారంభం



- ●భూమిపూజ నిర్వహించిన ఎమ్మెల్యే వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్
- ●ఆలయ రూపురేఖలు మార్చేలా తొలి విడత అభివృద్ధి పనులు

### బీసీలు ఐక్యంగా ఉండి, అడిగే స్థితి నుంచి
# ఇచ్చే స్థాయికి ఎదగాలి
●సాయికృష్ణ అదృశ్యం... వైసీపీ నేతలపై పవన్ కల్యాణ్ ఫైర్

- ●క్రిమినల్స్‌కు కులం అంటగట్టే సంస్కృతిని తీవ్రంగా ఖండించిన పవన్ కల్యాణ్
- ●యువతిపై అఘాయిత్యానికి పాల్పడిన సాయికృష్ణను వెనకేసుకురావడంపై మండిపాటు
- ●సంక్షేమం పేరుతో గత ప్రభుత్వం మౌలిక సదుపాయాలను నాశనం చేసిందని విమర్శ



- ●నిజమైన కార్యకర్తలను గుర్తించి, నాయకులుగా తీర్చిదిద్దేందుకే పార్టీ నిర్మాణ కమిటీలు

అమరావతి: జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుల రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నేరస్థులకు, మిగతా 2 లో

## ఇందిరమ్మ ఇళ్ల శ్లాబు పరిమాణంపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

- నిర్మాణ వ్యయం పెరగకుండా అదుపు చేసేందుకే ఈ నిర్ణయం
- 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్యే స్లాబ్ ఉండాలని ఆదేశం
- ముందువైపు మూడు అడుగులు, మిగతా వైపులా ఒక అడుగు మించరాదని స్పష్టీకరణ
- లబ్ధిదారులు అప్పుల పాలవుతున్నారని గుర్తించిన గృహ నిర్మాణ సంస్థ




హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల శ్లాబు సైజుపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. శ్లాబు 500 నుంచి 750 అడుగులు మాత్రమే ఉండాలని జీవోలో పేర్కొంది. శ్లాబు ముందువైపు 3 అడుగులు, మిగతా వైపు ఒక అడుగు మాత్రమే ఉండాలని స్పష్టం చేసింది. ఈ మేరకు గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్లాబు విస్తీర్ణం పెరగడం వల్ల లబ్ధిదారులకు ఖర్చు పెరుగుతోందని హౌసింగ్ కార్పొరేషన్ తెలిపింది. నిర్మాణ ఖర్చులు పెరగకూడదనే ఉద్దేశంతోనే విస్తీర్ణంపై పరిమితులు విధించినట్లు పేర్కొంది.

## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు




### గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన కేంద్రమంత్రి

ఢిల్లీ: రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో 'భారత్ ట్యాక్సీ' దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాబోయే రెండు సంవత్సరాల్లో

# ఆ విషయంలో భారత్ మౌనం వీడాలి..

- కేంద్రానికి సోనియా గాంధీ సూచన!
- గాజాపై కేంద్రం మౌనంగా ఉందన్న సోనియా
- 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ప్రత్యేక వ్యాసం
- పాలస్తీనా అంశంలో భారత్ స్పందించాలని సూచన
- ఓటు బ్యాంకు రాజకీయాలే కాంగ్రెస్ లక్ష్యమంటూ బీజేపీ కౌంటర్
- గాజాపై భారత్ తన వైఖరి స్పష్టంగానే చెప్పిందన్న కమలం పార్టీ

ఢిల్లీ: గాజా యుద్ధం, పాలస్తీనా అంశంపై కేంద్ర ప్రభుత్వం మౌనం పాటిస్తోందంటూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ విమర్శించారు. పశ్చిమాసియాతో సంబంధాల విషయంలో భారత్ తన చారిత్రక వైఖరికి దూరమవుతోందని మిగతా 2 లో



## తిరుమల కొండపై భారీ రద్దీ... శ్రీవారి దర్శనానికి 18 గంటల సమయం

తిరుపతి: తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వారాంతపు సెలవులు కావడంతో కొండపై భారీ రద్దీ నెలకొంది. టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో భక్తుల క్యూ లైన్లు గోగర్భం డ్యామ్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు చేరాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని టీటీడీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకులు అల్పాహారం, తాగునీరు, పాలను అందిస్తున్నారు. రద్దీని కొంతమేర తగ్గించేందుకు మధ్యాహ్నం జారీ చేయాల్సిన టైమ్-స్లాట్ టోకెన్లను రెండు గంటల ముందే విడుదల చేశారు. తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణునివాసం వద్ద కూడా టోకెన్ల కోసం భక్తులు బారులు తీరిన దృశ్యాలు కనిపించాయి. కాగా, శుక్రవారం (జూన్ 26) నాడు 81,340 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 44,874 మంది తలనీలాలు సమర్పించారు. హుండీ ద్వారా రూ. 3.76 కోట్ల ఆదాయం లభించినట్లు టీటీడీ వెల్లడించింది. వారాంతం కావడంతో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## 85 వేల అక్కచెల్లెమ్మల జీవితాలతో చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారు: జగన్

అమరావతి: గవర్నమెంటు స్కూళ్లలో మధ్యాహ్న భోజనం వండుతున్న దాదాపు 85 వేల మంది అక్కచెల్లెమ్మల జీవితాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు చెలగాటం ఆడుతున్నారని వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. దాదాపు 20 ఏళ్లకు పైబడి పనిచేస్తున్నవారు, వీరిలో చాలామంది ఉన్నారని... ఇప్పుడు, స్మార్ట్ కిచెన్స్ పేరుతో తన పార్టీవారి పొట్టలు నింపుతూ, అక్కచెల్లెమ్మలను మాత్రం రోడ్డున పడేసే కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో భాగంగా ఇప్పుడు వారికి ఇవ్వాల్సిన జీతాలు గత రెండు నెలలుగా బకాయిపెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో మధ్యాహ్న భోజనం కార్మికులకు రూ.వేయి ఉండే జీతాన్ని తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 3 వేల వరకు పెంచామని జగన్ తెలిపారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వస్తే మరింత మేలు చేస్తామని చెప్పిన చంద్రబాబు... ఇప్పుడు స్మార్ట్ కిచెన్స్ పేరుతో వారిని తొలగించి వారి జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నారని విమర్శించారు. మధ్యాహ్న భోజన కార్మికుల తరఫున పోరాడుతామని, వారికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే బకాయిపెట్టిన వారి జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ఇచ్చిన మాట మేరకు వారి జీతాలను కూడా పెంచాలని అన్నారు.

## ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయి?

కర్ణాటక: కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు (చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్) జరిపిన రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో సీఎంలు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురు మాత్రమే కూర్చుని ఏం చర్చించారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఆంధ్రప్రదేశ్‌లో గుండ్రేవుల ప్రాజెక్టులు ముందుకు వెళుతుంటే, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'చారిత్రక ఒప్పందం' అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. గతంలో గుండ్రేవులను బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని... కానీ ఇప్పుడు ఏపీ సీఎం తన 'శిష్యుడు' రేవంత్ తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును తీసుకురావడం జరుగుతోందని ఆరోపించారు. ఆర్డీఎస్‌కు స్పష్టమైన నీటి కేటాయింపులు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించిన హరీష్ రావు... రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన కూడా లేదని ఎద్దేవా చేశారు. గత 60 ఏళ్లలో కాంగ్రెస్ సగటున 4 టీఎంసీలు మాత్రమే తెచ్చుకుంటే, బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున అనుమతులు తెచ్చుకున్నామని గుర్తు చేశారు."మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నాం. ఇంకా 138 టీఎంసీలు రావాలి. రేవంత్ రెడ్డి తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావద్దు" అని వ్యాఖ్యానించారు.

## రూ. 200 కోట్లతో భద్రాచలం ఆలయం అభివృద్ధి పనుల ప్రారంభం

హైదరాబాద్: ఎన్నో ఏళ్లుగా నిలిచిపోయిన భద్రాద్రి ఆలయ మాస్టర్ ప్లాన్ కల సాకారమయ్యే దిశగా అడుగులు పడ్డాయి. భద్రాద్రి క్షేత్ర అభివృద్ధి పనులకు నేడు శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ అంకిత్ ఆలయ పరిసరాల్లో శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి ఈ మెగా ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. భద్రాచలం రామాలయ రూపురేఖలను మార్చేలా మొత్తం రూ. 200.89 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ తొలి విడత అభివృద్ధి పనులను చేపట్టారు. ఆలయానికి తూర్పు, దక్షిణం, ఉత్తరం వైపు ఉన్న పాత నిర్మాణాల తొలగింపు పనులు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఆలయ పరిసరాల క్లియరెన్స్ పూర్తయిన తర్వాత... ప్రభుత్వం సిద్ధం చేసిన కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం పూర్తి శాస్త్రోక్తంగా, ఆగమ శాస్త్ర నియమాలను పాటిస్తూ అభివృద్ధి పనులు చేపడతారు. వచ్చే సంవత్సరం శ్రీరామ నవమి పండుగ నాటికి ఈ ఆలయ నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## ఇల్లు అప్పగించినా, నష్టపరిహారం చెల్లించాల్సిందే: సుప్రీం తీర్పు

అమరావతి: గృహ కొనుగోలుదారుల హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఫ్లాట్ నిర్మాణంలో జాప్యం జరిగినప్పుడు, దానిని స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా బిల్డర్ నుంచి నష్టపరిహారం కోరే హక్కు కొనుగోలుదారులకు ఉంటుందని స్పష్టం చేసింది. కేవలం ఫ్లాట్‌ను స్వీకరించినంత మాత్రాన, ఆలస్యానికి సంబంధించిన నష్టపరిహారం పొందే హక్కు రద్దు కాదని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఈ తీర్పు రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగదారుల హక్కులను మరింత బలోపేతం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 2016లో జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) ఇచ్చిన తీర్పును పక్కనపెట్టి, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఒక కేసును పునర్విచారణకు స్వీకరించింది. "నిర్మాణ జాప్యానికి సంబంధించిన నష్టపరిహారం అనేది ఫ్లాట్ అప్పగించడానికి ముందు కాలానికి వర్తిస్తుంది. కేవలం ఫ్లాట్‌ను స్వాధీనం చేసుకున్నంత మాత్రాన, ఆ జాప్యానికి పరిహారం కోరే హక్కును కొనుగోలుదారులు కోల్పోరు" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఢిల్లీకి చెందిన టి.కె.ఎ. పద్మనాభన్ అనే వ్యక్తి, అభియాన్ కోఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీపై 2005లో దాఖలు చేసిన కేసు విచారణ సందర్భంగా ఈ తీర్పు వెలువడింది. ఫ్లాట్ అప్పగింతలో తీవ్ర జాప్యం జరిగిందని ఆయన వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించారు. అయితే, ఒప్పందంలోని ఆర్బిట్రేషన్ క్లాజ్‌ను ప్రాతిపదికగా తీసుకుని కింది కోర్టులు ఈ కేసును మధ్యవర్తిత్వానికి పంపాయి. ఈ వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. వినియోగదారుల రక్షణ చట్టం-1986 అనేది ప్రైవేట్ ఆర్బిట్రేషన్ నిబంధనలకు అతీతంగా వినియోగదారులకు అదనపు రక్షణ కల్పిస్తుందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ కేసును ఏడాదిలోగా పరిష్కరించాలని ద్వారక జిల్లా వినియోగదారుల ఫోరమ్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## మూడు రోజుల సీషెల్స్ పర్యటనకు బయల్దేరిన మోదీ

అమరావతి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు రోజుల పర్యటనకు గాను సీషెల్స్ దేశానికి బయల్దేరారు. సీషెల్స్ నేషనల్ డే 'గోల్డెన్ జూబ్లీ' వేడుకలకు మోదీ 'గెస్ట్ ఆఫ్ ఆనర్' గా హాజరవుతున్నారు. సీషెల్స్ కు బయల్దేరే ముందు ఎక్స్ వేదికగా మోదీ స్పందిస్తూ... "నా మిత్రుడు, సీషెల్స్ అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినీ ఆహ్వానం మేరకు నేను జూన్ 27 నుంచి 29 వరకు సీషెల్స్‌లో పర్యటిస్తున్నాను" అని తెలిపారు. "సీషెల్స్ అనేది కేవలం ఒక ద్వీప దేశం మాత్రమే కాదు. భారత రక్షణ రంగానికి అదొక కీలక సముద్ర దేశం. హిందూ మహాసముద్రంలో భద్రత, శాంతిని పెంపొందించడానికి భారత్ తెచ్చిన 'విజన్ మహాసాగర్' వ్యూహంలో సీషెల్స్ ఒక ప్రధాన భాగస్వామి" అని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో భాగంగా అధ్యక్షుడు హెర్మినీతో మోదీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. మరోవైపు, సీషెల్స్ నేషనల్ అసెంబ్లీని (పార్లమెంట్‌ను) ఉద్దేశించి ప్రసంగించబోతున్న తొలి భారత ప్రధానమంత్రిగా మోదీ సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. ఈ పర్యటన సందర్భంగా అక్కడ స్థిరపడిన భారత సంతతి ప్రజలను కూడా ప్రధాని కలవనున్నారు.

## ఏపీకి తమిళనాడు సీఎం విజయ్?.. కాకినాడ హోర్డింగ్ వెనుక అసలు కథేంటి?

విజయ్‌కు స్వాగతం పలుకుతూ కాకినాడలో ఏర్పాటు చేసిన ఓ హోర్డింగ్ వీడియో గత రెండు రోజులుగా ఇంటర్నెట్‌లో విపరీతంగా చక్కర్లు కొడుతోంది. అయితే, ఈ పర్యటనపై అధికారికంగా ఎలాంటి ప్రకటనా వెలువడకపోవడంతో ఇందులో నిజమెంత అనే దానిపై తీవ్ర గందరగోళం నెలకొంది. గత రెండు రోజులుగా 12 సెకన్ల నిడివి ఉన్న ఓ వీడియో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వైరల్ అవుతోంది. "తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను ఆహ్వానిస్తున్నాము" అంటూ కాకినాడ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ పేరుతో ఈ హోర్డింగ్ ఉంది. ఆ హోర్డింగ్ పరిసరాల్లో ఉన్న దుకాణాల పేర్లు తెలుగులో ఉండటంతో ఇది కచ్చితంగా ఏపీలోనిదేనని నెటిజన్లు నిర్ధారించుకుంటున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ తొలిసారి ఏపీకి వస్తున్నారంటూ ఆయన అభిమానులు, నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. దీంతో ఈ విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ వీడియో వైరల్ కావడంతో విజయ్ నిజంగానే కాకినాడ వస్తున్నారా? అనే చర్చ జోరుగా సాగుతోంది. అయితే, ఈ పర్యటన గురించి తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి గానీ, సదరు కళాశాల యాజమాన్యం నుంచి గానీ ఇంతవరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. సాధారణంగా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి పర్యటన ఖరారైతే, కొన్ని రోజుల ముందే అధికారిక షెడ్యూల్ విడుదలవుతుంది. కానీ, విజయ్ పర్యటన విషయంలో అలాంటి సమాచారం ఏదీ లేకపోవడంతో ఇది కేవలం ప్రచారమేనా అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఇది కేవలం కళాశాల ప్రచారం కోసం అనుసరిస్తున్న మార్కెటింగ్ వ్యూహంలో భాగమేమోనని కొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. నటుడిగా విజయ్‌కు ఏపీలో కూడా బలమైన అభిమాన గణం ఉంది. ఆయన సినిమాలు ఇక్కడ భారీ వసూళ్లను సాధిస్తుంటాయి. ఆయన సీఎం అయినప్పుడు కూడా ఏపీలోని పలు ప్రాంతాల్లో అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయన ఏపీకి వస్తున్నారనే వార్త ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తం మీద సీఎం విజయ్ ఏపీ పర్యటనపై నెలకొన్న సస్పెన్స్‌కు తెరపడాలంటే కాకినాడ 'కైట్' కళాశాల యాజమాన్యం స్పందించాల్సి ఉంది. వారి నుంచి అధికారిక ప్రకటన వెలువడితేనే ఈ ప్రచారంలో ఉన్న వాస్తవాలు బయటకు వస్తాయి.

# బ్లేడు, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా తిరిగాయి!

మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని కృష్ణంశెట్టి పల్లె (కె.ఎస్ పల్లె)లో శనివారం జరిగిన 'సంజీవని' కార్యక్రమ ప్రారంభోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెలిగొండ ప్రాజెక్టు అనేది మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి వంటిదని, దానిని పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తికి ఇంకా రూ.3,900 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు వివరించారు. పునరావాసం కింద నిర్వాసితులకు ఇప్పటికే రూ.300 కోట్లు విడుదల చేశామని, త్వరలోనే మరో రూ.600 కోట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు, ఆ తర్వాత మిగిలిన ప్రాంతానికి పరిహారం చెల్లింపులు పూర్తి చేస్తామని తెలిపారు. కొందరు గొడ్డలి పార్టీకి పరోక్షంగా పనిచేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

**ఆగస్టు 15 నుంచి 'సంజీవని'**

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రూపొందించిన 'సంజీవని' కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇది ఒక సమగ్ర డిజిటల్ ఆరోగ్య వేదిక అని, దీని ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ సేవల వరకు మొత్తం ఆరోగ్య వ్యవస్థను అనుసంధానం చేస్తామని వివరించారు. ప్రెడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాలతో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తామని, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులను భద్రపరుస్తామని తెలిపారు. ప్రజలు కూడా మంచి ఆహారం, వ్యాయామం, యోగా వంటి అలవాట్లతో ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

బ్లేడు, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా తిరిగాయి!

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని, వ్యవస్థలన్నీ విధ్వంసానికి గురయ్యాయని చంద్రబాబు ఆరోపించారు. నలుగురు వ్యక్తులు స్వేచ్ఛగా మాట్లాడుకోలేని భయానక వాతావరణం ఉండేదని, బ్లేడు, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా తిరిగాయని విమర్శించారు. నేడు ఆ పరిస్థితి మారిందని, ప్రజలు స్వేచ్ఛగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పడ్డాయని స్పష్టం చేశారు. మహిళల కోసం స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0 వంటి పథకాలను అమలు చేస్తున్నామని, వచ్చే నెలలో 'తల్లికి వందనం' కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు. రైతుల కోసం మొదటి విడత నిధులు ఇప్పటికే విడుదల చేశామని గుర్తుచేశారు.

### యువత, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి

రామాయపట్నం పోర్టును త్వరలోనే పూర్తి చేసి, పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చి, పండ్ల తోటలు, వాణిజ్య పంటలను ప్రోత్సహించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రైతులు విచ్చలవిడిగా పురుగుమందులు వాడటం వల్ల మన ఉత్పత్తులు అంతర్జాతీయంగా తిరస్కరణకు గురవుతున్నాయని, అందుకే ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని సూచించారు. యువత ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలు నేర్చుకొని భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జనాభా తగ్గుదల వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని, ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలకు ప్రోత్సాహకాలు ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు డీబీవీ స్వామి, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీసీలు ఐక్యంగా ఉండి, అడిగే స్థితి నుంచి ఇచ్చే స్థాయికి ఎదగాలి

అమరావతి: జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుల రాజకీయాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. నేరస్థులకు, క్రిమినల్స్‌కు కులం రంగు పులిమి రాజకీయ ప్రయోజనం పొందాలని చూసే సంస్కృతిని తీవ్రంగా ఖండించారు. సాయికృష్ణ మిస్సింగ్ కేసును ప్రస్తావిస్తూ.. 14 ఏళ్ల అమ్మాయిని మూడు రోజుల పాటు గదిలో బంధించి హింసించిన ఓ కుర్రోడి అదృశ్యంపై కేసు నడుస్తోందని, ఓ క్రిమినల్‌కు కులం అంటగట్టి కొందరు ఎలా వెనకేసుకొస్తారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "నిందితుడి తల్లి బాధను నేను అర్థం చేసుకోగలను. అది వేరు. కానీ, ఒక ప్రొఫెషనల్ క్రిమినల్‌లా ప్రవర్తించిన వ్యక్తికి ఎలా మద్దతిస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. కేవలం తమ కులానికి చెందినవాడనే కారణంతో ఒక నేరస్థుడికి మద్దతు పలకడం ఎంతవరకు సబబు అని నిలదీశారు. జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. ఈ తరహా దిగజారుడు రాజకీయాలను జనసేన సహించబోదని స్పష్టం చేశారు.

**వ్యవస్థను బ్రేక్ చేస్తాను కాబట్టే నాపై కోపం**

"ఒక క్రిమినల్‌కు కులం ఎలా అంటగడతారు? ఏ ప్రాతిపదికన అతడిని వెనకేసుకొస్తారు? మీ కులం అయితే సరిపోతుందా? మీ నాయకుడు ఎవరో చెబితే, మీరేంటో నేను చెబుతాను. బూతులు తిట్టేవాళ్లను, క్రిమినల్స్‌ను నాయకులుగా నమ్మితే సమాజానికి ఏం సందేశం ఇచ్చినట్టు?" అని పవన్ ప్రశ్నించారు. వైసీపీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం కులాలను వాడుకుంటోందని, తనను విమర్శించడానికి కాపు సామాజికవర్గానికి చెందిన నేతలనే ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. "నన్ను తిట్టేవాళ్లలో ఎక్కువమంది కాపులే. వాళ్ల భుజాలపై తుపాకీ పెట్టి నన్ను కాలుస్తున్నారు. లింగమనేని రమేశ్ గారికి రాజ్యసభ ఇస్తే వాళ్లే విమర్శిస్తారు. ఈ కుట్రపూరిత రాజకీయాలను బ్రేక్ చేస్తాను కాబట్టే నాపై కొందరికి అంత కోపం" అని పవన్ అన్నారు. తాను ఎప్పుడూ కులం కార్డు వాడి రాజకీయాలు చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయబోనని తేల్చిచెప్పారు. "దేశమే నాకు కులం. కులం అనేది ఒక సామాజిక వాస్తవం, దాన్ని గౌరవిస్తాను. కానీ అది ఇంటి గడప దాటకూడదు. గడప దాటితే మానవత్వం, దేశం మాత్రమే గుర్తుండాలి. నేను కులాల ఐక్యతను కోరుకుంటాను తప్ప, వాటిని రాజకీయ పెట్టుబడిగా మార్చను" అని ఆయన ఉద్ఘాటించారు.

**బీసీలు ఐక్యంగా ఉంటే ఇచ్చే స్థాయికి ఎదుగుతారు**

అధికారానికి దూరంగా ఉన్న సామాజిక వర్గాల సాధికారతపై పవన్ కల్యాణ్ స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా బీసీ సామాజిక వర్గాల గురించి మాట్లాడుతూ, వారు ఐక్యతతో వ్యవహరించాలని సూచించారు. "దాదాపు 50 శాతం జనాభా ఉన్న బీసీలు ఎవరినో పదవులు అడగాల్సిన అవసరం ఏముంది? మీలో మీకు ఐక్యత లేదు కాబట్టే ఆ పరిస్థితి. గొడవలప్పుడు ఏకమవుతారు, ఓట్ల విషయానికి వచ్చేసరికి విడిపోయి సంప్రదాయ పార్టీలకు ఓటేస్తున్నారు. మీరు ఐక్యంగా ఉంటే, మీరు పది మందికి పదవులు ఇచ్చే స్థితిలో ఉంటారు కానీ, ఇలా దేహీ దేహీ అనే స్థితిలో ఉండరు. బీసీలంతా ఏకమైతే, మీకు వైసీపీ లాంటి పార్టీ అవసరం ఉండదు, నాలాంటోడు కూడా అవసరం ఉండదు" అని పవన్ అన్నారు. నాయకుడు అనేవాడు కేవలం తన కులాన్ని కాదు, అన్ని కులాలను కలుపుకొని, అందరి నమ్మకాన్ని చూరగొన్నప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని హితవు పలికారు. కాన్షీరామ్ నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ, ఏ ఉద్యమమైనా ఒకే సామాజిక వర్గానికి పరిమితమైతే దాని ఎదుగుదలకు పరిమితులు ఏర్పడతాయని విశ్లేషించారు.

**సంస్థాగత నిర్మాణమే లక్ష్యం**

పార్టీ కోసం సంవత్సరాలుగా గుర్తింపు ఆశించకుండా పనిచేస్తున్న నిజమైన కార్యకర్తలను గుర్తించి, భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దడానికే 'జనసేన పార్టీ సారథుల సమాచార సేకరణ కమిటీ'ని ఏర్పాటు చేశామని పవన్ తెలిపారు. గతంలో కొందరికి బాధ్యతలు అప్పగించినా, వారు క్షేత్రస్థాయిలోని శివ, మునీర్ హసన్ వంటి కార్యకర్తలను గుర్తించడంలో విఫలమయ్యారని అన్నారు. "పదేళ్లుగా గుర్తింపునకు నోచుకోకుండా పార్టీ కోసం పనిచేసిన సాధక్‌లకు, జనసైనికులకు ఇప్పుడు గుర్తింపు ఇచ్చే సమయం వచ్చింది. అందుకే 700 మంది సభ్యుల కమిటీలో 600 మంది సాధక్‌లకే అవకాశం కల్పించాం. మీరే క్షేత్రస్థాయిలో ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు పనిచేయడం లేదో గుర్తించి సమాచారం అందించాలి. ఇది నాయకులను ఎంపిక చేసే కమిటీ కాదు, కేవలం పారదర్శకంగా సమాచారాన్ని సేకరించే కమిటీ మాత్రమే" అని పవన్ స్పష్టం చేశారు.

**ఛాయిస్ ఈజ్ యువర్స్**

గత వైసీపీ ప్రభుత్వంపై పవన్ విమర్శలు గుప్పించారు. కేవలం బటన్ నొక్కి డబ్బులు వేయడమే పాలన కాదని, మౌలిక సదుపాయాలను పూర్తిగా గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. "డబ్బులు వేశారు సరే, రోడ్లు ఎవరు వేయాలి? ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి ఏంటి? ఒక రోడ్డు లేకపోతే ఊరి నుంచి ప్రజలు ఎలా బయటకు వస్తారు? ఎన్ని ఉచితాలు ఇచ్చినా, మౌలిక సదుపాయాలు కల్పించకపోతే ప్రజలు ఇంకోసారి నమ్మరు అనడానికి వైఎస్ఆర్‌సీపీ ఓటమే క్లాసిక్ ఉదాహరణ" అని అన్నారు. తమ కూటమి ప్రభుత్వం సంక్షేమానికి వ్యతిరేకం కాదని, అయితే సంక్షేమంతో పాటు అభివృద్ధికి, వ్యవస్థల బలోపేతానికి పెద్దపీట వేస్తుందని హామీ ఇచ్చారు. చివరగా, వైసీపీ నేతలకు ఆయన సవాల్ విసిరారు. "మీరు మమ్మల్ని తిట్టడం మానేస్తే, మేము మా పార్టీ నిర్మాణ పనుల్లో ఉంటాం. లేదు, తిడతామంటే.. మిమ్మల్ని తిడుతూనే మేము బలపడతాం. ఏదైనా సరే, మేము బలపడటం గ్యారెంటీ. ఛాయిస్ ఈజ్ యువర్స్" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

## బారిస్టర్ అయిన ఒవైసీ చట్టాలను సరిగా చదవాలి

ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఆయన విమర్శించారు. తెలంగాణలో ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ కొనసాగుతున్న తరుణంలో వీరిద్దరి మధ్య చెలరేగిన మాటల యుద్ధం రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించింది. తెలంగాణలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియపై స్పందిస్తూ.. తుది జాబితాలో పేర్లు లేని పక్షంలో సదరు వ్యక్తుల పౌరసత్వంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు సందేహాలు తలెత్తే అవకాశం ఉందని, పాస్‌పోర్ట్ ఉన్నప్పటికీ ఇబ్బందులు ఎదురవుతాయని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. "పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వానికి తిరుగులేని ఆధారమని విదేశాంగ శాఖ స్పష్టం చేయనప్పటికీ, అది భారత పౌరులకు మాత్రమే అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం జారీ చేసే అత్యంత కీలకమైన పత్రం" అని ఆయన పేర్కొన్నారు. బారిస్టర్ కోర్సు చదివిన ఒవైసీ, పౌరసత్వ చట్టం-1955, పాస్‌పోర్ట్ చట్టం-1967లను మరోసారి అధ్యయనం చేసి మాట్లాడాలని కిషన్ రెడ్డి సూచించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో అనవసర ఆందోళనలను సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ఈ తాజా వివాదం తెలంగాణ రాజకీయాల్లో పత్రాల పరిశీలన, ఓటరు జాబితా సవరణ, పౌరసత్వం వంటి సున్నితమైన అంశాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చింది.

## రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు

రాబోయే రెండు సంవత్సరాల్లో దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాల్లో ఈ సహకార మొబిలిటీ ప్లాట్‌ఫామ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నేడు గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా ఈ కీలక ప్రకటన చేశారు. గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూ-వీలర్లు, ఆటో-రిక్షాలు, ఫోర్-వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని అమిత్ షా తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తున్న ఈ ప్లాట్‌ఫామ్, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టిందని వివరించారు. ఈ సంస్థ జాతీయ విస్తరణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. విస్తరణ ప్రణాళికల గురించి వివరిస్తూ.. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా భారత్ ట్యాక్సీ వేగంగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. "ఈ వేదిక నుంచి నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు, మేము 500కు పైగా నగరాలకు చేరుకుంటాం. దేశంలో సేవలు అందని ప్రదేశమంటూ ఉండదు" అని అమిత్ షా నొక్కి చెప్పారు. జులై 31వ తేదీలోగా నాగ్‌పూర్, పుణే, ముంబై, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా వంటి ఏడు కీలక నగరాల్లో సేవలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. భారత్ ట్యాక్సీ ప్రత్యేకత సహకార నమూనా అని అమిత్ షా తెలిపారు. ఇందులో డ్రైవర్లు కేవలం కాంట్రాక్టర్లుగా కాకుండా సంస్థలో వాటాదారులుగా, సభ్యులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే సుమారు ఏడు లక్షల మంది 'సారథులు' (డ్రైవర్-సభ్యులు) భారత్ ట్యాక్సీ కుటుంబంలో భాగమయ్యారు. ఈ రోజు మీరు కూడా ఈ కుటుంబంలో చేరడం చాలా సంతోషంగా ఉంది" అని గుజరాత్‌లో కొత్తగా చేరిన సభ్యులను ఉద్దేశించి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే మంత్రాన్ని సాకారం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అమిత్ షా పేర్కొన్నారు. మొబిలిటీ, రవాణా రంగాల్లో సహకార ఉద్యమాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. భారత్ ట్యాక్సీలో చేరడం ద్వారా డ్రైవర్లు తమ శ్రేయస్సు, గౌరవం, భద్రతకు మార్గం సుగమం చేసుకున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో భారత రవాణా రంగంలో భారత్ ట్యాక్సీ ఒక ప్రధాన సహకార సంస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.


## వచ్చే ఏడాది భారత్‌కు ట్రంప్.. రూబియో కీలక ప్రకటన

ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత్‌లో పర్యటించే అవకాశం ఉందని ఆ దేశ విదేశాంగ మంత్రి మార్కో రూబియో వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ-ట్రంప్‌ల మధ్య అద్భుతమైన అనుబంధం ఉందని గుర్తుచేశారు. ఇరు దేశాల సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది చివర్లో తాను భారత్‌కు వచ్చి ట్రంప్ పర్యటన ఏర్పాట్లను ఖరారు చేసే అవకాశం ఉందని రూబియో వెల్లడిడించారు. వాషింగ్టన్‌లో ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్ అమెరికాకు అత్యంత సన్నిహిత భాగస్వామి, మిత్రదేశమని పేర్కొన్నారు. ట్రంప్ తన తొలి హయాంలో 2020 ఫిబ్రవరిలో భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా మోదీ, ట్రంప్ సమావేశమయ్యారని రూబియో గుర్తు చేశారు. ఇద్దరు నేతల మధ్య ఉన్న వ్యక్తిగత అనుబంధం దౌత్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కూడా తుది దశకు చేరుకుందని వెల్లడించారు. చర్చలు సానుకూలంగా సాగుతున్నాయన్నారు. ఒప్పందం పూర్తి కావడానికి ఇంకొన్ని అడుగుల దూరంలోనే ఉన్నామని తెలిపారు. క్వాడ్ దేశాల తదుపరి సమావేశం కోసం కూడా ఎదురుచూస్తున్నట్లు రూబియో తెలిపారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ శక్తిగా ఎదిగిందని ప్రశంసించారు. ఇంధన రంగంలోనూ ఇరు దేశాల మధ్య సహకారం మరింత పెరుగుతోందన్నారు. భారీ క్రూడ్ ఆయిల్‌ను శుద్ధి చేసే సామర్థ్యం ఉన్న కీలక దేశాల్లో భారత్ ఒకటని పేర్కొన్నారు.

## ఆ విషయంలో భారత్ మౌనం వీడాలి.. కేంద్రానికి సోనియా గాంధీ సూచన!

ఢిల్లీ: గాజా యుద్ధం, పాలస్తీనా అంశంపై కేంద్ర ప్రభుత్వం మౌనం పాటిస్తోందంటూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ విమర్శించారు. పశ్చిమాసియాతో సంబంధాల విషయంలో భారత్ తన చారిత్రక వైఖరికి దూరమవుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో ప్రత్యేక వ్యాసం రాశారు. అయితే విదేశాంగ విధానంపై కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందంటూ బీజేపీ కౌంటర్ ఇచ్చింది. గాజాలో పౌరుల మరణాలపై భారత్ బలంగా స్పందించడం లేదని సోనియా విమర్శించారు. పాలస్తీనా హక్కులకు మద్దతుగా భారత్ గతంలో అవలంబించిన విధానానికి ఇప్పుడు దూరమవుతోందని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి స్వతంత్ర దర్యాప్తు కమిషన్ నివేదికను ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. గాజాలో వేలాది మంది చిన్నారులు మరణించారని, మరెందరో గాయపడ్డారని తెలిపారు. అంతర్జాతీయ సమాజం ఇప్పటికీ ఈ ఘర్షణను నిలిపివేయడంలో విఫలమైందని వ్యాఖ్యానించారు. భారత్ ఈ అంశంలో 'ఒంటరి మౌన స్వరం'గా మారిందని సోనియా అన్నారు. ఇది నైతికంగానే కాకుండా జాతీయ ప్రయోజనాల కోణంలోనూ సమర్థించలేని వైఖరని పేర్కొన్నారు. పాలస్తీనాతో భారత్‌కున్న చారిత్రక సంబంధాలను కొనసాగిస్తూ కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా స్పందించాలని కోరారు. సోనియా వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. విదేశాంగ విధానం కంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని పార్టీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. గాజా అంశంపై భారత్ తన వైఖరిని ఇప్పటికే పలుమార్లు వెల్లడించిందన్నారు. కాల్పుల విరమణ తీర్మానాలపై ఐరాసలో ఓటు వేసిందని పేర్కొన్నారు. పాలస్తీనాకు మానవతా సాయం కూడా అందించిందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పాలస్తీనా అత్యున్నత పౌర పురస్కారం కూడా లభించిందని గుర్తుచేశారు. ఇజ్రాయెల్‌తో సంబంధాలను కాంగ్రెస్ గతంలో నిర్లక్ష్యం చేసిందని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు విదేశాంగ విధానాన్ని కూడా ఓటు బ్యాంకు రాజకీయాలకు ఉపయోగిస్తోందని విమర్శించారు.

## మార్కెట్లోకి 'మేడిన్ ఆంధ్ర' బంగారం.. కర్నూలులో అమ్మకాలు ప్రారంభం




కర్నూలు: ఏపీ ప్రజల చిరకాల స్వప్నం నిజమైంది. రాష్ట్రంలోనే వెలికితీసిన 'మేడిన్ ఆంధ్ర' బంగారం ఇప్పుడు మార్కెట్లో అందుబాటులోకి వచ్చింది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గనుల నుంచి జియో మైసూర్ సంస్థ ఉత్పత్తి చేసిన బంగారు బిస్కెట్లను అమ్మకానికి ఉంచారు. ఈ చారిత్రక ఘట్టంతో కర్నూలు జిల్లా పేరు దేశవ్యాప్తంగా మరోసారి మార్మోగుతోంది. ప్రస్తుతం 50 గ్రాములు, 100 గ్రాములు, 500 గ్రాముల బిస్కెట్ల రూపంలో ఈ బంగారాన్ని విక్రయిస్తున్నారు. ఈ బిస్కెట్లపై ఏపీ మ్యాప్‌తో పాటుగా 'జొన్నగిరి గోల్డ్‌మైన్స్' అనే పేరును ముద్రించారు. బంగారం స్వచ్ఛతను తెలియజేసేలా '999' నంబర్‌ను కూడా వేశారు. ఇది 24 క్యారెట్ల అత్యంత స్వచ్ఛమైన బంగారమని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం 500 గ్రాముల బిస్కెట్ విలువ సుమారు రూ.75 లక్షలకు పైనే ఉంటుందని అంచనా. ప్రస్తుతం కర్నూలులోని షరాఫ్ బజార్లో కొందరు వ్యాపారుల వద్ద ఈ బంగారు బిస్కెట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ నెల 24న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జియో మైసూర్-జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలోనే జొన్నగిరి గనుల్లో ఉత్పత్తి అయిన తొలి బంగారాన్ని కర్నూలుకు చెందిన ప్రముఖ బంగారం వ్యాపారులు కామిశెట్టి జగదీశ్, చక్రవర్తి, శ్రీహరిమూర్తి తదితరులు కొనుగోలు చేశారు. సీఎం చేతుల మీదుగా స్వయంగా 'మేడిన్ ఆంధ్ర' బంగారం అందుకోవడం ఎంతో సంతోషాన్నిచ్చిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. వీరిలో ఓ వ్యాపారి ఇప్పటికే ఒక గోల్డ్ బిస్కెట్‌ను వినియోగదారుడికి విక్రయించినట్లు తెలిపారు. ప్రస్తుతం జొన్నగిరి గనుల నుంచి తొలి విడతగా 100 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేసి విక్రయించినట్లు వ్యాపారులు చెబుతున్నారు. మేడిన్ ఆంధ్ర బంగారం కొనుగోలుకు చాలామంది ఆసక్తి చూపుతున్నప్పటికీ, ప్రస్తుతానికి ఇది పరిమితంగానే మార్కెట్లో ఉంది. త్వరలోనే పూర్తిస్థాయిలో వినియోగదారులందరికీ అందుబాటులోకి తీసుకువస్తామని ఉత్పత్తి సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. జొన్నగిరిలో బంగారం ఉత్పత్తి ప్రారంభం కావడం వల్ల విదేశాల నుంచి దిగుమతులు తగ్గుతాయని, తద్వారా మన విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, ఈ బంగారానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి పన్ను రాయితీలు ప్రస్తుతానికి లేవని స్పష్టమైంది. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే బంగారానికి వర్తించే అన్ని పన్నులు, జీఎస్టీతో కలిపి ఈ బిస్కెట్లను విక్రయిస్తున్నారు. ఇక, కర్నూలులో ఒక జ్యువెలరీ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ముందుకు వస్తోంది. ఇది కార్యరూపం దాల్చితే, వేలాది మంది స్థానిక స్వర్ణకారులకు, ఇతర కార్మికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మొత్తం మీద జొన్నగిరి బంగారం ఉత్పత్తితో రాయలసీమ ప్రాంతంలో కొత్త పారిశ్రామిక శకం ప్రారంభమైందని చెప్పవచ్చు.

శివసూర్య
SHIVA SURYA TELUGU DAILY
RNI APTEL : 2023/88704
తెలుగు దిన పత్రిక
జనరల్ న్యూస్
ఆదివారం - 28 - జూన్ - 2026

# నేర నియంత్రణ,ప్రజల భద్రతే లక్ష్యం.!!

- రాత్రి వేళల్లో కొనసాగుతున్న విజిబుల్ పోలీసింగ్..
- రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్, ఫేస్ వాష్ అండ్ గో" కార్యక్రమం..



కర్నూలు:జూన్ 28: కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణ కోసం 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా కొనసాగిస్తున్నారు.ఈ కార్యక్ర మంలో భాగంగా నేరాల నియంత్రణకు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై తనిఖీలు నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించే చర్యలు చేపడుతున్నారు. కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండ,ఆదోని సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు కట్టుదిట్టంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు.కర్నూలు నగరంలో బ్లూ కోల్ట్స్,క్యూఆర్టీ పోలీసు బృందాలు విస్తృత తనిఖీలు నిర్వహించారు.డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు కూడా చేపట్టారు.అదేవిధంగా రహదారి ప్రమాదాల నివారణకు "స్టాప్,ఫేస్ వాష్ అండ్ గో"'కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు.ప్రజలు పోలీసులకు సహకరించాలని,ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.అత్యవసర పరిస్థితుల్లో డయల్-112 లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.



# పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి...

- జిల్లా ఇమ్యూనేజేషన్ అధికారి డాక్టర్.ఉమ..



కర్నూలు:జూన్ 28. : పల్స్ పోలియో కార్యక్రమం కర్నూలు జిల్లాలో విజయవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇమ్యూనేజేషన్ అధికారి డాక్టర్.ఉమ తెలిపారు.జిల్లాలో సున్న నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలు 3 లక్షల 52 వేల మంది ఉన్నారని వీరికోసం 16 వందల 30 పోలియో బూత్స్ ఏర్పాటు చేశామన్నారు.ఈ కార్యక్రమంలోఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికి తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలన్నారు.గతంలో వెయించిన రేపు మళ్ళీ పోలియో చుక్కలు వేయించాలన్నారు'"

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం..

- అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు,రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు,మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక..
- అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు..
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి..



కర్నూలు , జూన్ 28.( ప్రజా ఎక్స్‌ప్రెస్ ) : ఈ నెల 29వ తేదీ సోమవారం ఉదయం 9-30 గంటల నుండి కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు,రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు,మునిసిపల్ కార్యాలయాల్లో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చు

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అలాగే అర్జీదారులు వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

# అదనపు బాలికల హైస్కూల్ ను ఏర్పాటు చేయండి..



ఎమ్మిగనూరు :జూన్ 28: పట్టణంలో అదనపు బాలికల హైస్కూలను ఏర్పాటు చేయాలని పీడీఎస్ యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, పీఎస్ యూ,జిల్లా కార్యదర్శి సురేష్,ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాము శనివారం విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగంకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో ఒకటే బాలికల హైస్కూలు ఉండటం వలన విద్యార్థులందరూ మాచాని సోమప్ప బాలికలు హైస్కూల్ లో చేరుతున్నారు.ఈ ప్రాంతంలో ఉన్న తల్లిదండ్రులు బాలికల చదువులను ప్రోత్సహిస్తారు మరియు వారి రక్షణ కోరుకుంటారు.ఈ ప్రాంతంలో ఉన్న మాచాని బాలికల హైస్కూలు లో ఇప్పటికే 3 వేల మంది పైన విద్యార్థినులు ఉన్నారు అందులో గదులు సరిపోక విద్యార్థినులు ఇరుకుఇరుకు గదులలో చదువుతున్నారు అలాగే విద్యార్థులకు తగినంత ఉపాధ్యాయులు సరిపోవడంలేదు ఒకే తరగతి 5 సెక్షన్లుగా ఉండటం చేత విద్యార్థినులకు టీచర్ తరగతి లీడర్ సహాయంతో చదువులు కొనసాగుతున్నాయి అన్నారు అంత విద్యార్థినులకు బాత్రూములు సరిపోవడంలేదు.కావున ఇక్కడ ఆనందంగా బాలికల హైస్కూలు ఏర్పాటు చేయాలని కోరారు.అలాగే నవోదయ కోచింగ్ సెంటర్లుకు అక్రమంగా టీసీ లు ఇస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు మరియు ప్రభుత్వ ఉపాధ్యాయులు పై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు ప్రైవేట్ కోచింగ్ సెంటర్లు ఉండకుండా పాఠశాలలో ఉండేలా చూడాలి అని కోరారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు బ్యాగ్,యూనిఫామ్,పాఠ్యపుస్తకాలు త్వరగా ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్,సంతోష్,అభి,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన నిర్మాణ సారధుల సమాచార సేకరణ కమిటీ కార్యాచరణ సమావేశం..!



గోనెగండ్ల:జూన్ 28: జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తల ద్వారానే భవిష్యత్ తరాల నాయకులను గుర్తించే కార్యక్రమాన్ని జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారని జనసేన పార్టీ కర్నూలు జిల్లా పార్లమెంట్ కమిటీ అబ్జర్వర్ టీమ్ సభ్యులు గానుగ బాషా శనివారం రోజు మీడియాకు తెలిపారు.దేశంలో ఏ పార్టీ కార్యకర్తలకు ఇవ్వని గౌరవం కేవలం జనసేన పార్టీ మాత్రమే ఇచ్చేలా కృషిచేయడమే కాకుండా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పార్లమెంట్ కమిటీలలో చోటు కల్పించి గ్రామ మండల స్థాయిల్లో బలమైన నాయకత్వాన్ని గుర్తించే బాధ్యతను నూతనంగా నియమించిన పార్లమెంట్ కమిటీ సభ్యులు అర్హత కలిగిన నాయకుల నుంచి అర్జీలను స్వీకరించి కేంద్ర నాయకత్వాన్ని పంపించే విధానంపై శనివారం రోజు మంగళగిరి సికె కన్వెంక్షన్ హాల్ నందు దిశ నిర్దేశం చేశారు.పార్లమెంట్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారితో గ్రూపు ఫోటో దిగి వారిలో నూతన ఉత్తేజాన్ని కలిగించారు..

# ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలి..



- పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి..
- జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్..

కర్నూలు:జూన్ 28 : జిల్లాలో జూన్ 28 నుండి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ పేర్కొన్నారు.ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.శనివారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించిన పల్స్ పోలియో అవగాహన ర్యాలీని జెండా ఊపి జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పోలియో వంటి ప్రమాదకరమైన వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతి సంవత్సరం పల్స్ పోలియో కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. జిల్లాలో జూన్ 28, 29, 30 తేదీలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని మూడు దశల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 28న జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు ఏదైనా కారణంతో పోలియో చుక్కలు వేయించుకోలేకపోయిన చిన్నారులను గుర్తించి, జూన్ 29, 30 తేదీలలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని వివరించారు. జిల్లాలో మొత్తం 3,52,164 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారని, వారందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 1,630 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వైద్య, ఆరోగ్య శాఖతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.తల్లిదండ్రులందరూ జూన్ 28న తమ సమీపంలోని పల్స్ పోలియో బూత్‌కు ఐదేళ్లలోపు పిల్లలను తీసుకువెళ్లి పోలియో చుక్కలు వేయించాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొంటూ, అందరి సహకారంతో జిల్లాను పూర్తిస్థాయి పోలియో రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.కలెక్టరేట్ కార్యాలయం నుంచి ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకు భారీ పల్స్ పోలియో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ జాయింట్ కలెక్టర్,అధికారులు, వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు,విద్యార్థులు,వివిధ శాఖల సిబ్బంది ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఎంహెచ్వో డాక్టర్ భాస్కర్,ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఉమాదేవి,తదితరులు పాల్గొన్నారు.





# పత్తికొండ నుంచి తుగ్గలి మీదుగా గుంతకల్లుకు ఆర్టీసీ బస్సును నడపండి



తుగ్గలి, జూన్ 27: పత్తికొండ నుంచి వయా తుగ్గలి- పెరవలి మీదుగా గుంతకల్లుకు ప్రస్తుతానికి ఒక్క ఆర్టీసీ ఆర్డినరీ బస్సు కూడా నడవడం లేదని దీనిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత పార్టీ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పత్తికొండ నుంచి వయా తుగ్గలి- పెరవలి మీదుగా ఆర్టీసీ ఆర్డినరీ బస్సును నడపాలని తుగ్గలి గ్రామానికి చెందిన స్థానిక బీజేపీ యువ నేత మాదిరెడ్డి నవీన్ రెడ్డి కోరారు. ఇందులో భాగంగానే శనివారం మండల కేంద్రమైన తుగ్గలిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నూరల్ ఖమర్ ను కొంతమంది స్థానిక ప్రజలతో కలిసి ఇందుకు సంబంధించిన తమ వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా నవీన్ రెడ్డి మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం ఒక ఆర్టీసీ ఆర్డినరీ బస్సును ఆర్టీసీ ఉన్నతాధికారులు కొంతమంది ప్రయాణికుల అభ్యర్థన మేరకు పత్తికొండ నుంచి వయా తుగ్గలి మీదుగా గుంతకల్లుకు ఉదయం సాయంకాలం మాత్రమే విద్యార్థుల బస్సులాగా సమయపాలన లేకుండా ఒకరోజు వస్తే ఒకరోజు రాకుండా ఎలా పడితే అలా నడిపారని దీంతో ఆ బస్సుకు ప్రయాణికుల నుంచి ఆదరణ లభించకపోవడంతో ఆ బస్సును ప్రస్తుతానికి నడపడం లేదని. అయితే అలా కాకుండా ఈసారి ఒక ఆర్టీసీ ఆర్డినరీ బస్సును పత్తికొండ నుంచి వయా తుగ్గలి- పెరవలి మీదుగా ఉదయం నుంచి సాయంకాలం వరకు ఇదే రూట్లో 8సింగిల్స్ తిప్పాలని అలా తిప్పితేనే ఆ బస్సుకు ప్రయాణికుల నుంచి ఉద్యోగుల నుంచి విద్యార్థుల నుంచి వ్యాపారస్తుల నుంచి ఆదరణ లభిస్తుందని ఆ బస్సును క్రమం తప్పకుండా సమయపాలనతో ప్రతిరోజు నడపాలని వారు కోరారు. తుగ్గలి- పెరవలి మార్గంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆర్టీసీ ఆర్డినరీ బస్సును తిప్పడానికి కొత్త బస్సు ఏమి అవసరం లేదని కేవలం పత్తికొండ నుంచి వయా బురుజుల మీదుగా గుంతకల్లుకు వెళ్లే ఒక బస్సును మాత్రమే పత్తికొండ నుంచి వయా తుగ్గలి- పెరవలి మీదుగా ప్రతిరోజు నడిపితే చాలన్నారు.

# వైసీపీ హయాంలోనే అభివృద్ధి జరిగింది



తుగ్గలి, జూన్ 27 : వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి జరిగిందని దీనిని పక్కదో పట్టించే విధంగా టీడీపీ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని వైయస్సార్సీపి జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నగేష్ యాదవ్ ఎద్దేవా చేశారు. ఇందులో భాగంగానే శనివారం ఇందుకు సంబంధించిన ఒక ప్రకటనను పాత్రికేయులకు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో దాదాపు ఒక్కొక్క సచివాలయానికి రూ.50లక్షలు, ఒక్కొక్క రైతు భరోసా కేంద్రానికి రూ.30లక్షలు, ఒక్కొక్క హెల్త్ క్లినిక్ లకు రూ.30 లక్షలు వెచ్చించి నిర్మిస్తే గ్రామాలలో అభివృద్ధి జరగలేదని టీడీపీ నేతలు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని దుయ్యబట్టారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఏకంగా ఒకేసారి గతంలో ఎన్నడు లేని విధంగా కానీ విని ఎరుగని రీతిలో 1లక్ష 20 వేలకు పైగా శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత వైసీపీ దేననీ గ్రామాలలో ఇల్లు కట్టుకునేందుకు స్థలం లేని వారికి ఇంటి స్థలం అలాగే ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లు కట్టించి కాలనీలు ఏర్పాటు చేశామని అంతేగాక రైతాంగాన్ని ఆదుకునేందుకు వైయస్ఆర్ జలకళ ద్వారా సన్నకారు రైతులకు ఉచితంగా బోర్లు వేయించి విద్యుత్తు సౌకర్యంతో పాటు మోటార్లు కూడా పంపిణీ చేశామన్నారు. నాడు-నేడు కింద ప్రతి స్కూలు రూపురేఖలు మార్చి విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దగలిగామన్నారు.జొన్నగిరి, పగిడిరాయి, రాతన ముక్కెళ్ల, మారెళ్ళ వంటి పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్లు అలాగే తారు రోడ్లు వేసిన ఘనత జగన్ హయాంలోనిది కాదా అని నిలదీశారు. వైసీపీ పార్టీపై ఎప్పుడు గొడ్డలి పార్టీ అని మాట్లాడుతున్నారే మరి మీది వెన్నుపోటు పొడిచే పార్టీనా విమర్శించారు. ఫ్రీహోల్డ్, 22ఖ కింద రైతాంగాన్ని పక్కనపెట్టి వారికి అన్నదాత సుఖీభవ పథకం పడకుండా అడ్డుకుంటుంది మీ ప్రభుత్వం కాదని నిలదీశారు. మహిళలకు పెళ్ళికానుక ఇవ్వకుండా మోసం చేస్తుంది మీరు కాదని ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు ఒక్కొక్కరికి రూ.1,500 ఇస్తామని గత రెండేళ్లుగా మోసం చేస్తున్నది వారికి వెన్నుపోటు పొడుస్తున్నది మీరు కాదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పి వారిని కూడా మోసం చేస్తుంది మీరు కాదని విమర్శించారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేయడం వారికి వెన్నుపోటు పొడిచడం టీడీపీకి అలవాటుగా మారిపోయిందని తీవ్ర స్థాయిలో ఆరోపించారు.

# పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ



తుగ్గలి, జూన్ 27: నేడు ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై శనివారం మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ రోజా రమణి, ఎంఈఓ ప్రవీణ మాట్లాడుతూ పుట్టిన శిశువు నుండి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో ఆదివారం రోజున తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలను వేయించడం ద్వారా ఆ చిన్నారులు పోలియో బారిన పడకుండా ఉంటారన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలను వేయించడంలో ఆ చిన్నారుల తల్లిదండ్రులు తప్పనిసరిగా బాధ్యత తీసుకోవాలని ఆదివారం పోలియో చుక్కలు వేయించుకొని పిల్లలకు సోమ, మంగళ వారాలలో తమ సిబ్బంది ఇంటింటికి తిరిగి మిగిలిన చిన్నారులకు పోలియో చుక్కలను వేస్తారన్నారు. ఈఅవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ నాగమ్మ, ఏఎన్ఎం పద్మావతి, ఆశా కార్యకర్తలు ఆనందమ్మ, ఎస్తేరమ్మ, నాగమణి, షకీనా అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ కాలనీకి రోడ్డు సౌకర్యాన్ని కల్పించండి



తుగ్గలి, జూన్ 27 : మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక బీసీ కాలనీకి తుగ్గలిలోని స్థానిక శ్రీరాముల దేవాలయం దగ్గర నుంచి బీసీ కాలనీ వరకు మెయిన్ రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని తుగ్గలి గ్రామానికి చెందిన స్థానిక బీజేపీ యువ నేత మాదిరెడ్డి నవీన్ రెడ్డి శనివారం తుగ్గలిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ ను మర్యాద పూర్వకంగా కలిసి ఇందుకు సంబంధించిన తమ వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా నవీన్ రెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంగా బీసీ కాలనీకి మెయిన్ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో చాలామంది ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదని వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే బీసీ కాలనీకి మెయిన్ రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ ను కోరారు. ఎందుకు స్పందించిన జిల్లా జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ త్వరలోనే బీసీ కాలనీకి మెయిన్ రోడ్డు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు బీసీ కాలనీ చెందిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే మన ఎజెండా



తుగ్గలి, జూన్ 27 : ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం వద్దని ఆ సమస్యలను పరిష్కరించడమే మన ఎజెండా అని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన తుగ్గలిలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో జిల్లా జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ వివిధ శాఖలకు చెందిన పలువురు అధికారులతో పాల్గొని ప్రజల నుంచి వినతులను అర్జీలను ఫిర్యాదులను స్వీకరించారు. ఈసందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ మాట్లాడుతూ ప్రతి అధికారి తమ పరిధిలోకి వచ్చిన సమస్యను అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చూడాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యోగులపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిపోతుందని తద్వారా ప్రతి ఉద్యోగి తమవంతు బాధ్యతగా తమ పరిధిలోని సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర ఆయన సతీమణి మాజీ జెడ్పిటీసీ సభ్యురాలు వరలక్ష్మి అలాగే ఆర్డీవో ఓబులేసు, తాసిల్దార్ రవి, మండలంలోని వివిధ శాఖలకు చెందిన పలువురు మండల స్థాయి అధికారులు మరి కొంతమంది జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో ప్రశాంతంగా మొహర్రం వేడుకలు



తుగ్గలి, జూన్ 27 : మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు గ్రామాలలో ప్రశాంతంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. అయితే శనివారం నాటికి మొహర్రం వేడుకలు కొన్ని గ్రామాలలో ముగిసినప్పటికీ మరికొన్ని గ్రామాలలో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే మండల కేంద్రమైన తుగ్గలిలో అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాల ద్వారా గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రజల సమక్షంలో ముజావర్లు పెద్ద ఎత్తున అత్యంత వైభవంగా నిర్వహించిన మొహర్రం వేడుకలు శనివారం నాటికి ముగిశాయి. గ్రామాలలో మొహం వేడుకలు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పత్తికొండ పోలీస్ సర్కిల్ రూరల్ సీఐ పులిశేఖర్ ఆదేశాల మేరకు తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషన్ల ఎస్సైలు నరేష్, మల్లికార్జున ముందస్తు చర్యల్లో భాగంగా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజలకు కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాల ద్వారా గ్రామాలలో మొహర్రం వేడుకలను తమ కుటుంబ సభ్యులతో కలిసి అత్యంత వైభవంగా ఒకరికొకరు సోదరా భావంతో కలిసిమెలసి ఐక్యతను చాటుతూ ఆనందంతో జరుపుకున్నారు.

శివసూర్య
SHIVA SURYA TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
RNI APTEL : 2023/88704



# స్మశాన వాటికల అభివృద్ధికి పెద్దపీట గౌరవప్రదమైన అంతిమ వీడ్కోలే లక్ష్యం

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ.

పిట్టలవానిపాలెంలో అపర కర్మల భవనం, ప్రహరీ నిర్మాణ పనుల పరిశీలన: పనుల్లో వేగం పెంచాలని ఆదేశం.

ఆక్రమణలకు తావులేకుండా రక్షణ గోడలు

పవిత్ర స్థలాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి.



బాపట్ల, జూన్ 27 మానవ జీవితంలో చివరి ప్రయాణం అత్యంత గౌరవప్రదంగా సాగాలని, ఆ సమయంలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు స్పష్టం చేశారు. పిట్టలవానిపాలెం మండల కేంద్రంలో జరుగుతున్న అపర కర్మల భవనం, హిందూ స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణ పనులను ఆయన శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్మశాన వాటికల అభివృద్ధి అనేది కేవలం నిర్మాణాలకు పరిమితం కాదని, అది ఒక పవిత్ర స్థలానికి ఇచ్చే మానవీయ గౌరవమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకోని అనేక స్మశానాలు నేడు ఆక్రమణల బారిన పడ్డాయని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి ఆధునీకరిస్తోందని తెలిపారు. స్మశాన వాటికల చుట్టూ పక్కాగా రక్షణ గోడలు నిర్మించడం ద్వారా ఆక్రమణల బెడదను శాశ్వతంగా తొలగిస్తామని, పచ్చదనాన్ని పెంపొందించి అక్కడకు వచ్చేవారికి మానసిక ప్రశాంతత చేకూరేలా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. నిధుల కొరత లేకుండా పనులు వేగవంతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన భరోసానిచ్చారు. అపర కర్మల నిర్వహణ సమయంలో ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు వృద్ధులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రధానంగా: వ్యవహారాల అనంతరం స్నానానికి వీలుగా ప్రత్యేక గదుల నిర్మాణం. ప్రాంగణంలోనే సురక్షిత తాగునీటి సౌకర్యం. ప్రజలు సేదతీరేందుకు వీలుగా షెడ్లు తోటల పెంపకం. ఇలా అత్యాధునిక హంగులతో కూడిన భవనాలను అందుబాటులోకి తెస్తున్నట్లు వివరించారు. అనంతరం ఖాజీపాలెం గ్రామంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రతిపాదించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. గీతా మందిరం సమీపంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ ట్రాక్‌ను నిర్మిస్తామని, దీనివల్ల స్థానిక యువతకు, ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టు కేవలం నడకకే కాకుండా, స్థానికులు సాయంత్రం వేళల్లో సేదతీరేందుకు ఒక మంచి పార్కులా ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి, ప్రజలకు అంకితం చేస్తామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో స్థానిక కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఈ అభివృద్ధి పనులు పిట్టలవానిపాలెం, ఖాజీపాలెం ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా, స్థానిక మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శ్రీశైల దేవస్థానానికి 50 పి.ఓ.ఎస్.మిషన్లు విరాళం

భక్తులకు మరింత సులభతరంగా దర్శనం, ప్రసాదాల చెల్లింపులు: యూనియన్ బ్యాంక్ సహకారం.

ఫోన్ పే, గూగుల్ పే, కార్డుల ద్వారా ఇకపై సులభంగా చెల్లింపులు

శ్రీశైలం ఈవో యం శ్రీనివాసరావు వెల్లడి.

టోల్‌గేట్ నుండి ప్రసాదాల కౌంటర్ల వరకు డిజిటల్ సేవలు: భక్తుల సౌకర్యార్థం దేవస్థానం చర్యలు.

బ్యాంక్ అధికారుల సేవా దృక్పథాన్ని అభినందించిన

ఈవో యం. శ్రీనివాసరావు.



శ్రీశైలం, జూన్ 27 ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో భక్తులకు మరింత మెరుగైన, వేగవంతమైన సౌకర్యాలు కల్పించే దిశగా శ్రీశైల దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించడం, కౌంటర్ల వద్ద భక్తుల రద్దీని తగ్గించడం లక్ష్యంగా దేవస్థానం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంది. ఇందులో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శ్రీశైలం శాఖ వారు 50 పి.ఓ.ఎస్. మిషన్లను విరాళంగా సమర్పించారు. శనివారం దేవస్థాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈవో యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, "ప్రస్తుత కాలంలో భక్తులు నగదు కంటే డిజిటల్ చెల్లింపులకే మొగ్గు చూపుతున్నారు. ఈ మిషన్ల ద్వారా భక్తులు ఫోన్ పే, గూగుల్ పే, డెబిట్ క్రెడిట్ కార్డులను ఉపయోగించి సెకన్లలో చెల్లింపులు పూర్తి చేయవచ్చు. ఇది కౌంటర్ల వద్ద నిరీక్షణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుంది" అని వివరించారు. ఈ మిషన్లను ప్రధానంగా టోల్‌గేట్, శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం, అన్నప్రసాదం లడ్డూ ప్రసాదాల కౌంటర్ల వద్ద యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కేవలం భక్తుల సౌకర్యమే కాకుండా, నగదు రహిత లావాదేవీల వల్ల దేవస్థానానికి వచ్చే ఆదాయం లెక్కల్లో మరింత పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్తులో క్షేత్రంలోని అన్ని సేవా కేంద్రాలను డిజిటలైజ్ చేయడమే లక్ష్యంగా దేవస్థానం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ఈ డిజిటల్ వ్యవస్థను పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఐటీ బృందాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని, సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ఈ ఆధునిక యంత్రాలను విరాళంగా అందించిన యూనియన్ బ్యాంక్ యాజమాన్యానికి, అధికారులకు ఈవో శ్రీనివాసరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం భక్తుల పట్ల దేవస్థానం చిత్తశుద్ధిని, ఆధునిక సేవల పట్ల ఉన్న నిబద్ధతను చాటిచెబుతోంది. ఈ కార్యక్రమంలో తిరుపతి జోనల్ హెడ్ జనరల్ మేనేజర్ పత్రి శ్రీనివాసకుమార్, కర్నూలు రీజినల్ హెడ్ మరియు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డి. అనిల్ కుమార్, స్థానిక బ్యాంకు ప్రతినిధులు దేవస్థాన పాలకమండలి అధికారులు పాల్గొన్నారు. శ్రీశైల క్షేత్రానికి వస్తున్న వేలాది మంది భక్తులకు ఈ సదుపాయం ఎంతో ఉపయుక్తంగా ఉండనుందని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

# జలధార జలహారతి' -- మట్టిని నమ్ముకున్న రైతన్నకు జల సిరి!




బాపట్ల జిల్లా జూన్ 27 అడుగంటుతున్న భూగర్భ జలాలు, వేసవిలో బోర్ల ఎండిపోవడం, సాగునీటి కోసం అష్టకష్టాలు.. ఇన్నాళ్లూ జిల్లా కొల్లూరు మండల రైతుల పరిస్థితి ఇది. కానీ, నేడు ఆ దుస్థితిని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'జలధార జలహారతి' పథకం ఒక ఆశాదీపంలా మారింది. కేవలం అధికారులకే వదిలేయకుండా, ప్రజలను భాగస్వామ్యులను చేస్తూ చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమం బాపట్ల జిల్లాలో కొత్త చరిత్రకు నాంది పలుకుతోంది.లి 9.32 మీటర్ల లోతు నుంచి మూడు మీటర్ల స్థాయికి..కొల్లూరు మండలంలో భూగర్భ జలమట్టం ఆందోళనకరంగా 9.32 మీటర్లకు పడిపోవడంతో, ముఖ్యమంత్రి మార్గదర్శకత్వంలో ప్రభుత్వం 100 రోజుల ప్రత్యేక కార్యాచరణను ప్రకటించింది. ఇందులో భాగంగా 16 పంచాయతీలలో 99 కీలక పనులను గుర్తించారు. ఇప్పటివరకు 86 పనులు పూర్తికాగా, మిగిలినవి తుది దశలో ఉన్నాయి. కేవలం కాల్వల పూడికతీత మాత్రమే కాకుండా, 'చెరువుల పునరుద్ధరణ'కు కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. జువ్వలపాలెం, పెద్దలంక, గాజుర్లంక వంటి గ్రామాలలో కాల్వల పునరుద్ధరణను ఒక యజ్ఞంలా చేస్తున్నారు. 1,100 మీటర్ల పొడవునా, 1.4 మీటర్ల వెడల్పుతో చేపట్టిన పూడికతీత పనులు, వర్షాకాలంలో వచ్చే వరద నీటిని ఒడిసిపట్టేలా డిజైన్ చేశారు. పాత కాల్వల గట్లు బలోపేతం కావడం వల్ల సాగునీటి వృధా అరికట్టబడుతోంది.సామాజిక బాధ్యత: జువ్వలపాలెం గ్రామంలో 45 మంది రైతులతో పాటు స్థానిక యువకులు స్వచ్ఛందంగా పాల్గొనడం ఈ పథకానికి వస్తున్న ప్రజాదరణకు నిదర్శనం. నీరు ఉంటేనే నేల తరిస్తుంది.. నేల తడిస్తేనే రైతు బతుకుతాడు" అనే నినాదంతో సాగుతున్న ఈ కార్యక్రమంలో.. భూగర్భ జలమట్టం పెరగడం వల్ల ఖరీఫ్, రబీ పంటలకు సాగునీటి భరోసా పెరుగుతుంది. బోర్ బావుల లోతు తగ్గుతుంది. విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గుతుంది. తద్వారా సాగు ఖర్చులు తగ్గి, రైతుల ఆదాయం రెట్టింపు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సైతం విశ్లేషిస్తున్నారు. ప్రతి సోమవారం ఈ పనుల పురోగతిని సీఎం స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్థాయిలో అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షిస్తుండటంతో, నిర్ణీత గడువులోగా పనులు పూర్తవుతున్నాయని జిల్లా అధికారులు చెబుతున్నారు. రాబోయే వర్షాకాలం ముగిసేసరికి, కొల్లూరు మండలం రాష్ట్రానికే ఆదర్శంగా మారుతుందని బాపట్ల జిల్లా యంత్రాంగం ధీమా వ్యక్తం చేస్తోంది.

# దోమల నియంత్రణ - ఆరోగ్య రక్షణ

చీరాల విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన మలేరియా శాఖ.

వ్యాధులపై సమరానికి విద్యార్థులే సైనికులు

జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా ప్రత్యేక అవగాహన.

వర్షాకాలంలో అప్రమత్తం: కలుషిత నీరు, దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన జిల్లా అధికారులు.

ఆరోగ్యమే మహాభాగ్యం: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై మలేరియా అధికారి నాగార్జున రావు పిలుపు.




బాపట్ల జూన్ 27 అఖండ సూర్య వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా ప్రజలను, ముఖ్యంగా విద్యార్థులను అప్రమత్తం చేసేందుకు బాపట్ల జిల్లా ఆరోగ్య శాఖ రంగంలోకి దిగింది. 'జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవాల'లో భాగంగా, చీరాల ఎన్.ఆర్.పి.ఎం. బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా మలేరియా అధికారి వి. నాగార్జున రావు ఆధ్వర్యంలో సమగ్ర అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున రావు దోమల జీవిత చక్రం గురించి వివరిస్తూ, నీరు నిల్వ ఉండే ప్రతి చోటా దోమలు గుడ్లు పెడతాయని, తద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని విద్యార్థులను హెచ్చరించారు. దోమలు పుట్టకుండా ఉండాలంటే ఇంటి చుట్టూ ఉన్న కుండీలు, టైర్లు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఇంటికి దోమతెరలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమం కేవలం పాఠశాలకే పరిమితం కాకుండా, విద్యార్థులు 'ఆరోగ్య దూతలు'గా మారి తమ ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు కూడా ఈ జాగ్రత్తలను వివరించాలని కలెక్టర్ నాగార్జున రావు పిలుపునిచ్చారు. విద్యార్థులు రోజూ యోగా అభ్యసించడం ద్వారా శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, అనారోగ్యాలకు దూరంగా ఉండవచ్చని వివరించారు. వర్షాకాలం కావడంతో కలుషిత నీటి ద్వారా వచ్చే అతిసారం (డయేరియా) వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, అందరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, తద్వారా జలజనిత వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులందరూ ఆరోగ్యకరమైన అలవాట్లను పాటిస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ అవగాహన సదస్సుతో పాటు, స్థానిక సచివాలయాల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో కలిసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల యు.ఎల్.బి. సబ్ యూనిట్ అధికారి చింతా శేషు బాబు, మలేరియా సూపర్వైజర్ రవికుమార్, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆరోగ్య స్పృహను పెంచడంతో పాటు, వ్యాధుల నియంత్రణలో వారి పాత్రను కీలకమని చాటిచెప్పింది.

# శిరోరక్ష - ప్రాణరక్ష': హెల్మెట్ ధరించండి,

బాపట్ల చందోలు, జూన్ 27 నిత్యం పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా, వాహనదారుల ప్రాణాలను కాపాడేందుకు బాపట్ల జిల్లా యంత్రాంగం 'శిరోరక్ష - ప్రాణరక్ష' పేరుతో రాష్ట్రవ్యాప్త అవగాహన ఉద్యమాన్ని చేపట్టింది. బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు, చందోలు ఎస్సై కె. మాధవరావు శనివారం సాయంత్రం రెడ్డిపాలెం టోల్ ప్లాజా వద్ద చేపట్టిన వాహన తనిఖీలు, వాహనదారులలో కొత్త భద్రతా స్పృహను నింపాయి.చలానాలు రాయడం మా ఆనందం కాదు.. ప్రాణాలను కాపాడటమే మా బాధ్యత!

ఈ తనిఖీల్లో పాల్గొన్న ఎస్సై మాధవరావు వాహనదారులను ఆపి, కేవలం తనిఖీలు చేయడమే కాకుండా, రోడ్డు భద్రతపై వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. "మేము వేసే చలానాల విలువ మీ ప్రాణం కంటే ఎక్కువ కాదు. మీరు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల, ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం 90 శాతం ఉంటుంది. మీ కుటుంబం మీకోసం ఇంటి దగ్గర ఎదురుచూస్తుందనే విషయాన్ని మర్చిపోవద్దు" అని ఆయన భావోద్వేగంతో పిలుపునిచ్చారు. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు సాయం అందాలన్నా, అక్రమ రవాణాను అరికట్టాలన్నా వాహన పత్రాలు చాలా కీలకం. ఈ నేపథ్యంలో ఎస్సై ప్రతి వాహనాన్ని ఆపి, కింది పత్రాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్: వాహనం నడిపే వ్యక్తికి సరైన నైపుణ్యం ఉందో లేదో నిర్ధారించడానికి.

రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్: వాహన యజమాని వివరాలు వాహన కండిషన్ తెలుసుకోవడానికి. ఇన్సూరెన్స్: ప్రమాద సమయంలో బీమా రక్షణ కోసం. ఈ పత్రాలు వెంట లేని వారికి జరిమానాల కంటే, నిబంధనలు పాటించాల్సిన ప్రాముఖ్యతపైనే ఎస్సై ఎక్కువ దృష్టి సారించారు. కేవలం వాహనదారులకే కాకుండా, టోల్ ప్లాజా వద్ద ఇతర వాహనాల రాకపోకలపై కూడా ప్రత్యేక నిఘా పెట్టారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పద వాహనాలపై నిరంతరం పర్యవేక్షిస్తూ, నేరస్తులు జిల్లా సరిహద్దులు దాటకుండా ఉండేందుకు ఈ తనిఖీలు తోడ్పడుతున్నాయని ఎస్సై తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను ఒక బాధ్యతగా భావించాలని, ట్రాఫిక్ పోలీస్ ఉన్నప్పుడు మాత్రమే నియమాలు పాటించడం కాకుండా, ఎల్లప్పుడూ భద్రతపై శ్రద్ధ వహించాలని పోలీసులు కోరుతున్నారు. బాపట్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు రాబోయే రోజుల్లో జిల్లాలోని అన్ని ప్రధాన కూడళ్ల వద్ద మరింత కఠినంగా అమలు చేయనున్నట్లు సమాచారం. పోలీసుల ఈ ప్రయత్నానికి స్థానిక ప్రజలు, వాహనదారులు సానుకూలంగా స్పందిస్తున్నారు.

## ప్రతీ ఒక్కరు మానవత్వంతో స్పందించి సేవా కార్యక్రమాలు చేపట్టాలి




విశాఖపట్నం, జూన్ 27, : ప్రతీ ఒక్కరు మానవత్వంతో స్పందించి సేవా కార్యక్రమాలు చేపట్టాలనిఎం.వి.పి.కాలనీ పోలీస్ స్టేషన్ సిఐ కే.ఎన్.ఎస్.వి.ప్రసాద్ పిలుపునిచ్చారు.పెద వాల్తేర్ రెడ్ క్రాస్ సొసైటీ నిరాశ్రయుల వసతి గృహంలో సోషల్ వర్కర్, చారిటీ బాక్స్ సభ్యురాలు మదీనా బీబీ (మున్నీ) పుట్టినరోజు సందర్భంగా అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సిఐ కే.ఎన్.ఎస్.వి.ప్రసాద్ ముఖ్య అతిధిగా పాల్గొని సోషల్ వర్కర్ మదీనా బీబీని సత్కరించి, చారిటీ బాక్స్ ద్వారా ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు.సోషల్ వర్కర్మహ్మద్ ఖాజా అబ్దుల్లా (ఆర్.పి.ఎఫ్),నిరాశ్రయుల వసతి గృహం మేనేజర్ మురళిఆధ్వర్యంలో మదీనా బీబీ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించడమే కాకుండా, అక్కడ నిరాశ్రయులకు అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారని కొనియాడారు.ప్రతీ ఒక్కరూ సామాజిక కోణంలో ఆలోచించి తమ పుట్టినరోజు, పెళ్లి వేడుకలను ఇటువంటి నిరాశ్రయుల వసతి గృహంలో నిర్వహించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ ,చారిటీ బాక్స్ సభ్యులు మదీనా బీబీ(మున్నీ), సోషల్ వర్కర్ మహ్మద్ ఖాజా అబ్దుల్లా (ఆర్.పి.ఎఫ్),రెడ్ క్రాస్ సొసైటీ నిరాశ్రయుల వసతి గృహం మేనేజర్ మురళి, సీనియర్ పాత్రికేయులు రామకృష్ణ మహాపాత్రో, సనరా వంశీ అలాగే సురేఖ, వరలక్ష్మీ దేవి, జైబూన్, అల్తాఫ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అనాథ వృద్ధుడికి అవర్ హాండ్స్ ఆధ్వర్యంలో అంతిమ సంస్కారాలు



విశాఖపట్నం, జూన్ 27, : గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ అనాథ వృద్ధుడు మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ రాజేష్‌బాబు, కానిస్టేబుల్ చిరంజీవి అందించిన సమాచారంతో అవర్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి పిల్లి గోవింద రాజు వెంటనే స్పందించారు. సంస్థకు చెందిన సొంత అంబులెన్స్‌లో మృతదేహాన్ని చావులమదుము దహనవాటికకు తరలించి, సంస్థ సొంత ఖర్చులతో గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు.అనాథలుగా మృతి చెందిన వారికి కూడా మానవత్వంతో చివరి వీడ్కోలు పలకడం తమ సంస్థ బాధ్యతగా భావిస్తూ అవర్ హాండ్స్ సేవలను నిరంతరం కొనసాగిస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు.

## వివేకానంద ఉచిత ట్యూషన్ విద్యార్థులకు నోట్స్ బుక్స్ పంపిణీ



విశాఖపట్నం, జూన్ 27,: వివేకానంద ట్యూషన్ లో చదువుతున్న విద్యార్థులకు ఈశ్వర రావు సి హెచ్ మసేను దంపతులు నోట్స్ బుక్స్ అందజేశారు ఈ సందర్భంగా వివేకానంద సంస్థ అధ్యక్షులు ఎస్ అప్పారావు మాట్లాడుతూ విశాఖ పట్నం రామకృష్ణ మఠం వారు సహకారంతో వన్ టౌన్ వివేకానంద సంస్థ నందు పేద విద్యార్థులకు ఒకటో తరగతి నిండి ఎనిమిదో తరగతి వరకు ఉచితంగా 12 సంవత్సరాల నుండి ట్యూషన్ చెప్పడం జరుగుతుందని వన్ టౌన్ పరిసర ప్రాంతాల్లో ఉండే పేద విద్యార్థులు వివేకానంద సంస్థ నిర్వహిస్తున్న ఈ ఉచిత ట్యూషన్ ని విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోగలరు ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుండి 7:30 వరకు ట్యూషన్ జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.

## విశాఖ నగరంలో నార్కోటిక్ డాగ్ సహాయంతో 04 కేజీల గంజాయి పట్టివేత



విశాఖపట్నం, జూన్ 27, : డా. శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., కమిషనర్ ఆఫ్ పోలీస్ మరియు అదనపు జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు, ఆర్.ఐ (సెక్యూరిటీ వింగ్) ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ బృందాలు వివిధ ప్రాంతాల్లో నిత్య తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో జ్ఞానాపురం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో నార్కోటిక్ డాగ్ సహాయంతో 04 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒక నిందుతుని పట్టుకొని తదుపరి చర్యల కోసం కంచరపాలెం పోలీసులకు అప్పగించారు. గంజాయి గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన నార్కోటిక్ డాగ్ ఆర్య, డాగ్ హాండ్లర్ మరియు పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు.

## వన్ టౌన్ పోలీసులకు సీపీ రివార్డులు



విశాఖపట్నం, జూన్ 27, : విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచి ఓ మహిళ ప్రాణాలను రక్షించిన వన్ టౌన్ పోలీసు సిబ్బందిని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందించి రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. శుక్రవారం పోలీసు కమిషనరేట్లో నిర్వహించిన కార్యక్రమంలో వన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పూడి వరప్రసాద్, ఎస్ఐ కె.శ్రీను, కానిస్టేబుల్ జి.రామకృష్ణారెడ్డి లను సీపీ సత్కరించారు. ఈసందర్భంగా సీపీ శంఖబ్రత బాగ్చి, పోలీసు సిబ్బంది అప్రమత్తత, సమయస్ఫూర్తిని అభినందిస్తూ సీఐ పూడి వరప్రసాద్, ఎస్ఐ కె.శ్రీను, కానిస్టేబుల్ జి.రామకృష్ణారెడ్డిలకు రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వారి సేవలు పోలీసు శాఖకు ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు.

## ఆరిలోవ క్రైం ఎస్ఐకి సీఐగా పదోన్నతి




**విశాఖపట్నం,జూన్ 27, : ఆరిలోవ పోలీసు స్టేషన్లో ప్రస్తుతం క్రైమ్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ఎ.హరికృష్ణకు సర్కిల్ ఇన్స్పెక్టర్గాగా పదోన్నతి లభించింది.రాష్ట్ర డి.జీ.పి కార్యాలయం నుండి వచ్చిన ఉత్తర్వుల మేరకు హరి కృష్ణ సిఐగా ప్రమోషన్ పొందారు.దీనితో తోటి సిబ్బందితో పాటు పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసారు.**

## నాయకులను కలసి పరామర్శించిన ఎమ్మెల్యే

పలమనేరు జూన్ 27 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలుగుదేశం పార్టీ నాయకులను పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. వారం రోజుల క్రితం గంగవరం మండలం సాయినగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు, పార్టీ నాయకుడు డిష్ శేఖర్‌ను స్థానిక నాయకులతో కలిసి వారి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్త సంక్షేమం తమకు అత్యంత ముఖ్యమని అన్నారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని, వైద్య సహాయానికి చేసిన ఖర్చు సీఎంఆర్ఎఫ్ ద్వారా కొంత మేరకు అందేలా చూస్తామన్నారు. ఇద్దరూ త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. ఎలాంటి అవసరం వచ్చినా పార్టీ, తాను ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఎమ్మెల్యే పరామర్శతో నాగరాజు, డిష్ శేఖర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్సీ కుమార్, భాస్కర్ యాదవ్, చిన్నీ, మురళీ, లోకేష్, గణేష్, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పిల్లలకు పోలియో చుక్కలు వేయించండి

ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి




మంత్రాలయం,శివసూర్య,జూన్, 26: మంత్రాలయం నియోజకవర్గంలో ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో తల్లిదండ్రులందరూ పాల్గొని 0-5 ఏళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పిలుపునిచ్చారు. చుక్కలు వేయించకపోతే పోలియో ముప్పు పొంచి ఉంటుందని హెచ్చరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 42బూతులు ఉంటాయి మెడికల్ ఆఫీసర్ సురేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో పలువురు పాల్గొన్నారు కల్లుదేవ కుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు గోవిందమ్మ, భావన, వసంత, ఎమ్ ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమం లో ఏఎన్ఎమ్ లు, ఆశ వర్కర్లు తదితర మెడికల్ సిబ్బంది ఉన్నారు.

## వరుస సెలవులతో భారీ ట్రాఫిక్ జామ్... భక్తులు అవస్థలు



మంత్రాలయం,శివసూర్య, జూన్ 27: మొహరం, శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతో కర్నూలు జిల్లా మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠ దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో రాఘవేంద్ర కూడలి నుండి బస్టాండ్, మఠం ఆసుపత్రి మీదుగా నాగలదిన్నె రోడ్డు వరకు అన్ని ప్రధాన రహదారులపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఫలితంగా తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. గంటల తరబడి వాహనాలు కదలకపోవడంతో భక్తులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.విషయం తెలుసుకున్న మంత్రాలయం ఎస్ఐ మల్లికార్జున వెంటనే తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సిబ్బంది అప్రమత్తంగా పనిచేయడంతో కొద్దిసేపటికే ట్రాఫిక్ జామ్ క్లియర్ అయ్యి రాకపోకలు సాధారణ స్థితికి వచ్చాయి.

## జగన్ హయాం కంటే ఎక్కువ అప్పులు చేసి
## అభివృద్ధి శూన్యం: ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



మంత్రాలయం,శివసూర్య, జూన్ 27: .వైసీపీ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి మంత్రాలయం మండలం రాంపురంలోని తన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ, వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి 5 ఏళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం కోసం రూ.3 లక్షల 50 వేల కోట్లు అప్పు చేస్తే, చంద్రబాబు నాయుడు రెండేళ్ల పాలనలోనే రూ.3 లక్షల 70 వేల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. సంక్షేమ పథకాలు పూర్తిగా అమలు కాకపోగా రాజధాని నిర్మాణం పేరుతో అప్పులు చేస్తున్నారని, కానీ రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదని ఘాటుగా విమర్శించారు.సీఎం చంద్రబాబు మంత్రాలయం వచ్చి తనపై చేసిన వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే, మంత్రాలయం ప్రజలు అభివృద్ధి, సంక్షేమ నిధులు ఆశించగా, కేవలం తాను, 4 పంచాయతీలు, 7 గ్రామాల గురించి మాట్లాడారని మండిపడ్డారు. ఏళ్లుగా టీడీపీలో ఉన్న మాధవరం రామిరెడ్డి కుటుంబానికి కేడీసీ బ్యాంకు ఛైర్మన్ పదవి ఇచ్చి పెద్దపీట వేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. “2014లో వైసీపీ బీ ఫాంపై గెలిచిన 23 మంది ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చిన చంద్రబాబు, నేను పార్టీ మారితే ద్రోహం అంటారా?” అని ప్రశ్నించారు. తనకంటే వయసు, సీనియారిటీలో పెద్దవారైనా మొండిగా నిలబడి ప్రజలకు న్యాయం చేశానన్నారు. వైసీపీ హయాంలో 66 లక్షల పింఛన్లు ఉండగా టీడీపీ ప్రభుత్వం 6 లక్షలు తగ్గించిందని, సూపర్ సిక్స్, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.1500 హామీలు అమలు కాలేదని ఆరోపించారు. “ప్రజలే నా కుటుంబం, ప్రజలే నా నాయకులు. నా శ్వాస ఉన్నంతవరకు వారి కోసమే పోరాడతాను” అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఐదు రోజులు.. ఏపీ అంతటా వానలే వానలు

విశాఖపట్నం: ఐదు రోజులపాటు ఏపీ అంతటా వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. తూర్పు విదర్భ నుంచి ఏపీ మీదుగా ద్రోణి కొనసాగుతుందని సముద్ర వాతావరణం అలజడిగా ఉండనుందని అధికారులు పేర్కొన్నారు. ఉత్తర కోస్తా తీరంలో ఐదు రోజులపాటు మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని.. మరోవైపు, భారతదేశంలో బలహీనమైన రుతుపవనాలకు కారణమయ్యే ఎల్‌నినో ప్రభావం ఖరీఫ్ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 12 రాష్ట్రాలపై తీవ్రంగా ఉండే అవకాశం ఉందని కేంద్ర వ్యవసాయ శాఖ ప్రకటించింది. ఉత్తరప్రదేశ్ తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, గుజరాత్, రాజస్తాన్, బిహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, మహారాష్ట్రలపైనా తీవ్ర ప్రభావం ఉంటుందని పేర్కొంది. ఆయా రాష్ట్రాల్లో ఎల్ నినో ముప్పు తీవ్రతను తగ్గించడానికి సమన్వయంతో కూడిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఎల్ నినో ప్రభావం సాపేక్షంగా ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న రాష్ట్రాల్లోని సంబంధిత జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ శాఖలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఇతర విభాగాలతో సమన్వయ సమావేశాలను నిర్వహించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సూచించారు. ఖరీఫ్--2026 ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాల్లో ముందస్తు అత్యవసర ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. వర్షపాతం లోటును దృష్టిలో పెట్టుకొని పత్తి, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచాలని చెప్పారు. ఈ ఏడాదికి సంబంధించి 12 ఎల్ నినో ప్రభావిత రాష్ట్రాల్లోని 326 జిల్లాలకు అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి.

## మమతా బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ..
## ప్రతిపక్ష నేతగా రితబ్రతనే కొనసాగిస్తూ కోర్టు నిర్ణయం

**న్యూఢిల్లీ,:** టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. టీఎంసీ రెబల్ నేత రితబ్రతా బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు సమర్థించింది. ఇప్పటికిప్పుడు ఈ విషయంలో ఎలాంటి మార్పునకు ఆదేశించలేమని కోర్టు తెలిపింది. ఈ మేరకు కోల్‌కతా హైకోర్టు జడ్జి జస్టిస్ క్రిష్ణా రావ్ ఈ కేసుపై నిర్ణయం తీసుకున్నారు. టీఎంసీకి చెందిన ఎమ్మెల్యేలు చాలా మంది మమతకు, పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన సంగతి తెలిసిందే. 64 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసి, తమ పార్టీ తరఫున రితబ్రతా బెనర్జీని అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించాలని బెంగాల్ స్పీకర్ రతింద్ర బోస్‌ను కోరారు. 90 మంది ఎమ్మెల్యేల్లో 64 మంది ఎమ్మెల్యేలు రితబ్రతకు మద్దతు ఇవ్వడంతో ఆయననే ప్రతిపక్ష నేతగా గుర్తిస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. అయితే, తాము సూచించిన ఎమ్మెల్యేను కాకుండా.. స్పీకర్ తిరుగుబాటు ఎమ్మెల్యేను అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించడాన్ని సవాలు చేస్తూ మమతా బెనర్జీ కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తాజాగా జస్టిస్ క్రిష్ణా రావ్ ఆధ్వర్యంలోని బెంచ్ విచారణ జరిపింది. అసెంబ్లీ స్పీకర్ నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని, ఇప్పటికిప్పుడు ప్రతిపక్ష నేతగా రితబ్రతను మార్చలేమని కోర్టు తెలిపింది. ఈ అంశంపై స్పందించాలని స్పీకర్‌తోపాటు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. ఈ అంశంలో తమ స్పందన తెలియజేయాలని కోరింది. దీనిపై స్పందించిన ప్రతివాదులు.. తాము అఫిడవిట్ సమర్పించేందుకు మూడు వారాల గడువు కావాలని కోరారు. అయితే, కోర్టు రెండు వారాల సమయం ఇచ్చింది. అలాగే, తదుపరి విచారణ జూలై 28కి వాయిదా వేసింది. అప్పటివరకు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా రితబ్రతా బెనర్జీనే కొనసాగుతారని స్పష్టం చేసింది.

# డీల్ ఓకే.. ఎట్టకేలకు శాంతి వీచికలు

**పశ్చిమాసియాలో యుద్ధం ముగింపు**
**శాంతి ఒప్పందానికి అమెరికా, ఇరాన్ ఓకే**
**19వ తేదీన ఒప్పందంపై సంతకాలు**
**తర్వాత వెనువెంటనే తెరుచుకోనున్న హార్మూజ్**
**ఎలాంటి సుంకాల్లేని నౌకల స్వేచ్ఛా వాణిజ్యానికి ఇరాన్, అమెరికా సమ్మతి**
**స్వాగతించిన ప్రపంచ దేశాలు**




ఇస్లామాబాద్/వాషింగ్టన్/టెల్ అవీవ్: దాదాపు 107 రోజులుగా హార్మూజ్ జలసంధి దిగ్బంధంతో నెలకొన్న అంతర్జాతీయ చమురు సంక్షోభానికి ముగింపు పలుకుతూ, పశ్చిమాసియాలో యుద్ధజ్వాలలను ఆర్పేస్తూ అమెరికా, ఇరాన్ చరిత్రాత్మక శాంతి ఒప్పందం కోసం సమష్టిగా ముందుకొచ్చాయి. పరస్పర షరతులకు సమ్మతి తెలుపుతూ జూన్ 19వ తేదీన శాంతి ఒప్పందంపై సంతకాలు చేయబోతున్నట్లు అటు అమెరికా, ఇటు ఇరాన్ ప్రకటించాయి. స్విట్జర్లాండ్‌లోని జెనీవా నగరంలో అమెరికా, ఇరాన్‌ల మధ్య సంతకాల కార్యక్రమాన్ని తమ ఆధ్వర్యంలో నిర్వహించబోతున్నట్లు పాకిస్తాన్ సోమవారం ప్రకటించింది. శాంతి ఒప్పందంలో ఏఏ వివరాలను పొందుపర్చబోతున్నారనే సమాచారం ఇంకా వెల్లడికాలేదు. ప్రపంచ మార్కెట్లపై యుద్ధకుంపట్లను రాజేసిన అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ అమెరికా కాలమానంప్రకారం ఆదివారం రాత్రి ఇరాన్‌తో డీల్‌పై ప్రకటన చేశారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్‌సోషల్‌లో ఒక పలు పోస్టులు పెట్టారు. “ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరింది. అందరికీ అభినందనలు. ఇకపై ఎలాంటి సుంకాల్లేకుండా హార్మూజ్ తెరుచుకోబోతుంది. హార్మూజ్ వద్ద అమెరికా నావికాదళ దిగ్బంధాన్ని ఎత్తేస్తున్నాం. ప్రపంచ నౌకలకు ఇదే నా పిలుపు. ఇంజిన్లు స్టార్ట్ చేయండి. చమురు సరఫరాను సముద్రమార్గంలో ఉరకలెత్తించండి. గొప్పదైన ఈ ఒప్పందంలో పశ్చిమాసియాలో శాంతి, భద్రత నెలకొంటాయి. ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకోవాలని గతంలో ఎంతో మంది అమెరికా అధ్యక్షులు ప్రయత్నించి విఫలమయ్యారు. తొలిసారిగా నేను శాంతి పవనాలు వీచేలా చేశా. శుక్రవారం సంతకాలు పూర్తయ్యాక హార్మూజ్ తెరుచుకుంటుంది. సముద్ర మందుపాతరల తొలగింపు ప్రక్రియ మొదలవుతుంది. హార్మూజ్ జలసంధికి ఇరువైపులా చమురు నౌకల రాకపోకలు ఆరంభమవుతాయి”అనిట్రంప్ తెలిపారు.

### 60 రోజుల సంప్రదింపుల వ్యవధి!

“ఇరు వైపుల ప్రతినిధి బృందాలు వచ్చాక శుక్రవారం స్విట్జర్లాండ్‌లో సంతకాలు చేస్తారు. అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాక 60 రోజులపాటు సంప్రదింపుల వ్యవధి ఉంటుంది. యురేనియంను అత్యంత నాణ్యత స్థాయికి శుద్ధిచేయడం, ఇప్పటికే శుద్ధచేసిన యురేనియంను నిర్వీర్యంచేయడం, ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు, రెండో దశ ఆంక్షలు, అంతర్జాతీయ ఆంక్షల ఎత్తివేతపై చర్చలు జరుగుతాయి”అని ఇరాన్ ఉప విదేశాంగ మంత్రి కాసిం ఘరిబాబాడీ వెల్లడించారు. మరోవైపు ఒప్పందానికి అంగీకరించిన అమెరికాకు పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కృతజ్ఞతలు తెలిపారు. మధ్యవర్తిత్వం వహించిన ఖతర్, తుర్కియే, సౌదీ అరేబియాలను షెహబాజ్ అభినందించారు.

### దాడి చేస్తే ప్రతిదాడి: ఇజ్రాయెల్

ఓవైపు శాంతి ఒప్పందానికి అమెరికా ముందడుగేస్తుంటే మిత్రదేశం ఇజ్రాయెల్ మాత్రం అదే యుద్ధధోరణిని మళ్లీ కనబర్చింది. “ఇరాన్ గనక మళ్లీ మాపై దాడులకు దిగితే మేం యుద్ధాన్ని కొనసాగిస్తాం. ఇప్పటిదాకా గాజా స్ట్రిప్, సిరియా, లెబనాన్‌లో మేం ఆక్రమించుకున్న సరిహద్దు ప్రదేశాలకు ఖాళీచేసేదే లేదు”అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ ప్రకటించారు. శాంతి ఒప్పందంలో లెబనాన్‌నూ చేర్చాలని ఓవైపు ఇరాన్ పట్టుబడుతుంటే అదే లెబనాన్‌పై దాడులు ఆపేదిలేదని ఇజ్రాయెల్ సోమవారం సైతం స్పష్టంచేయడంతో శాంతి ఒప్పందం ఏ మేరకు సవ్యంగా అమలవుతుందనే కొత్త అనుమానాలు బయల్దేరాయి. గత రెండున్నరేళ్లలో సిరియా, లెబనాన్, గాజా స్ట్రిప్‌లో మొత్తంగా 1,000 చదరపు కిలోమీటర్ల భూభాగాలను ఇజ్రాయెల్ ఆక్రమించింది. ఇది దాదాపు అమెరికాలోని న్యూయార్క్ సిటీ అంత ఉంటుంది. “కొత్త ఒప్పందాన్ని సమర్థవంతంగా అమలుచేయాల్సిన బాధ్యత అమెరికాదే. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను అమెరికా నిలువరించాల్సిందే”అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్పష్టంచేశారు.

### ఖమేనీ మృతి నుంచి ఒప్పందం దాకా..

వాషింగ్టన్/ఇస్లామాబాద్: ఇరాన్‌తో మూడ్రోజుల్లో అవగాహన ఒప్పందం కుదుర్చుకోబోతున్నామని ట్రంప్ ప్రకటించడంతో ఇన్నాళ్లూ ఏం జరిగిందనేది ఆసక్తికరంగా మారింది. ఇరాన్‌పై అమెరికా కాల్పులు మొదలెట్టి తాజాగా చర్చలు మొదలెట్టిన దాకా జరిగిన క్రమంలో కీలక పరిణామాలు కొన్ని...

ఫిబ్రవరి 28: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ మెరుపు దాడులు. దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా సయీద్ అలీ ఖమేనీ సహా పలువురు టాప్ కమాండర్ల దుర్మరణం

మార్చి 1: దూరంగా ఉన్న అమెరికా భూభాగాలకు బదులు అమెరికా స్థావరాలున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై ఇరాన్ దాడులు

మార్చి 2: పొరపాటున అమెరికా యుద్ధవిమానాలను నేలకూల్చిన కువైట్

మార్చి 4: ఇరాన్ యుద్ధనౌక ఐఆర్ఎస్ దేనాను హిందూమహాసముద్రంలో టోర్పెడోతో దాడిచేసి ముంచేసిన అమెరికా

మార్చి 8: సౌదీ అరేబియాపై ఇరాన్ దాడి. శకలాలు పడి భారతీయుడు మృతి

మార్చి 9: తండ్రి స్థానంలో ఇరాన్ సుప్రీంనేతగా బాధ్యతలు చేపట్టిన మొజ్తాబా ఖమేనీ

మార్చి 17: అమెరికా దాడిలో ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారిజానీ అంతం

మార్చి 18: సౌత్ పార్స్ సహజవాయు క్షేత్రంపై అమెరికా భీకర దాడులు

మార్చి 21: చమురు సంక్షోభం పెరగడంతో సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడిచమురు విక్రయానికి అమెరికా తాత్కాలిక అనుమతి

మార్చి 27: ఇరాన్ అణుశుద్ధి కేంద్రాలపై అమెరికా బాంబర్ విమానాల దాడి

మార్చి 31: ఐదు అంశాలతో శాంతి ప్రతిపాదనలను తెచ్చిన చైనా, పాకిస్తాన్

ఏప్రిల్ 3: తొలిసారిగా అమెరికా యుద్ధవిమానాన్ని కూల్చేసిన ఇరాన్

ఏప్రిల్ 8: రెండు వారాల కాల్పుల విరమణ

ప్రతిపాదనను ఓకే చెప్పిన అమెరికా, ఇరాన్

ఏప్రిల్ 11: పాక్ వేదికగా తొలిసారిగా చర్చలకొచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

ఏప్రిల్ 12: చర్చలు విఫలమైనట్లు అమెరికా ప్రకటన

ఏప్రిల్ 15: ఇరాన్‌లో పర్యటించిన అగ్రనాయకత్వంతో చర్చించిన పాక్ ఆర్మీ చీఫ్ మునీర్

ఏప్రిల్17: హార్మూజ్‌ను తెరుస్తున్నామన్న ఇరాన్. తాము దిగ్బంధించామన్న అమెరికా

ఏప్రిల్ 20: ఇరాన్ జెండాతో రాకపోకలు సాగించే నౌకలను అడ్డుకోవడం మొదలెట్టిన అమెరికా

ఏప్రిల్ 22: హార్మూజ్‌లో మూడు నౌకలపై దాడిచేసి రెండింటిని స్వాధీనంచేసుకున్న ఇరాన్

ఏప్రిల్ 24: తమ ప్రతిపాదనలు తెలియజేసేందుకు పాక్‌లో పర్యటించిన ఇరాన్ విదేశాంగ మంత్రి అబాబ్స్ అరాఘ్చీ

ఏప్రిల్ 27: అమెరికా దిగ్బంధాన్ని ఎత్తేస్తే హార్మూజ్‌ను తెరుస్తామని తొలిసారిగా ప్రకటించిన ఇరాన్

మే 6: విదేశీ నౌకలు హార్మూజ్‌ను సురక్షితంగా దాటేందుకు ఇకపై అమెరికా యుద్ధనౌకలు రక్షణగా రాబోవని ప్రకటించిన ట్రంప్

మే 13: ఒమన్ తీరంలో భారతీయ నౌకపై దాడి

మే 18: చర్చలు కీలకదశలో ఉండటంతో దాడులు తాత్కాలికంగా ఆపేస్తున్నట్లు అమెరికా ప్రకటన

జూన్ 1: తమ ఎంక్యూ--1 ప్రిడేటర్ డ్రోన్‌ను కూల్చినందుకు ఇరాన్‌పై భీకర దాడులు మొదలెట్టినట్లు ట్రంప్ వెల్లడి

జూన్ 3: కువైట్ విమానాశ్రయంపై ఇరాన్ డ్రోన్ దాడిలో భారతీయుడి దుర్మరణం

జూన్ 6: బహ్రెయిన్, కువైట్‌లపై బాలిస్టిక్ క్షిపణుల వర్షం కురిపించిన ఇరాన్

జూన్ 7: చర్చల ప్రక్రియలో కదలిక తెచ్చిన పాక్

జూన్ 8: కాల్పుల విరమణకు తూట్లుపొడుస్తూ పరస్పర దాడులకు దిగిన ఇజ్రాయెల్, ఇరాన్

జూన్ 9: అమెరికా ఆర్మీ హెలికాప్టర్‌ను కూల్చేసినందుకు ప్రతీకారం తీర్చుకుంటానన్న ట్రంప్

జూన్ 10: పలావూ జెండాతో ఉన్న నౌకపై అమెరికా దాడిలో ముగ్గురు భారతీయుల దుర్మరణం

జూన్ 15: కాల్పులకు ముగింపు పలుకుతూ ఒప్పందం కుదుర్చుకోబోతున్నామని ట్రంప్ ప్రకటన

### ఒప్పందంలో ఏముంది ?

మరో మూడ్రోజుల్లో ముసాయిదా ఒప్పందంపై అమెరికా, ఇరాన్‌లు సంతకాలుచేసి తదుపరి సమగ్రమైన సంప్రదింపుల ప్రక్రియకు తెరలేపనున్నారనే వార్తల నేపథ్యంలో అసలు ఈ ముసాయిదా ఒప్పందంలో ఏమేం అంశాలను పొందుపరిచారనే ఆసక్తి ప్రపంచ దేశాల్లో ఎక్కువైంది. హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై సుంకాలు విధిస్తారా? అణ్వాయుధం తయారీ కోసం ఇప్పటికే అత్యంత నాణ్యమైన యురేనియం శుద్ధికి సాహసించిన ఇరాన్‌ను ఆ దిశగా మరో అడుగు ముందుకువేయకుండా అమెరికా షరతు విధించింది? అనే పలు సందేహాల నడుమ ఇరాన్ మీడియా ఈ ముసాయిదాలోని 14 అంశాలను సంపాదించిందని కథనాలు వెలువడ్డాయి. సైనిక, ఆర్థిక, అణు అంశాలతో ఈ ముసాయిదాను సిద్ధంచేసినట్లు తెలుస్తోంది. ఈ అంశాల గురించి క్లుప్తంగా...

1. అమెరికా, ఇరాన్ దశాబ్దాల శత్రుత్వాలకు ఇకనైనా ముగింపు పలకడం
2. ముడి చమురు సహా వాణిజ్య వస్తూత్పత్తుల సరఫరా కోసం నౌకల రాకపోకల నిమిత్తం హార్మూజ్ తెరవడం
3. ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా విధించిన ఆంక్షలు, అమెరికా నావికాదళ దిగ్బంధాన్ని ఎత్తేయడం
4. చర్చలు ఓవైపు జరుగుతుండగా ఒప్పందం తమకు అనుకూలంగా కుదిరేలా ఇరాన్‌పై ఒత్తిడి పెంచేలా ఆ దేశంపై అమెరికా కొత్తగా ఆంక్షలు విధించకపోవడం
5. ఈలోపు ఇరాన్ ముడి చమురు ఎగుమతులపై తక్షణం ఆంక్షలు ఎత్తేయడం
6. విదేశీ బ్యాంకుల ఖాతాల్లో అమెరికా, మిత్రదేశాలు స్తంభింపజేసిన ఇరాన్ ప్రభుత్వానికి చెందిన వేల కోట్ల డాలర్ల నిధులను విడుదలచేయడం
7. కనీసం 60 రోజులపాటు నిరాటంకంగా సవ్యంగా సంప్రదింపులు జరపడం
8. ఇరాన్ ఇకపై అణ్వస్త్ర సమీకరణ కోసం ప్రయత్నాలను విరమించుకోవడం
9. ఇరాన్ ఇకపై మిలటరీ గ్రేడ్‌లో నాణ్యత స్థాయికి యురేనియంను శుద్ధిచేయకుండా మిన్నకుండిపోవడం
10. అణు కేంద్రాల విస్తరణ ప్రతిపాదనలను ఇరాన్ పక్కనపడేయడం
11. అణుకేంద్రాలపై అమెరికా బాంబర్ దాడులతో భూస్థాపితమైన శుద్ధయురేనియం అప్పగింత లేదా నిర్వీర్యంచేయడంపై చర్చలు జరపడం
12. పశ్చిమాసియాలో యుద్ధం ముగిసిందని స్పష్టమయ్యేలా ఇరాన్ సైనిక చర్యలను ఉపసంహరించుకోవడం
13. ఆర్థికపర ఆంక్షలను అమెరికా ఎత్తేయడంతోపాటు ఇరాన్ పునర్నిర్మాణ కార్యక్రమానికి కృషిచేయడం
14. సమగ్రమైన తుది ఒప్పందం కోసం కృషిచేయడం

### తెరమీదకు మరికొన్ని అంశాలు!

ఇవిగాక మరిన్ని ప్రతిపాదనలు ముసాయిదా ఒప్పందంలో ఉన్నాయని మీడియాలో వార్తలొచ్చాయి. ఇరాన్‌కు 300 బిలియన్ డాలర్లతో ఆర్థికాభివృద్ధి ప్యాకేజీని ట్రంప్ అందించడం, ఇరాన్‌లో అమెరికా సంస్థలు దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టి ఇరాన్ పునరుజ్జీవనానికి పాటుపడటం, ఆర్థికసహకారం, రుణాలు అందివ్వడం, భవిష్యత్‌లో ఉద్రిక్తతలు తలెత్తకుండా తగు పరస్పర సహకార విభాగాలను ఏర్పాటుచేయడం, గ్లోబల్ మార్కెట్లతో ఇరాన్‌ను మరింతగా అనుసంధానం చేయడం వంటివీ ఇందులో ఉన్నాయని వార్తలొచ్చాయి. పరస్పర దాడులు ఆపేస్తే సరిపోదని అంతర్జాతీయ నిపుణులు భావిస్తున్నారు. “ఇరాన్ యుద్ధంలో కీలకమైన నాలుగు అంశాలు దాగి ఉన్నాయి. చమురు సంక్షోభం భవిష్యత్‌లో తలెత్తకుండా సుంకాల్లేకుండా చమురు నౌకల రాకపోకలను శాశ్వతంచేయడం, దెబ్బతిన్న ఇరాన్ ఆర్థికవ్యవస్థ మళ్లీ పుంజుకునేలా పలు సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందివ్వడం, అణ్వస్త్ర సామర్థ్యంలేకపోవడంతోనే తమపై అగ్రదేశాలు దాడులుచేస్తున్నాయనే భావన ఇరాన్‌లో లేకుండా చేయడం, తద్వారా ఇరాన్.. లెబనాన్(హెజ్‌బొల్లా), యెమెన్(హూతీ), గాజా(హమాస్)లో పరోక్ష సైన్యాలను పెంచిపోషించకుండా అడ్డుకోవడం వంటివి చేయగలిగితేనే పశ్చిమాసియాలో శాశ్వత శాంతి సుసాధ్యమవుతుంది”అని నిపుణులు విశ్లేషించారు.

### తర్వాత ఏం జరగొచ్చు?

ప్రతిపాదిత ముసాయిదా ఒప్పందం అమల్లోకి వచ్చాక తొలి 60 రోజులపాటు హార్మూజ్ తెరుచుకోవడంతో చమురు సంక్షోభం తాత్కాలికంగా సద్దుమణిగే ఆస్కారముంది. అయితే ఈ 60 రోజుల్లో సమగ్ర శాంతి ఒప్పందం కుదిరితే అందరికీ లాభమే. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే సమస్య మళ్లీ మొదటికొస్తుంది. ఏళ్ల తరబడి ఇరాన్‌పై అమెరికా సహా ఏ దేశమూ ఆంక్షలు విధించకుండా చూసుకోవడం, ఒప్పందాన్ని సమగ్రస్థాయిలో అమలుచేసే వ్యవస్థను కొలువుతీర్చడం, ఇరాన్ దొంగచాటుగా యురేనియంను శుద్ధిచేయకుండా అడ్డుకోవడం వంటివి కీలకంగా మారనున్నాయి. 14 అంశాలపై ఇరుదేశాలు ఉమ్మడిగా ఏకాభిప్రాయానికొస్తే చరిత్రాత్మక శాంతి ఒప్పందానికి ఈ 14 అంశాలే మూలస్తంభాలుగా నిలుస్తాయి.

# ట్రంప్ బిగ్ గేమ్!
# అమెరికా రాజకీయాల్లో ఇజ్జత్ కా సవాల్




అమెరికా రాజకీయాల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభావం ఇప్పటికీ బలంగానే కొనసాగుతోంది. ఆయన మద్దతు లభిస్తే ఎన్నికల్లో విజయం దాదాపు ఖాయమనే (స్ట్రయిక్ రేటు ఎక్కువ) అభిప్రాయం రిపబ్లికన్ పార్టీలో గట్టిగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో టెక్సాస్ సెనేట్ ఎన్నికలు ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉత్కంఠను రేపుతున్నాయి. ట్రంప్ మద్దతు పొందిన కెన్ పాక్స్టన్ ప్రైమరీలో తొలి అడ్డంకిని దాటి, ఇప్పుడు ప్రధాన ఎన్నికల పోరుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ట్రంప్ తీసుకునే తదుపరి రాజకీయ నిర్ణయం పై అందరి దృష్టి నిలిచింది. టెక్సాస్ చాలా కాలంగా రిపబ్లికన్ పార్టీకి బలమైన కోటగా ఉంది. ఇటీవల జరిగిన రిపబ్లికన్ ప్రైమరీలో ట్రంప్ మద్దతుతో రాష్ట్ర అటార్నీ జనరల్ కెన్ పాక్స్టన్, సీనియర్ సెనేటర్ జాన్ కార్నిన్‌ను ఓడించి అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్నారు. అయితే ప్రైమరీలో గెలవడం ఒక విషయం అయితే, సాధారణ ఎన్నికల్లో మొత్తం రాష్ట్ర ఓటర్లను ఆకట్టుకోవడం మరో విషయం. ఈ పరిస్థితుల్లో కెన్ పాక్స్టన్‌కు ఎదురవుతున్న గట్టి పోటీని రిపబ్లికన్ పార్టీ కీలక పరీక్షగా చూస్తోంది. డెమోక్రటిక్ పార్టీ తరఫున జేమ్స్ టలారికో నుంచి పెరుగుతున్న సవాల్, ఆయన బలమైన ఫండ్‌రైజింగ్, అలాగే పాక్స్టన్‌పై ఉన్న పాత అవినీతి ఆరోపణలు రిపబ్లికన్లకు రాజకీయంగా ప్రతికూలంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో టెక్సాస్ సెనేట్ పోరు రిపబ్లికన్ పార్టీకి “ఇజ్జత్ కా సవాల్”గా మారిందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన మద్దతుతో అభ్యర్థిగా నిలిచిన కెన్ పాక్స్టన్‌ను గెలిపించేందుకు ట్రంప్ తన వద్ద ఉన్న అత్యంత భారీ ఎన్నికల నిధిని ఖర్చు చేస్తారా లేదా? ఇదే ఇప్పుడు రిపబ్లికన్ పార్టీలో చర్చకు దారితీసింది రిపబ్లికన్లకు ట్రంప్ వద్ద ఉన్న నిధి కీలకంగా కనిపిస్తోంది. అమెరికాలో ఎన్నికలు అత్యంత ఖరీదైన రాజకీయ ప్రక్రియల్లో ఒకటి. టెలివిజన్ ప్రకటనలు, సోషల్ మీడియా ప్రచారం, ప్రజా సమావేశాలు, ప్రచార బృందాలు, ఓటర్లను చేరుకునే కార్యక్రమాల కోసం కోట్లాది డాలర్లు అవసరమవుతాయి. అందుకే రాజకీయ నాయకులు, పార్టీలు ముందుగానే భారీ మొత్తంలో విరాళాలు సేకరిస్తుంటాయి. ట్రంప్‌కు అనుబంధంగా ఉన్న మాగా , సూపర్ పాక్ వద్ద ప్రస్తుతం 356 మిలియన్ డాలర్ల(సుమారు రూ.3,000 కోట్లు) నిధి ఉంది. ఇది అమెరికా రాజకీయాల్లో అత్యంత భారీ ఎన్నికల నిధుల్లో ఒకటిగా భావిస్తున్నారు. ఈ డబ్బు ప్రధానంగా ట్రంప్ అభిమానులు, వ్యాపారవేత్తలు, పార్టీ మద్దతుదారుల విరాళాల ద్వారా సమీకరించబడింది. అయితే.. ట్రంప్ ఈ డబ్బును టెక్సాస్ కోసం పాక్స్టన్ కోసం ఖర్చు చేస్తే ఏమవుతుంది?.. రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, భారీ ప్రకటనలు, ప్రచార కార్యక్రమాలు, ప్రత్యర్థులపై రాజకీయ దాడులు చేపట్టేందుకు అవకాశం లభిస్తుంది. దీంతో పాక్స్టన్‌కు ఎన్నికల్లో స్పష్టమైన ఊతం లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా టలారికో ఆర్థిక బలాన్ని ఎదుర్కోవడానికి ఇది ఉపయోగపడవచ్చు. అయితే ట్రంప్ ఈ నిధిని ఖర్చు చేయకుండా దాచిపెడితే పరిస్థితి భిన్నంగా ఉండొచ్చు. పాక్స్టన్ తన సొంత నిధులతోనే ఎన్నికల పోరాటం చేయాల్సి వస్తుంది. ఒకవేళ టెక్సాస్ వంటి కీలక రాష్ట్రంలో రిపబ్లికన్లు ఓడిపోతే, అమెరికా సెనేట్‌లో పార్టీ బలం తగ్గే అవకాశం ఉంటుంది. అలా జరిగితే భవిష్యత్తులో ట్రంప్ రాజకీయ అజెండాను అమలు చేయడంలో కూడా ఇబ్బందులు తలెత్తవచ్చు. అలాగే.. ట్రంప్ నిధిని వెంటనే ఖర్చు చేయకూడదని భావించే వర్గాలు కూడా ఉన్నాయి. 2026 మధ్యంతర ఎన్నికలతో పాటు రాబోయే జాతీయ రాజకీయ పోరాటాల కోసం ఈ డబ్బును నిల్వ ఉంచడం వ్యూహాత్మకంగా మంచిదని వారు వాదిస్తున్నారు. అందుకే ట్రంప్ ఇప్పటివరకు తన తుది నిర్ణయాన్ని వెల్లడించలేదు. మొత్తంగా చూస్తే, టెక్సాస్ ఎన్నిక ఇప్పుడు కేవలం ఒక సెనేట్ సీటు కోసం జరిగే పోటీ కాదు. ట్రంప్ రాజకీయ ప్రభావం, ఆయన ఆర్థిక శక్తి, అలాగే రిపబ్లికన్ పార్టీ భవిష్యత్తు వ్యూహాలకు సంబంధించిన కీలక పరీక్షగా మారింది. ట్రంప్ తన ‘రూ.3,000 కోట్ల’ రాజకీయ నిధిని తెరపైకి తీసుకొస్తారా? లేదంటే సరైన సమయం కోసం దాచిపెడతారా?.. ఇప్పుడు అమెరికా రాజకీయాల్లో ఈ బిగ్ గేమ్ హాట్ టాపిక్‌గా మారింది.

## సువేందు అధికారిపై మమత న్యాయపోరాటం..

# భవానీపూర్ ఫలితంపై పిటిషన్

### భవానీపూర్ ఎన్నికల ఫలితంపై హైకోర్టులో మమత పిటిషన్

### సీఎం సువేందు అధికారి విజయాన్ని సవాల్ చేసిన దీదీ

### 15,015 ఓట్ల తేడాతో ఓటమిని ప్రశ్నించిన తృణమూల్ అధినేత్రి

### కౌంటింగ్‌లో అక్రమాలు జరిగాయని పిటిషన్‌లో ఆరోపణ

### 2021 నందిగ్రామ్ తర్వాత మళ్లీ సువేందుపై కోర్టుకెక్కిన మమత

పశ్చిమ బెంగాల్: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మరోసారి న్యాయపోరాటానికి దిగారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గ ఫలితాన్ని సవాల్ చేస్తూ ఆమె మంగళవారం కలకత్తా హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ధృవీకరించేందుకు మమత స్వయంగా హైకోర్టు రిజిస్ట్రీకి హాజరైనట్లు సమాచారం. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భవానీపూర్ నియోజకవర్గంలో బీజేపీ నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ 15,015 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఒకప్పుడు టీఎంసీకి కంచుకోటగా ఉన్న ఈ స్థానంలో ఓడిపోవడాన్ని ఆమె జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, ఫలితాలపై న్యాయవిచారణ జరపాలని ఆమె తన పిటిషన్‌లో కోరారు. ఎన్నికలకు సంబంధించిన రికార్డులను భద్రపరచాలని కూడా విజ్ఞప్తి చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించి, సువేందు అధికారి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే, సువేందు అధికారిపై మమతా బెనర్జీ కోర్టును ఆశ్రయించడం ఇది రెండోసారి. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్ నియోజకవర్గంలో సువేందు చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయినప్పుడు కూడా మమత హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ ఇప్పటికీ కోర్టులో పెండింగ్‌లో ఉంది. తాజా పరిణామంతో మమత, సువేందు మధ్య రాజకీయ వైరం మరింత తీవ్రస్థాయికి చేరింది. ఈ పిటిషన్‌పై బీజేపీ గానీ, సువేందు అధికారి గానీ తక్షణమే స్పందించలేదు.

# 'దిశ' ఫెయిల్.. 'శక్తి' సక్సెస్: అనిత

### ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందన్న అనిత

### గత ప్రభుత్వ హయాంలో దిశ చట్టం అమలు కాలేదని విమర్శ

### ఇప్పటి వరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేశామని వెల్లడి

అమరావతి: ఏ రాష్ట్రానికైనా పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే అక్కడ శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉండాలని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో కూటమి ప్రభుత్వ పోలీసింగ్ తీరుపై ఆమె పూర్తి స్థాయి రిపోర్ట్ కార్డ్‌ను బయటపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో 'దిశ' చట్టం అమలు కాలేదని విమర్శిస్తూ.. తమ హయాంలో క్రైం రేట్ గణనీయంగా తగ్గిందని లెక్కలతో సహా వివరించారు. ఏపీలో క్రైం రేటు 14.1 శాతం తగ్గిందని హోంమంత్రి వెల్లడించారు. సీసీటీవీలు, డ్రోన్ టెక్నాలజీ వాడకం వల్లే ఇది సాధ్యమైందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాల టార్గెట్ పెట్టుకోగా, ఇప్పటికే 70 శాతం పూర్తి చేశామని, నేరం జరిగిన 24 గంటల్లోనే నిందితులను పట్టుకుంటున్నామని చెప్పారు. మహిళలపై నేరాల్లో 6.9 శాతం తగ్గుదల నమోదైందని తెలిపారు. తాము ఐజీ స్థాయి అధికారితో 'శక్తి యాప్' తెచ్చామని, దీనిని 1.5 కోట్ల మంది డౌన్లోడ్ చేసుకున్నారని తెలిపారు. లైంగిక నేరాల దర్యాప్తు నాణ్యత 31 శాతం నుంచి ఏకంగా 90 శాతానికి పెరిగిందని, 591 మందికి శిక్షలు పడ్డాయని వివరించారు. 'ఈగల్ టీమ్' ద్వారా నార్కోటిక్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని, ఏపీ మోడల్‌ను తెలంగాణ కూడా అనుసరిస్తుండడం మనకు గర్వకారణమన్నారు. ఇప్పటివరకు 2,366 గంజాయి కేసులు నమోదు చేసి, 986 మందిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే సైబర్ క్రైమ్స్ కోసం ప్రత్యేక 'వార్ రూమ్' ఏర్పాటు చేస్తున్నామని, రూ. 247 కోట్ల సైబర్ ఫ్రాడ్ మనీని ఫ్రీజ్ చేయడంతో పాటు 8 వేలకు పైగా ఇల్లీగల్ ఆన్‌లైన్ కంటెంట్‌ను తొలగించామని స్పష్టం చేశారు.

# అణ్వస్త్ర రాశులు!

### దేశాల వద్ద పోగు పడ్డ అణుబాంబులు

### ఇప్పటిదాకా 9 దేశాల వద్ద అణుపాటవం

### 5,459 అణు వార్‌హెడ్లతో టాప్‌లో రష్యా

### అమెరికా వద్ద 5,277 అణ్వాయుధాలు

ఇరాన్‌తో అమెరికా అణు చర్చలు చెప్పుకోదగ్గ పురోగతి సాధిస్తున్నా లెక్కచేయకుండా అధ్యక్షుడు ట్రంప్ దానిపై ఉన్నట్టుండి యుద్ధానికి తెర తీశారు. ఆ దేశం ఎన్నటికీ అణ్వస్త్రాలను తయారు చేయకుండా అడ్డుకోవడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఇజ్రాయెల్‌తో కలిసి ఉన్నపళంగా ఇరాన్‌పై అంత స్వేచ్ఛగా దాడికి దిగగలిగారంటే దానివద్ద అణు బాంబులు లేకపోవడమే కారణమని చెప్పవచ్చు. ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగిన రష్యాపై మాత్రం ట్రంప్ ఎంతగా కత్తులు నూరినా, నాలుగేళ్లుగా కఠిన ఆంక్షలు తదితర చర్యలకే పరిమితమయ్యారే తప్ప ఎన్నడూ యుద్ధానికి దిగే సాహసం చేయలేదు. ఆ దేశం వద్ద అపారంగా పోగుపడ్డ అణ్వాయుధ నిల్వలే అందుకు ప్రధాన కారణమన్నది బహిరంగ రహస్యం. ఈ నేపథ్యంలో ప్రపంచంలో అణుపాటవమున్న దేశాలెన్ని, వాటి వద్ద ఎన్ని అణ్వాయుధాలున్నాయి అన్నది ఓసారి చూస్తే... అణ్వస్త్ర దేశాల జాబితాలో అగ్రాసనం అమెరికా, రష్యాలదే. ప్రపంచంలోని మొత్తం అణుబాంబుల్లో 90 శాతానికి పైగా ఈ రెండు దేశాల వద్దే పోగుపడ్డాయి! ఆ రెండింట్లో సంఖ్యాబలం రీత్యా రష్యాదే పైచేయి. అమెరికా వద్ద 5,277 అణు బాంబులుంటే రష్యా వద్ద ఏకంగా 5,459 దాకా పోగుపడ్డాయి! అమెరికా తన అణ్వాయుధాలను బెల్జియం, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, టర్కీల్లో కూడా మోహరించి ఉంచడం విశేషం! రష్యా కూడా తన అణ్వాస్త్రాల్లో కొన్నింటిని మిత్ర దేశం బెలారస్‌లో ఉంచింది. ఇతర అణ్వస్త్ర దేశాల్లో ఇజ్రాయెల్, ఉత్తర కొరియా వద్ద ఉన్న అణుబాంబుల సంఖ్యపై కచి?చతమైన స్పష్టత లేదు. ఇజ్రాయెల్ వద్ద కనీసం 200 అణు బాంబుల తయారీకి అవసరమైన అన్ని వనరులూ ఉన్నట్టు చెబుతారు. ఆ దేశం ఇప్పటికే 90 అణు బాంబులను తయారు చేసిందని అంచనా. ఉత్తర కొరియా కూడా 50 అణు బాంబుల తయారీకి అవసరమైన యురేనియం తదితరాలను పలు మార్గాల సేకరించి ఉంచుకున్నట్టు రక్షణ నిపుణులు చెబుతున్నారు. అణు పాటవమున్న మొత్తం 9 దేశాల వద్దా కలిపి 12,341 అణు బాంబులున్నట్టు ఫెడరేషన్ ఆఫ్ ఆటమిక్ సైంటిస్ట్స్ 2025 నివేదిక చెబుతోంది. వాటిలో 9,600కు పైగా అణు వార్‌హెడ్‌లు ఏ క్షణంలోనైనా ప్రయోగించేందుకు సిద్ధంగా ఆయా దేశాల సైన్యం నియంత్రణలో ఉన్నట్టు సమాచారం. అయితే ప్రచ్ఛన్నయుద్ధ కాలంతో పోలిస్తే ఇది చాలా తక్కువే కావడం విశేషం. ఆ సమయంలో ప్రపంచ దేశాలన్నింటి దగ్గరా కలిపి ఏకంగా 70 వేల పై చిలుకు అణు వార్‌హెడ్‌లు పోగుపడ్డాయి!.

## మెట్రోపై రగడ.. ఐఆర్‌ఎఫ్‌సీ రుణాలకు

# సాంకేతిక ఇబ్బందులున్నాయి: కిషన్ రెడ్డి

### తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్న కిషన్‌రెడ్డి

### మెట్రో విస్తరణకు సహకరిస్తున్నామని వ్యాఖ్య

### అభివృద్ధిపై తమకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదన్న కేంద్ర మంత్రి

### తాను చెబితే ప్రాజెక్టులు ఆగవన్న కిషన్‌రెడ్డి

### దిగజారుడు రాజకీయాలు చేయొద్దంటూ విమర్శలు

హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో విస్తరణను కేంద్రం అడ్డుకుంటోందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఖండించారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మెట్రో రైలు ప్రాజెక్టు విషయంలో రేవంత్ తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 అమలుకు కేంద్రం రూ.1,200 కోట్లు అందించిందని వెల్లడించారు. మెట్రో విస్తరణ కోసం మరింత చురుగ్గా పనిచేయాలని తానే రేవంత్‌రెడ్డికి లేఖ రాశానన్నారు. ఐఆర్‌ఎఫ్‌సీ ద్వారా రుణం పొందేందుకు కూడా కేంద్రం సహకరిస్తోందని చెప్పారు. ఐఆర్‌ఎఫ్‌సీ రూ.13 వేల కోట్ల రుణ ప్రతిపాదన విషయంలో కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయని తెలిపారు. వాటిని కేంద్రంతో చర్చించి పరిష్కరించుకోవాల్సింది పోయి రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. ఆ సమస్యను తనపై నెట్టేందుకు ప్రయత్నించడం బాధాకరమన్నారు. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిపై తమకు ఎవరూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ ప్రాజెక్టు, ఎన్‌టీపీసీ విద్యుత్ ప్రాజెక్టు, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో కేంద్రం సహకరిస్తోందన్నారు. మూసీ పునరుజ్జీవన కార్యక్రమానికి అవసరమైన రుణాల మంజూరుకు కూడా కేంద్రం ఎన్‌ఓసీ ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కేంద్రం ఎలాంటి వివక్ష చూపదని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. దిగజారుడు రాజకీయాలకు పాల్పడకుండా అభివృద్ధి అంశాలపై కేంద్రంతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. కిషన్‌రెడ్డి చెప్పినంత మాత్రాన ప్రాజెక్టులు ఆగిపోవని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని రేవంత్‌రెడ్డికి హితవు పలికారు.

# ఆశలన్నీ ఇంక ఆ నలుగురి మీదే!



అమెరికా అంతరిక్ష సంస్థ నాసా మరో ముందడుగు వేసింది. దశాబ్దాల తర్వాత చంద్రుడిపైకి మనుషుల్ని దింపాలనే లక్ష్యంతో చేపట్టిన ప్రతిష్ఠాత్మక ఆర్టెమిస్ మిషన్‌కు సంబంధించిన ఓ ప్రకటన చేసింది. ఆర్టెమిస్-3 మిషన్‌కు ఎంపికైన నలుగురు వ్యోమగాముల పేర్లను ప్రకటించింది. భవిష్యత్‌లో చంద్రుడిపై మానవుల శాశ్వత ఉనికికి బాటలు వేసే కీలక మిషన్ ఇది. అలాంటప్పుడు ఈ నలుగురినే ఎందుకు ఎంచుకున్నారనే చర్చ ఇప్పుడు జోరందుకుంది. నాసా ఎంపిక చేసిన ఈ బృందంలో కమాండర్ రాండీ బ్రెస్నిక్, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన పైలట్ లూకా పార్మిటానో, నాసా వ్యోమగాములు ఫ్రాంక్ రూబియో, ఆండ్రే డగ్లస్ ఉన్నారు. ఇందులో ఆండ్రే డగ్లస్‌ను మినహాయిస్తే మిగతా ముగ్గురు అంతరిక్షయానం చేసి ఉన్నారు. అలాగే అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో విధులు నిర్వహించిన అనుభవం, టెస్ట్ పైలటింగ్ నైపుణ్యాలు, క్లిష్ట పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వీరిని ఎంపిక చేసినట్లు నాసా వెల్లడించింది. అలాగని వాళ్ల బ్యాక్‌గ్రౌండ్‌లు ఆషామాషీగా లేవు..

రాండీ బ్రెస్నిక్: మిషన్‌కు సారథి

ఆర్టెమిస్-3 కమాండర్‌గా ఎంపికైన రాండీ బ్రెస్నిక్ నాసాలో అత్యంత అనుభవజ్ఞులైన వ్యోమగాముల్లో ఒకరు. అమెరికా మెరైన్ కార్ప్స్ మాజీ పైలట్ అయిన ఆయన వేల గంటలపాటు యుద్ధ విమానాలను, టెస్టింగ్ ఫ్లైట్స్ నడిపారు. ఇప్పటికే రెండు అంతరిక్ష ప్రయాణాలు పూర్తి చేసిన ఆయన అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో కమాండర్‌గా కూడా సేవలందించారు. పలు స్పేస్‌వాక్‌లలో పాల్గొని అంతరిక్షంలో క్లిష్టమైన పనులను విజయవంతంగా పూర్తి చేశారు. దీర్ఘకాలిక మిషన్ల నిర్వహణలో ఆయన అనుభవమే ఆర్టెమిస్-3లో ప్రధాన బలంగా భావిస్తున్నారు.

లూకా పార్మిటానో: యూరప్ అంతరిక్ష వీరుడు

ఇటలీకి చెందిన లూకా పార్మిటానో యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఙూూూ) తరఫున ఈ బృందంలో చోటు దక్కించుకున్నారు. మాజీ ఫైటర్ పైలట్ అయిన ఆయన ఇప్పటికే రెండు అంతరిక్ష యాత్రలు పూర్తి చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి కమాండర్‌గా వ్యవహరించిన తొలి ఇటాలియన్‌గా రికార్డు సృష్టించారు. స్పేస్‌వాక్‌లలో విశేష అనుభవం ఉన్న ఆయన అంతరిక్షంలో సాంకేతిక సమస్యలను పరిష్కరించడంలో నైపుణ్యం కలిగిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆర్టెమిస్-3లో ఆయన ఎంపిక నాసా-యూరప్ అంతరిక్ష సహకారానికి ప్రతీకగా నిలుస్తోంది.

ఫ్రాంక్ రూబియో: రికార్డు సృష్టించిన వ్యోమగామి

నాసా వ్యోమగామి ఫ్రాంక్ రూబియో పేరు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడానికి కారణం ఆయన అంతరిక్షంలో గడిపిన సమయం. అమెరికన్ వ్యోమగాముల్లో అత్యధిక కాలం నిరవధికంగా అంతరిక్షంలో ఉన్న వ్యక్తిగా ఆయన రికార్డు నెలకొల్పారు. వైద్యుడిగా, సైనిక అధికారిగా సేవలందించిన అనుభవం కూడా ఆయనకు ఉంది. మానవ శరీరంపై అంతరిక్ష ప్రభావాలను అధ్యయనం చేయడంలో ఆయన అనుభవం ఆర్టెమిస్-3 మిషన్‌కు ఎంతో ఉపయోగపడనుంది.

ఆండ్రే డగ్లస్: ఇంట్రెస్టింగ్

ఈ బృందంలో అత్యంత ఆసక్తికరమైన ఎంపిక ఆండ్రే డగ్లస్. ఇంజినీరింగ్, రోబోటిక్స్, మానవ-యంత్ర వ్యవస్థలపై నైపుణ్యం కలిగిన ఆయన చంద్రుడిపై భవిష్యత్ కార్యకలాపాల కోసం అవసరమైన సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. అంతరిక్ష ప్రయాణ అనుభవం తక్కువగా ఉన్నప్పటికీ, భవిష్యత్ చంద్రయాత్రల సాంకేతిక రూపకల్పనలో ఆయన చేసిన కృషిని గుర్తించి నాసా ఈ బృందంలో చోటు కల్పించింది.

అమెరికా-యూరప్ కలయిక

ఆర్టెమిస్-3 బృందంలో ముగ్గురు అమెరికన్ వ్యోమగాములతో పాటు ఒక యూరోపియన్ వ్యోమగామికి చోటు కల్పించడం యాదృచ్ఛికం కాదు. చంద్రుడిపై భవిష్యత్ అన్వేషణలు ఒక్క దేశం ఆధిపత్యంలో కాకుండా అంతర్జాతీయ భాగస్వామ్యంతో సాగుతాయనే సందేశాన్ని నాసా ఇవ్వాలనుకుంటోంది. ఆర్టెమిస్ కార్యక్రమంలో యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ కీలక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. అందుకే లూకా పార్మిటానో ఎంపికకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

ఇది ట్రయల్ మాత్రమే!

ఈ నలుగురి బాధ్యత చంద్రుడిపై అడుగుపెట్టడం మాత్రమే కాదు. భవిష్యత్‌లో చంద్రుడిపై మానవ స్థావరాలు ఏర్పాటు చేయడం, అక్కడి నుంచి అంగారక గ్రహ యాత్రలకు పునాది వేయడం వంటి మహత్తర లక్ష్యాలకు అవసరమైన సాంకేతికతను పరీక్షించడం. అందుకే ఆర్టెమిస్-3 బృందాన్ని నాసా సాధారణ వ్యోమగాముల బృందంగా కాకుండా, మానవ అంతరిక్ష అన్వేషణ తదుపరి అధ్యాయాన్ని రాసే బృందంగా అభివర్ణిస్తోంది. ఇప్పటికే ఆర్టెమిస్-1 ద్వారా మానవరహిత పరీక్షా ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తి చేసిన నాసా, ఆర్టెమిస్-2 ద్వారా వ్యోమగాములను చంద్రుడి చుట్టూ తిప్పి భూమికి తీసుకొచ్చింది. ఇప్పుడు ఆర్టెమిస్-3తో మరింత కీలక దశలోకి ప్రవేశిస్తోంది. కానీ, ఇక్కడో క్లారిటీ అవసరం. ఆర్టెమిస్-3 మనుషుల్ని చంద్రుడి మీదకు దించే యాత్ర కాదు. భవిష్యత్‌లో చంద్రుడిపై వ్యోమగాములను సురక్షితంగా దించేందుకు అవసరమైన అత్యంత కీలక సాంకేతిక ప్రక్రియలను పరీక్షించడమే దీని ప్రధాన లక్ష్యం. సుమారు రెండు వారాల పాటు కొనసాగే ఈ మిషన్‌లో వ్యోమగాములు భూమి కక్ష్యలోనే ఉండి చంద్రుడిపై దిగే ల్యాండర్లతో డాకింగ్ ప్రక్రియను సాధన చేస్తారు. భవిష్యత్ చంద్రయాత్రల్లో ఎదురయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, వాటికి సంబంధించిన కీలక సమాచారాన్ని సేకరిస్తారు. ఈ మిషన్‌లో మరో ఆసక్తికర అంశం.. ప్రైవేట్ కంపెనీల పాత్ర. జెఫ్ బెజోస్‌కు చెందిన బ్లూ ఒరిజిన్ అభివృద్ధి చేస్తున్న 'బ్లూ మూన్' ల్యాండర్, ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ రూపొందిస్తున్న 'స్టార్‌షిప్' హ్యూమన్ ల్యాండింగ్ సిస్టమ్‌లతో ఈ వ్యోమగాములు డాకింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. భవిష్యత్ అంతరిక్ష యుగంలో ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు కలిసి ఎలా పనిచేయబోతున్నాయో ఈ మిషన్ ప్రత్యక్ష ఉదాహరణగా నిలవనుంది. కాబట్టి.. నాసా "మూన్ ల్యాండింగ్‌కు ముందు ఫైనల్ రిహార్సల్"గా అభివర్ణిస్తోంది.

అందుకే కీలకం

అంటే ఆర్టెమిస్-3 అనేది చంద్రయాత్రకు ముందు చివరి పరీక్ష. భవిష్యత్‌లో చంద్రుడిపై దిగే వ్యోమగాముల భద్రతకు అవసరమైన సాంకేతిక, శాస్త్రీయ సమాచారాన్ని నాసా సేకరిస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆర్టెమిస్-3 బృందం ప్రకటన ఒక సాధారణ కార్యక్రమం కాదు. ఇప్పటివరకు డిజైన్, ఇంజినీరింగ్ దశలో ఉన్న మిషన్ ఇప్పుడు మానవ ప్రయాణానికి సిద్ధమవుతోందనే సంకేతం. 1972లో అపోలో-17 మిషన్ అనంతరం మానవుడు మళ్లీ చంద్రుడిపై అడుగుపెట్టలేదు. దాదాపు ఐదు దశాబ్దాల విరామం తర్వాత మానవులను తిరిగి చంద్రుడిపై దించాలన్న లక్ష్యంతో నాసా ఆర్టెమిస్ కార్యక్రమాన్ని చేపట్టింది. దీర్ఘకాలికంగా చంద్రుడిపై స్థిరమైన మానవ స్థావరాలు ఏర్పాటు చేయడం, అక్కడి నుంచి అంగారక గ్రహ యాత్రలకు పునాది వేయడం నాసా లక్ష్యం. ఆ లక్ష్య సాధనలో ఆర్టెమిస్-3 కీలక మలుపుగా మారనుంది. ఈ మిషన్ విజయవంతమైతే 2028లో చేపట్టే ఆర్టెమిస్-4 ద్వారా మానవులు చంద్రుడిపై అడుగుపెట్టే మార్గం మరింత సుగమం కానుంది. అయితే.. ఈ నలుగురు ఆర్టెమిస్-3లో పాల్గొనే నలుగురే కావొచ్చు.. కాకపోవచ్చు. కానీ, నాసా ఆశలన్నీ ఇప్పుడు వీళ్లపైనే ఉన్నాయి. ఇంకా ఒక ఆసక్తికర విషయం ఏమిటంటే, ఆర్టెమిస్-4లో నలుగురు వ్యోమగాములు చంద్ర కక్ష్యకు వెళ్తారు. వారిలో ఇద్దరు మాత్రమే ల్యాండర్‌లో చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతానికి దిగుతారు. అక్కడ వారం రోజుల పాటు శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించి తిరిగి ఓరియన్ వ్యోమనౌకలో చేరతారు.

# డాక్టర్ రోబో.. ఫైవ్ ఇన్ వన్!

కాలం మారిపోతోంది. ఒకప్పుడు కత్తులతో శరీరాన్ని కోసి చేసిన శస్త్రచికిత్సలు ఇప్పుడు చిన్న కోతలతో పూర్తవుతున్నాయి. మెరుగైన ఫలితాలిస్తున్నాయి. రోగులకు ఆ చిన్న కోతల బాధ కూడా లేకుండా చేసేందుకు సింగపూర్‌లోని నాన్‌యాంగ్ టెక్నలాజికల్ యూనివర్శిటీ(ఎన్‌టీయూ) శాస్త్రవేత్తలు ఓ అద్భుతమైన రోబోను ఆవిష్కరించారు. శనగ గింజంత సైజుండే ఈ బుల్లి రోబో చేసే అద్భుతాలు అన్ని ఇన్నీ కావు.. పక్క ఫొటో చూశారా? అందులో శాస్త్రవేత్త చేతిలో కనిపిస్తున్న నల్లటి వస్తువే మన బుల్లి రోబో. దీని పొడవు 4.4 మిల్లీమీటర్లు. వైర్లు, ఎలక్ట్రానిక్స్, బ్యాటరీల్లాంటివి ఏవీ దీంట్లో ఉండవు. అయినప్పటికీ వైద్యుల సూచనల మేరకు శస్త్రచికిత్సలు చేసేస్తుంది. కణజాలాన్ని కోయడంతోపాటు శరీరంలో అవసరమైన చోటికి మందులు తీసుకెళ్లి వదిలిపెడుతుంది. కణజాలం లోపలి నుంచి సులభంగా ప్రయాణించగలదు. కేన్సర్ వంటి వ్యాధులకు సంబంధించి బయాప్సీ చేయాలనుకోండి.. ఈ రోబోను వదిలితే చాలు.. ఎంచక్కా కావాల్సిన కణజాలాన్ని కత్తిరించి పట్టుకొచ్చేస్తుంది. అవసరమైనప్పుడు శరీరం లోపల వేడి పుట్టించి కొన్ని రకాల చికిత్సలకు సాయంగా నిలుస్తుంది కూడా. ఇంకో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే సెకన్ కాలంలో ఒక పని నుంచి ఇంకోరకమైన పనికి మారగలగడం దీని ప్రత్యేకత.

### అయస్కాంత శక్తి మహిమ

వైర్లు, బ్యాటరీల్లాంటివి లేకుండానే ఈ రోబో కేవలం అయస్కాంత శక్తితో పనిచేస్తుంది. ఇటీవలి కాలంలో ఈ 'మ్యాగ్నెటిక్ మెడికల్ రోబోటిక్స్'కు ప్రాచుర్యం పెరుగుతోంది. రోబో శరీరం లోపల ఉంటే బయటి నుంచి వైద్యులు అయస్కాంతాల సాయంతో వాటిని కదలిస్తారు. ఇతర పనులు చేయిస్తారన్నమాట. అతి తక్కువ గాట్లు, కోతలతో శస్త్రచికిత్సలను నిర్వహించేందుకు ఈ రకమైన రోబోలు బాగా ఉపయోగపడతాయని అంచనా. వీటితో సంప్రదాయ పద్ధతుల్లో చేరుకోలేని శరీరం లోపలి భాగాల్లోనూ సర్జరీలు చేయడం సులువు అవుతుంది. ఈ రకమైన రోబోలు ఇప్పటివరకూ ఏదో ఒక పని మాత్రమే చేయగలిగేవి. మందులు తీసుకెళ్లేందుకు ఒకటి.. కత్తిరించేందుకు ఒకటి ఇలా.. దేనికదే అన్నమాట. అయస్కాంత క్షేత్ర ప్రభావం రోబో మొత్తమ్మీద ఒకేరకంగా పడుతూండటం వల్ల ఒక రోబోతో వేర్వేరు పనులు చేయించలేకపోయే వారు. ఎన్‌టీయూ శాస్త్రవేత్తలు ఇప్పుడు ఈ పరిమితిని అధిగమించగలిగారు.



### ఏడేళ్ల పరిశోధనలు

రోబోతో ఐదు రకాల పనులు చేయించేందుకు ఎన్‌టీయూ శాస్త్రవేత్తలు ఏడేళ్లుగా కృషి చేస్తున్నారు. వేర్వేరు కోణాల్లోంచి రోబోను అయస్కాంతీకరించడం, సాధారణ స్థితికి తీసుకురావడం ద్వారా గత అవరోధాలను విజయవంతంగా అధిగమించామని శాస్త్రవేత్త లుమ్ గుయో ఝూన్ తెలిపారు. ఒక్కో కోణంలో ఈ మార్పులు చేయడం ద్వారా ఒక్కో రకమైన పని చేయించేలా తాము రోబోలో ఒక మాగ్నెటిక్ రీప్రోగ్రామబుల్ మాడ్యూల్‌ను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ బుల్లి రోబోలోని వేర్వేరు ప్రాంతాలు అయస్కాంతానికి భిన్న రీతుల్లో స్పందించేలా చేశామని, అయస్కాంత క్షేత్ర ప్రభావం ఈ ప్రాంతాలపై వేర్వేరుగా ఉంటుందని లుమ్ గుయో వివరించారు. సాఫ్ట్ రోబోటిక్స్‌లో విరివిగా వాడే పీడీఎంఎస్, ఎకోఫ్లెక్స్ వంటి పదార్థాలతో ఈ రోబోను తయారుచేశారు. పీడీఎంఎస్, ఎకోఫ్లెక్స్ అనేవి సిలికోన్ ఆధారిత పదార్థాలు. ఈ పదార్థంలోనే అక్కడక్కడ ఐదు మైక్రోమీటర్ల సైజున్న అయస్కాంత కణాలను ఏర్పాటు చేశారు. ఈ కణాల అమరిక, అయస్కాంతీకరణల ఆధారంగా రోబో కదలిక, పనులు ఆధారపడి ఉంటాయి.

### ఫైవ్ ఇన్ వన్ ఎలాగంటే...

బయాప్సీ కోసం ఇందులో చిన్న బ్లేడ్ ఉంటుంది. రోబో గట్టిగా పట్టుకుంటే ఈ బ్లేడ్ కణజాలాన్ని కత్తిరించి తనలో దాచుకుంటుంది. బయటకు తీసుకొచి?చన తరువాత కణజాలాన్ని విశ్లేషించడం ద్వారా కేన్సర్ వంటి వ్యాధుల నిర్ధారణ జరుగుతుంది. మందులు పెట్టి రోబోను శరీరం లోపలికి పంపిస్తే ఆ రోబోనే ఔషధాన్ని శరీరంలోకి జొప్పిస్తుంది. ప్రత్యేకమైన అయస్కాంత క్షేత్రాలను ఉపయోగించడం ద్వారా దీన్ని వేడెక్కించవచ్చు. అల్సర్ల వంటి వాటిని మాడ్చి మాన్పేందుకు ఉపయోగించవచ్చు. కేన్సర్‌కూ ఈ హైపర్ థెర్మియా పద్ధతిని వాడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కణజాలం మధ్య కదిలేందుకు ఈ రోబోకు దొర్లుకుంటూ వెళ్లే సామర్థ్యాన్ని కల్పించారు. దీంతో రోబో ఎటు కావాలంటే అటు వెళ్లిపోగలదు. కోడి లివర్‌లో, కృత్రిమ కణజాలం నమూనాల్లో ఈ రోబోను ఇప్పటికే పరిశీలించి సత్ఫలితాలు సాధించామని, మానవ చర్మకణాలతో ప్రయోగాలు జరిపి ఈ రోబో ద్వారా శరీరానికి హాని ఏదీ జరగదని నిర్ధారించుకున్నామని లుమ్ గుయో ఝూన్ తెలిపారు.

### కొలనుపాక దేవాలయ పైకప్పుపై వందల ఏళ్లనాటి పెయింటింగ్స్

### ఇంతకాలం పొగచూరి మాయం.. తాజాగా శుభ్రం చేయగా వెలుగులోకి..

### చాలా ఆలయాల్లో సున్నపు పూతలు, మసి పొరలనుతొలగిస్తే తిరిగి చూసే వీలు

### కెమికల్ ట్రీట్‌మెంట్‌తో మెరుగ్గా కనిపించే అవకాశం

### అందుకు నిధులు కేటాయించని రాష్ట్ర ప్రభుత్వం

# మసి పొరలుతొలగిస్తే.. మరపురాని చిత్రాలు



ఇది వందల ఏళ్ల క్రితం దేవాలయం పైకప్పు మీద చిత్రించిన పురాణగాథను ప్రతిబింబించే ఓ వర్ణచిత్రం. కానీ, సమీపంలో భారీ దీపాలు, కాగడాలు వెలిగిస్తుండటంతో వాటిమీద మసి పొరలు కమ్మి అద్భుత, అపురూప చిత్రాలు కనుమరుగయ్యాయి. తాజాగా ఆలయంలో అభివృద్ధి పనుల్లో భాగంగా పైకప్పు మసి పొరలు తొలగించటంతో అవి వెలుగుచూశాయి. కెమికల్ ట్రీట్‌మెంట్ చేయిస్తే అవి స్పష్టంగా కనిపించనున్నాయి. ఇది కొలనుపాక సోమేశ్వరాలయంలో చోటుచేసుకున్న ఘటన. రాష్ట్రంలో కాకతీయులు, వారికి పూర్వం నిర్మించిన ఎన్నో దేవాలయాలున్నాయి. వాటిల్లో కూడా ఇలాంటి అద్భుత వర్ణచిత్రాలుంటాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. కొన్నేళ్ల క్రితం సూర్యాపేట జిల్లా పిల్లలమర్రిలోని కాకతీయ త్రికూటాలయంలో శైవ, వైష్ణవ పురాణ గాథల్లోని చిత్రాలు ఇలాగే అనూహ్యంగా వెలుగుచూశాయి. అంతరించిన ఈ ఆలయ చిత్రకళా వైభవాన్ని మళ్లీ ప్రజల ముందుంచాలంటే దేవాలయాల్లో వాటిని గుర్తించాల్సి ఉంది. పిల్లలమర్రి దేవాలయంలో కెమికల్ ట్రీట్‌మెంట్‌తో వాటిని కాపాడిన రాష్ట్ర వారసత్వ శాఖ సిద్ధంగా ఉన్నా, అందుకు కావాల్సిన నిధులను ప్రభుత్వం కేటాయించడం లేదు.

ఏంటీ చిత్రాలు... : అంతగా అక్షరాస్యత లేని కాలంలో పురాణ గాథలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఆలయాల్లో ఇలా చిత్రాలు గీసి చూపటం కూడా ఓ పద్ధతి. పురాతన దేవాలయాలు కేవలం శిల్పకళా నిలయాలు మాత్రమే కాదు, అవి అద్భుత చిత్రకళా వేదికలు కూడా. నాటి రాజులు, శిల్పులు దేవాలయాల పైకప్పులను, రాతి దూలాలను కాన్వాసుగా మార్చేశారు. వాటిపై పురాణగాథలను, రాచరిక వైభవాలను రంగురంగుల చిత్రాలుగా ప్రాణప్రతిష్ట చేశారు. ఈ చిత్రకళా సంప్రదాయం శాతవాహనుల కాలంలోనే మొదలైంది. కాకతీయుల కాలంలో మరింతగా విస్తరించి, విజయనగర సామ్రాజ్య కాలంలో అద్భుతంగా వరి?ధల్లింది. అనంతపురం జిల్లాలోని లేపాక్షి వీరభద్రస్వామి ఆలయం ఇందుకు సజీవ సాక్ష్యం. ఇక్కడి పైకప్పులపై గీసిన చిత్రాలు ఆసియాలోనే అతిపెద్ద గోడచిత్రాలుగా అంతర్జాతీయ గుర్తింపు పొందాయి. ఈ చిత్రాలు వందల ఏళ్లపాటు మనగలిగేలా నాటి చిత్రకారులు పూర్తిగా సహజసిద్ధ రంగులను మాత్రమే వాడేవారు. చిత్రించేచోట ముందుగా సున్నం, జనపనార, బెల్లం నీరు, కరక్కాయల మిశ్రమం పూసేవారు. ఆ పూత తడిగా ఉన్నప్పుడే రంగులు వేసేవారు. దీనివల్ల రంగు రాతి పొరల్లోకి ఇంకిపోయి శతాబ్దాలైనా చెరిగిపోకుండా ఉంటుంది.

### ఆసక్తి చూపని సర్కారు

ఇక మరమ్మతులు, ఆధునీకరణ పేరుతో పురాతన దేవాలయాల గోడలు, పైకప్పులపై సున్నపు పూతలతో చాలా దేవాలయాల్లోని చిత్రాలు కనిపించకుండాపోయాయి. ప్రస్తుతం అత్యాధునిక కెమికల్ వాషింగ్ పద్ధతుల ద్వారా కొన్ని ఆలయాల్లో పైకప్పులపై దశాబ్దాలుగా ఉన్న సున్నపు పొరలను జాగ్రత్తగా తొలగిస్తూ, లోపల దాగున్న అసలైన పురాతన చిత్రాలను వెలుగులోకి తెచ్చే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. కానీ, ప్రభుత్వం ఆ దిశగా ఆసక్తి చూపకపోవటంతో తెలంగాణలో ఆ ప్రక్రియ జరగటం లేదు.

### వర్ణచిత్రాలున్నాయి...

ఇప్పటికీ చాలా దేవాలయాల్లో అతి పురాతన వర్ణచిత్రాలున్నాయని తాజాగా కొలనుపాక దేవాలయం చాటిచెప్తోంది. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా మసి పొరలు తొలగించగా అస్పష్టంగా చిత్రాలు కనిపించాయి. వీటిని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు సిరిపురం నరేందర్ తొలుత గుర్తించగా, తాజాగా ఆ బృంద సభ్యులు శ్రీరామోజు హరగోపాల్, ముల్లక్కల రవికుమార్, కుండె గణేశ్, మేఘరాజు ఈ చిత్రాలను పరిశీలించి విశ్లేషించారు. పురాణగాథ చిత్రాల్లో విశ్వబ్రహ్మను, 'శరభ', సంగరోలు'లాంటి తెలుగు లిపి పదాలు కనిపించాయని వారు చెప్పారు. ఇవి కాకతీయ కాలం తదనంతర చిత్రాలై ఉండొచ్చన్నారు.

## మీనాక్షి నటరాజన్ పిటిషన్ ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : రాజ్యసభ నామినేషన్ పత్రాల తిరస్కరణను సవాలు చేస్తూ కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 329 ప్రకారం.. కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియలో న్యాయపరమైన జోక్యం నిషిద్ధమని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎస్ చందూర్కర్ లతో కూడిన ధర్మాసనం శుక్రవారం పేర్కొంది. "ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి ఈ కోర్టు లేదా హైకోర్టు రిట్ అధికార పరిధిని వినియోగించుకునే ప్రయత్నం జరిగిన ప్రతిసారి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 329లో పొందుపరిచిన నిబంధనలను దృష్టిలో ఉంచుకుని కోర్టు ఆ ప్రయత్నాలను తిరస్కరించింది" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇటువంటి అంశాల్లో ఎన్నికల పిటిషన్ దాఖలు చేయడమే సరైన పరిష్కార మార్గమని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. నామినేషన్ పత్రాల తిరస్కరణలో స్పష్టమైన, సుస్పష్టమైన లోపాలకు మినహాయింపు ఇవ్వడమంటే.. ఆర్టికల్ 329లో ఉనికిలో లేని ఒక సూత్రాన్ని జోడించడమేనని పేర్కొంది. అయితే తాము చేసిన పరిశీలనలు, సంబంధిత హైకోర్టులో దాఖలు చేయనున్న ఏ ఎన్నికల పిటిషన్ పైనా ఎటువంటి ప్రతికూల ప్రభావాన్ని చూపవని స్పష్టం చేసింది.

## దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ కు 30 ఏళ్ల జైలు శిక్ష



సియోల్ : దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్-యోల్ కు సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్టు 30 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 2024లో మార్షల్ లా ( సైనిక పాలన ) ప్రకటన పేరుతో ఉత్తర కొరియాపై డ్రోన్లను ప్రయోగించేందుకు యూన్ సుక్-యోల్ కుట్ర పన్నారని కోర్టు వ్యాఖ్యానించింది. దక్షిణ కొరియాపై సాయుధ లేదా సైనిక చర్యలు చేపట్టేలా ఉత్తర కొరియాను రెచ్చగొట్టడమే యూన్ ఉద్దేశ్యమని జడ్జీలు పేర్కొన్నారు. 2024లో మార్షల్ ప్రకటనకు రెండు నెలల ముందు ఉత్తర కొరియాపై డ్రోన్ దాడికి పాల్పడ్డారు. ప్రచార కరపత్రాలను కూడా జారవిడిచినట్లు ఉత్తర కొరియా ఆరోపించింది. ఇరు దేశాల మధ్య సైనిక ఉద్రిక్తతలు పెంచి, జాతీయ సంక్షోభాన్ని సృష్టించాలని యూన్ కుట్ర పన్నారని, దీంతో తన మార్షల్ లా ప్రకటనను సమర్థించుకునేందుకు యత్నించారని పేర్కొన్నారు. డ్రోన్ దాడి ఘటనకు సంబంధించి యూన్ కు 30 ఏళ్ల జైలు శిక్ష విధించినట్లు సియోల్ సెంట్రల్ డిస్ట్రిక్ట్ కోర్ట్ ప్రతినిధి శుక్రవారం తెలిపారు. అయితే దేశ ప్రయోజనాల కోసమే మార్షల్ లా విధించారని యూన్ తరపు న్యాయవాదులు వాదించారు. 2024లో ఉత్తర కొరియా చెత్తతో నిండిన బెలూన్ లను ప్రయోగించిందని, అందుకు ప్రతిగా ఈ డ్రోన్ ఆపరేషన్ చేపట్టినట్లు వాదించారు. ఈ వాదనను కోర్టు తిరస్కరించింది. డ్రోన్ ఆపరేషన్ దక్షిణ కొరియా సైనిక సామర్థ్యాలను వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించుకోవడాన్ని సూచిస్తుందని జడ్జీలు పేర్కొన్నారు. సాయుధ దళాల సర్వోన్నత అధికారం, మార్షల్ లా ప్రకటించే అధికారాలను అధ్యక్షుడు దేశ మనుగడ, భద్రత కోసం వినియోగించాలని స్పష్టం చేశారు. అయితే తన సొంత రాజకీయ ప్రయోజనాల కోసం అటువంటి అధికారాలను యూన్ ఏకపక్షంగా వినియోగిస్తూ ఉత్తర కొరియాపై డ్రోన్ ఆపరేషన్ కు అనుమతినిచ్చారని తెలిపారు. మార్షల్ లా ప్రకటించి తిరుగుబాటుకు యత్నించిన యూన్ కు జీవిత ఖైదు విధించిన సంగతి తెలిసిందే. ఈ శిక్షపై ఆయన అప్పీల్ చేయడంతో ప్రస్తుతం నిర్బంధంలో ఉన్నారు.

## 'రెండేళ్లలోనే బాబు పాలనపై జనం విసిగిపోయారు'



తాడేపల్లి: సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను చంద్రబాబు దగా చేశారని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా చంద్రబాబు పాలనలో దోపిడీ, హింస కొనసాగుతోంది. చంద్రబాబుకు రాజకీయంగా ఇదే లాస్ట్ టర్మ్. చంద్రబాబు పాలన అవినీతిలో కొత్త రికార్డులు సృష్టిస్తోందన్నారు. "సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ప్రజల్ని దగా చేశారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన రోజు నుంచే మోసాలు మొదలయ్యాయి. ఎన్టీఆర్‌ను గద్దెదించి చంద్రబాబు సీఎం పీఠమెక్కారు. వైఎస్సార్ ఆదర్శవంతమైన పాలన అందించారు. వైఎస్ జగన్ ఆచరణలో మంచి పాలన తీసుకొచ్చారు. చంద్రబాబు పాలనలో మార్పు వస్తుందని ఆశించాం.. కానీ అది జరగలేదు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను చంద్రబాబు దగా చేశారు. చంద్రబాబు జీవితమంతా ప్రజలను వంచించడమే. రాష్ట్రంలో ప్రతి వర్గాన్ని చంద్రబాబు మోసం చేశారు. చంద్రబాబు పాలనలో ప్రజలంతా విసిగిపోయి.. వైఎస్ జగన్ వైపు చూస్తున్నారు. ప్రజల గొంతుక వినిపించేలా ఇవాళ నిరసనలు బ్రహ్మాండంగా జరిగాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలంతా రోడ్డు మీదకు వస్తున్నారు. కూటమి సర్కార్ నిరసనలను అడ్డుకునే ప్రయత్నం చేసింది. పోలీసులతో నిరసనలను అణచివేయాలని చూశారు. పోలీసుల ఆంక్షలను దాటుకుని ప్రజలు నిరసనలను విజయవంతం చేశారు" అని సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

## అవి మామూలు తాబేళ్లు కాదు... విదేశీ గూఢచారులు: చైనా సంచలన ఆరోపణలు

**తమ సముద్ర జలాల్లో గూఢచారి తాబేళ్లు, చేపలు ఉన్నాయన్న చైనా**

**విదేశీ గూఢచార సంస్థలే ఈ పని చేస్తున్నాయని తీవ్ర ఆరోపణ**

**జంతువులకు సెన్సర్లు అమర్చి కీలక సమాచారం చోరీ చేస్తున్నాయని వెల్లడి**

**దేశ భద్రతకు ముప్పు కలిగించేందుకే ఈ కుట్ర అని ప్రకటన**



ఢిల్లీ: విదేశీ గూఢచార సంస్థలు సరికొత్త పద్ధతుల్లో తమపై నిఘా పెడుతున్నాయని చైనా సంచలన ఆరోపణలు చేసింది. చైనా సముద్ర జలాల్లోకి 'స్పై తాబేళ్లు', 'స్పై చేపలు' వంటి జంతువులను ప్రవేశపెట్టి కీలక సమాచారాన్ని దొంగిలిస్తున్నట్లు ఆ దేశ స్టేట్ సెక్యూరిటీ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సముద్ర జీవులకు అత్యాధునిక సెన్సర్లు అమర్చి, వాటి ద్వారా తమ సైనిక మరియు పర్యావరణ రహస్యాలను సేకరించేందుకు విదేశీ నిఘా సంస్థలు కుట్ర పన్నాయని ఆరోపించింది. జూన్ 12న తన అధికారిక వీచాట్ ఖాతాలో "లోతైన నీలి సముద్రం కింద, అంతర్గత ప్రవాహాలు ఉద్ధృతంగా ఉన్నాయి" అనే శీర్షికతో ఈ వివరాలను వెల్లడించింది. తమ తీరప్రాంతాల్లోని నిర్దిష్ట ప్రదేశాల్లో కొన్ని పెద్ద సముద్ర జీవులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నాయని, అవి నీటి ఉష్ణోగ్రత, లవణీయత, సముద్ర ప్రవాహాలు వంటి సమాచారాన్ని సేకరించి, శాటిలైట్ ద్వారా విదేశాలకు చేరవేస్తున్నాయని చైనా పేర్కొంది. కేవలం జంతువులే కాకుండా, గూఢచర్యం కోసం సోలార్ పవర్డ్ వేవ్ గ్లైడర్లు, సెన్సర్ బాయ్‌లను కూడా వినియోగిస్తున్నారని తెలిపింది. ఈ చర్యల ద్వారా సముద్రగర్భ పటాలను రూపొందించి, చైనా తీరప్రాంత రక్షణ వ్యవస్థలోని లోపాలను గుర్తించేందుకు విదేశాలు ప్రయత్నిస్తున్నాయని, ఇది జాతీయ భద్రతకు పెను ముప్పు అని ఆందోళన వ్యక్తం చేసింది. అయితే, ఈ ఆరోపణల్లో చైనా ఏ దేశం పేరునూ కూడా నేరుగా ప్రస్తావించలేదు. చైనా ఆరోపణల అంతర్జాతీయ మీడియాలో ప్రాధాన్యత సంతరించుకున్నప్పటికీ, స్వతంత్ర వర్గాలు మాత్రం వీటిని ధ్రువీకరించలేదు. సముద్ర జీవులకు సెన్సర్లు అమర్చడం సాంకేతికంగా సాధ్యమే అయినప్పటికీ, వాటిని గూఢచర్యం కోసం ప్రభావవంతంగా ఉపయోగించడం అత్యంత సవాలుతో కూడుకున్న వ్యవహారమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పాక్ జిమ్మిక్కు.. పీవోకే రిమోట్ అక్కడే!

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) గురించి.. చాలామందికి ఓ సందేహం రావొచ్చు. పాకిస్థాన్ నియంత్రణలో ఉన్న ప్రాంతమే అయితే అక్కడ ప్రత్యేకంగా ప్రధాని, రాష్ట్రపతి, శాసనసభ, రాజ్యాంగం, జెండా ఎందుకు ఉన్నాయి? పీవోకే నిజంగానే స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రాంతమా? కాదా?.. ఇటీవల పీవోకేలో చెలరేగిన ఆందోళనలు, పాకిస్థాన్ ప్రభుత్వ అణచివేత చర్యల నేపథ్యంలో ఈ ప్రశ్నలు మరోసారి తెరపైకి వచ్చాయి. పాకిస్థాన్ అధికారికంగా పీవోకేను "ఆజాద్ జమ్మూ అండ్ కశ్మీర్"గా పిలుస్తుంది. పేరు వింటే అది స్వతంత్రమో.. స్వయం ప్రతిపత్తితో నడిచే ప్రాంతంలా అనిపిస్తుంది. అక్కడ ప్రత్యేక శాసనసభ ఉంది. రాష్ట్రపతి, ప్రధాని, న్యాయవ్యవస్థ, మంత్రివర్గం, జెండా, తాత్కాలిక రాజ్యాంగం కూడా ఉన్నాయి. పైకి చూస్తే ఒక ప్రత్యేక రాజకీయ వ్యవస్థ ఉన్న ప్రాంతంలా కనిపిస్తుంది. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఈ వ్యవస్థ వెనుక ఉన్న కథ 1947 విభజన కాలానికి వెళ్తుంది. జమ్మూ కశ్మీర్ సంస్థానం భారత్‌లో విలీనం కావడంతో మొదటి భారత్-పాకిస్థాన్ యుద్ధం జరిగింది. యుద్ధం ముగిసే సమయానికి కశ్మీర్‌లోని కొంత భూభాగం పాకిస్థాన్ ఆక్రమణలో మిగిలిపోయింది. అయితే ఆ ప్రాంతాన్ని పాకిస్థాన్‌లో అధికారిక ప్రావిన్స్‌గా కలుపుకోలేదు. అలా చేస్తే మొత్తం జమ్మూ కశ్మీర్‌పై తమ హక్కు బలహీనపడుతుందని ఇస్లామాబాద్ భావించింది. అందుకే ఒకవైపు కశ్మీర్ వివాదం కొనసాగుతుందనే వాదనను నిలబెట్టుకుంటూనే, మరోవైపు ఆ ప్రాంతాన్ని స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రాంతంలా ప్రపంచానికి చూపించే వ్యూహాన్ని అమలు చేసింది. దీంట్లో భాగంగానే 1949 కరాచీ ఒప్పందం ద్వారా రక్షణ, విదేశాంగం, సమాచార వ్యవస్థ వంటి కీలక అధికారాలను పాకిస్థాన్ తన చేతుల్లోకి తీసుకుంది. అనంతరం 1974లో తాత్కాలిక రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చి రాష్ట్రపతి, ప్రధాని, శాసనసభ, న్యాయవ్యవస్థ వంటి వ్యవస్థలను ఏర్పాటు చేసింది. దీంతో పీవోకేకు ప్రత్యేక గుర్తింపు ఉన్నట్లు ప్రపంచాన్ని నమ్మించే ప్రయత్నం చేసింది. ఆ రాజ్యాంగం ప్రకారం పీవోకేలో ఆ దేశ అధ్యక్షుడు రాజ్యాంగబద్ధ అధిపతి కాగా.. ప్రధాని కార్యనిర్వాహక అధిపతిగా వ్యవహరించాలి. కానీ అలా ఏనాడూ జరగలేదు. కీలక నిర్ణయాలు తీసుకునే అధికారాలు ఎక్కువగా పాకిస్థాన్ ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటూ వచ్చాయి. రక్షణ, విదేశాంగం, ఆర్థిక విధానాలు, వ్యూహాత్మక




అంశాలు, కీలక పరిపాలనా నిర్ణయాలన్నీ ఇస్లామాబాద్ అనుమతితోనే అమలవుతాయి. పీవోకే పరిపాలనలో కూడా పాకిస్థాన్ నుంచి పంపిన అధికారుల పాత్ర కీలకంగా ఉంటుంది. అంతేకాదు, పీవోకేలో రాజకీయ వ్యవస్థపై పాకిస్థాన్ ప్రభావం ఎంత బలంగా ఉందో అక్కడి ఎన్నికల విధానం కూడా చూపిస్తుంది. శాసనసభలో కొన్ని స్థానాలు పీవోకేలో నివసించే ప్రజల కోసం కాకుండా, పాకిస్థాన్‌లో నివసిస్తున్న కశ్మీరీ శరణార్థుల కోసం కేటాయించారు. ఈ స్థానాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విమర్శలు ఉన్నాయి. దీంతో స్థానిక ప్రజల కంటే ఇస్లామాబాద్‌కు మరింత అనుకూలంగా రాజకీయ సమీకరణాలు జరిగే పరిస్థితి ఏర్పడిందని విశ్లేషకులు చెబుతున్నారు. మరో వివాదాస్పద అంశం విధేయత ప్రమాణం. పీవోకేలో ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ నాయకులు, న్యాయమూర్తులు, ఇతర రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉండే వ్యక్తులు కశ్మీర్ పాకిస్థాన్‌లో విలీనం కావాలనే సిద్ధాంతానికి మద్దతు ఇస్తామని తప్పనిసరిగా ప్రమాణం చేయాలి. భిన్నాభిప్రాయాలకు, ప్రత్యామ్నాయ రాజకీయ ఆలోచనలకు అక్కడ అవకాశాలు చాలా పరిమితంగా ఉంటాయని విమర్శలు ఉన్నాయి. అలా.. ప్రపంచాన్ని నమ్మించేందుకు పాకిస్థాన్ సృష్టించిన నామ మాత్రపు రాజకీయ వ్యవస్థేనని స్పష్టమవుతోంది. ఇక భారత్ మాత్రం పీవోకేను ఎప్పటికీ తన అంతర్భాగంగానే పరిగణిస్తోంది. 1947 నుంచి ఈ ప్రాంతం పాకిస్థాన్ అక్రమ ఆక్రమణలో ఉందని కేంద్ర ప్రభుత్వం పలుమార్లు స్పష్టం చేసింది. భారత విదేశాంగ శాఖ కూడా పీవోకే భారత భూభాగమేనని అధికారికంగా పేర్కొంటోంది. అందుకే పీవోకేకు ప్రత్యేక రాజ్యాంగం, ప్రధాని, అధ్యక్షుడు, జెండా వంటి వ్యవస్థలు ఉన్నాయనే కారణంతో అది స్వతంత్ర ప్రాంతమో, ప్రత్యేక దేశమో అయిపోదని భారత్ వాదిస్తోంది. దశాబ్దాలుగా 'ఆజాద్ కశ్మీర్' అనే పేరుతో ప్రపంచాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. వాస్తవానికి పీవోకే రాజకీయ, పరిపాలనా, భద్రతా వ్యవస్థలన్నీ ఇస్లామాబాద్ నియంత్రణలోనే కొనసాగుతున్నాయనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. అందుకే పీవోకేలో కనిపించేది ఒక ప్రభుత్వం అయితే.. పనిచేసేది మాత్రం పాకిస్థాన్ రిమోట్ కంట్రోల్ వ్యవస్థేనని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# ఈగ.. యముడి మెరుపు తీగ!

**టెక్సాస్‌ను వణికిస్తున్న ఈగ**

**నిర్జీవ కణజాలం బదులు పచ్చి మాంసం తింటున్న లార్వాలు**

**పశువులతో పాటు మనుషులకూ సోకే ముప్పు**

**నిర్మూలించిన దశాబ్దాల తర్వాత మళ్లీ ముందుకొచ్చిన ముప్పు**

ఒక అడవి జాతి ప్రాణాంతక మాంసాహార ఈగ అమెరికాను వణికిస్తోంది. దీంతో అత్యవసర పరిస్థితులు, ఎగుమతులపై నిషేధాలు విధించారు. క్వారంటైన్ నిబంధనలు అమల్లోకి తెచ్చారు. సాధారణ ఈగ గుడ్ల నుంచి పుట్టే తెల్లని పురుగులు(మ్యాగట్స్/లార్వాలు) చనిపోయిన కణజాలాలను తింటే ఈ ఈగ లార్వాలు సజీవ మాంసాన్నే తింటున్నాయి. అత్యంత ప్రమాదకరమైన ఈ లార్వా పేరు 'న్యూ వరల్డ్ సరీ?క్రవార్మ్'(ఎన్‌డబ్ల్యూఎస్). ఇది సోకితే పశువులు, పందులు, మేకలు, పెంపుడు జంతువులే కాకుండా మనుషులకు కూడా ముప్పే.

### టెక్సాస్‌లో ఎమర్జెన్సీ

కొద్దిరోజుల క్రితం టెక్సాస్‌లోని పశువులు, మేకలతోపాటు న్యూమెక్సికోలోని ఒక పెంపుడు కుక్కలో సరీ?క్రవార్మ్ కేసులను గుర్తించినట్లు అధికారులు నిర్ధారించారు. టెక్సాస్ వ్యవసాయ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. టెక్సాస్‌లో పశువులు, గుర్రాల దిగుమతిని కెనడా నిషేధించింది. అంతకుముందు మెక్సికోలో ఈ కేసులు రావడంతో అమెరికా కూడా మెక్సికో నుంచి పశువుల ఎగుమతిని తాత్కాలికంగా నిలిపివేసింది.



### మాంసాన్ని కొరికి తింటాయి

గాయాలు, తెగిన గాట్లు, పేలు కుట్టిన చిన్న రంధ్రాలు లేదా చర్మం తెరుచుకున్న భాగాలపై ఆడ ఈగ వందల గుడ్లు పెడుతుంది. కొన్ని గంటల్లోనే ఆ గుడ్ల నుంచి బయటకు వచ్చే లార్వాలు బయటకు వచ్చి, బతికున్న జీవుల ఆరోగ్యకర మాంసాన్ని కొరికి తింటాయి. సకాలంలో చికిత్స అందించకపోతే.. తీవ్ర గాయాలు, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల వల్ల జంతువులు 7 నుంచి 14 రోజుల్లో చనిపోతాయి.

### కొత్తదేమీ కాదు..

అమెరికాకు స్క్రూవార్మ్ కొత్తదేమీ కాదు. అయితే దశాబ్దాల క్రితమే అమెరికా, మెక్సికోలు మాంసాన్ని తినే ఈ ఈగ జాతిని నిర్మూలించాయి. ఉత్తర అమెరికా సరిహద్దుల్లోకి ఇటీవల తిరిగి ప్రవేశించిన ఈ ప్రమాదకర పరాన్నజీవి.. పశుసంవర్ధక రంగానికి పెనుముప్పుగా మారింది. గతంలో స్టెరైల్ ఇన్సెక్ట్ టెక్నిక్ ద్వారా అమెరికాలో దీన్ని నిర్మూలించారు. ఇందులో భాగంగా ప్రయోగశాలలో ఉత్పత్తి చేసిన మిలియన్ల కొద్దీ సంతానోత్పత్తి చేయలేని మగ ఈగలను ప్రకృతిలోకి వదిలారు. తద్వారా వాటి సంతానోత్పత్తి ఆగిపోయింది. అయితే తూర్పు పనామాలోని డారియన్ గ్యాప్ బయోలాజికల్ బారియర్ క్వారంటైన్ జోన్ నుంచి ఈ ఈగలు తప్పించుకొని మధ్య అమెరికా మీదుగా ఉత్తర దిశగా వ్యాపించడంతో ఇప్పుడు మళ్లీ ఈ ముప్పు వచ్చింది. దీంతో టెక్సాస్‌లో కొత్తగా భారీ స్థాయిలో స్టెరైల్ ఫ్లై ప్రొడక్షన్ ఫెసిలిటీని ఏర్పాటు చేస్తున్నారు. గతంలో మనుషులకు సోకిన కొన్ని కేసుల్లో శస్త్రచికిత్స ద్వారా పురుగులను తీసేసి యాంటీ పారాసిటిక్ మందులతో నయం చేశారు.

# టీఎంసీ అంతర్విస్ఫోటనం!



ఎన్నికల ఫలితాలు వెలువడి పట్టుమని పాతిక రోజులు కాకుండానే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ)కి వీధుల్లో హింసతో మొదలైన ఎదురుదెబ్బలు ఇంకా ఆగలేదు. తాజాగా ఇండియా కూటమి సమావేశానికి ఆ పార్టీ అధినేత మమతా బెనర్జీ ఢిల్లీ వచ్చిన సోమవారం నాడే ఆ పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు తిరుగుబాటు జెండా ఎగరేసి, తమదే అసలైన టీఎంసీ అనీ, ఎన్డీయేలో ఉంటామనీ స్పీకర్‌కు లేఖ రాశారు. వారి సంఖ్య 13 మాత్రమేనని పార్టీ చెబుతోంది. ఇప్పటికే టీఎంసీ శాసనసభా పక్షం చీలి, 58 మంది ఎమ్మెల్యేలు రితబ్రత బెనర్జీ నాయకత్వంలో వేరు కుంపటి పెట్టారు. తమనే ప్రధాన ప్రతి పక్షంగా గుర్తించమని స్పీకర్‌కు లేఖ రాశారు. స్థానిక సంస్థల్లో రాజీనామాలకూ, గోడ దూకుళ్లకూ కొదవే లేదు. 'స్ట్రీట్ ఫైటర్'గా పేరున్న మమత ఈ అరాచకాన్ని ఆపడానికి ప్రయత్నించకపోలేదు. కానీ అదేమీ ఫలితమివ్వలేదని తాజా పరిణామాలు చెబు తున్నాయి. ఫిరాయింపులనగానే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 'వైస్రాయ్ ఎపిసోడ్' అందరికీ గుర్తొస్తుంది. కానీ ఆ జాడ్యం 'వైస్రాయ్' కన్నా చాలా పాతది. 1967లో హరియాణాలో గయాలాల్ అనే స్వతంత్ర శాసనసభ్యుడు వారం రోజుల వ్యవధిలో మూడు పార్టీలు మారినప్పుడు 'ఆయా రాం... గయారాం' అనే నానుడి మొదలైంది. ఫిరాయింపులకు ఆయన ఆద్యుడు కాకపోవచ్చుగానీ, వాటితో ఆయన పేరు శాశ్వతంగా ముడిపడి పోయింది. కానీ గత రెండు దశాబ్దాలనుంచి గుంపుగా వెళ్లి అవతలి పార్టీతో అంటకాగే ఉదంతాలు లేదా సొంత పార్టీ పెట్టుకోవడం వంటివి చోటుచేసుకున్నప్పుడల్లా... ప్రభుత్వాలు కుప్ప కూలినప్పుడల్లా ఆ పాత నానుడి పోయి, 'వైస్రాయ్ ఎపిసోడ్' గుర్తుకురావటం మొదలైంది. 1995లో జరిగిన ఆ ఉదంతం వెన్నుపోటుకూ, విద్రోహా నికీ, నయవంచనకూ బండగుర్తుగా మారిపోయింది. తన మామ స్వర్గీయ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా జిల్లా పర్యటనలో ఉండగా, ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి, అప్పటి రెవెన్యూ మంత్రి చంద్రబాబు తన విధేయులైన అరడజను మంది ఎమ్మెల్యేలను వైస్రాయ్ హోటల్‌లో పోగేసి, టీడీపీ చీలిపోయిందంటూ బ్రహ్మాండం బద్దలయిన స్థాయిలో అనుకూల మీడియాలో ప్రచారం చేయించుకుని, ఎమ్మెల్యేలను మభ్యపెట్టి, బ్లాక్‌మెయిల్ చేసి ఆ సంఖ్యను పెంచుకుంటూ పోయారు. ఆయన మిత్రుడు, నాటి స్పీకర్ యనమల రామకృష్ణుడు సరేసరి... సకల వ్యవస్థలూ చంద్రబాబుకు సాగిలపడటంతో ఎన్టీఆర్ అధికారాన్ని కోల్పోయారు. కొన్ని నెలల వ్యవధిలోనే మనోవ్యథతో కన్ను మూశారు. ఇప్పటి 'రెడ్‌బుక్'లా ఆ ఉదంతానికి బాబు పేరెట్టినట్టు లేరుగానీ... ఈనాటికీ సకల రాష్ట్రాల ఫిరాయింపుదార్లకూ అదే శిరోధార్యం. 2014లో 23 మంది ఎమ్మెల్యేలను ఖరీదు చేయటం సంగతలా ఉంచి... 2024లో ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ అధికారం నుంచి వైదొలగాక కొందరు ఎంపీలతో పార్టీకీ, పదవికీ రాజీనామాలు చేయించటంద్వారా మళ్లీ ఆయనే 'నైతికత' ముసుగులో కొత్త రకం చీడకు గేట్లు తెరిచారు. మహారాష్ట్రలో 2022లో ఫిరాయింపులతో శివసేన, ఎన్సీపీలు చతికిలబడి అప్పటి మహావికాస్ అఘాదీ(ఎంవీఏ) ప్రభుత్వం కుప్పకూలింది. ఇప్పుడు విపక్షంలో ఉన్నా టీఎంసీకి అదే దుఃస్థితి ఎదురైంది. ఇదంతా మమత స్వీయ తప్పిదాల ఫలితమా... బీజేపీ చూపే ఆకర్షణల వల్లనా అని చర్చించటం వృథా. రెండూ నిజమే కావొచ్చు. కానీ మమత తప్పిదాలుంటే అవి ఇప్పుడే గుర్తుకురావటం, బీజేపీ ఆకర్షణలు చూపితే పార్టీ అధికారం కోల్పోయాకే ఎగబడటం వింత. గత నెల 4న వెలువడ్డ ఫలితాల్లో 45.92 శాతం ఓట్లతో, 208 సీట్లతో బీజేపీ అధికారంలోకి రాగా... 40.68 శాతం ఓట్లు, 80 సీట్లతో తృణమూల్ అధికారం కోల్పోయింది. అంటే ఓట్లపరంగా పెద్ద వ్యత్యాసం లేదు. కానీ టీఎంసీ ఎమ్మె ల్యేలూ, ఎంపీల్లో ఎంత అభద్రతాభావం! ఈ బాపతు ఫిరాయింపుల్ని అలా గోడదూకే వారిలో లోపించిన నైతికతగా మాత్రమే చూడటం సరికాదు. ఈ వికృత ధోరణుల్ని నిలదీసే కాలంపోయి... ఘనకార్యాలుగా, 'అపర చాణక్యం'గా అభివర్ణించే మీడియా వచ్చింది. ఇతర వ్యవస్థలూ తమకేమీ తెలియనట్టు నటిస్తున్నాయి. అందుకే ఈ గోడ దూకుళ్లు నిర్లజ్జగా సాగిపోతున్నాయి. కనుక పార్టీలు చీలిపోతే... ప్రభుత్వాలు పడిపోతే 'యూ టూ బ్రూటస్' అనుకుని ఆశ్చర్యపోవటం తప్ప ఎవరూ చేయగలిగింది లేదు.

# స్టార్‌డమ్‌తో నాలో అహంకారం పెరిగింది







స్టార్‌డమ్‌ను చూసి ఆశ్చర్యపోయానన్న సమంత

వరుస హిట్లతో స్టార్‌డమ్‌కు బానిసయ్యానని వ్యాఖ్య

నటిగా అహంకారం పెరిగి తనకు ముగింపు లేదనుకున్నానని వెల్లడి

అనారోగ్యంతో తీసుకున్న విరామం ఆలోచనలను మార్చిందన్న హీరోయిన్

జూన్ 19న ప్రేక్షకుల ముందుకు 'మా ఇంటి బంగారం' సినిమా

స్టార్‌డమ్ మత్తులో తాను కూడా కొట్టుకుపోయానని, వరుస విజయాలు తనలో అహంకారాన్ని పెంచాయని ప్రముఖ నటి సమంత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అనారోగ్య వల్ల ఇటీవల తీసుకున్న విరామం తన జీవితాన్ని, కెరీర్‌ను కొత్త కోణంలో చూసేలా చేసిందని వెల్లడించారు. 'మా ఇంటి బంగారం' సినిమా విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో సమంత తన సినీ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. "చిన్న పట్టణం నుంచి వచ్చిన ఓ అమ్మాయిగా స్టార్‌డమ్‌ను అనుభవించడం నాకు ఆశ్చర్యంగా అనిపించింది. ప్రేక్షకులు నా పేరును అరుస్తూ, నా సినిమాల కోసం ఎదురుచూడటం చూసి మరింత కష్టపడ్డాను. ఓ దశలో స్టార్‌డమ్ అనే ఆటకు బానిసయ్యాను. ఏడాదిలో ఐదు సినిమాలు చేశాను. అవన్నీ హిట్లు కావడంతో నాకో 'గోల్డెన్ లెగ్' ఉందని అందరూ అనేవారు. ఆ అంచనాలకు తగ్గట్టుగా ఉండాలనే ఒత్తిడిని నేనే నాపై పెట్టుకున్నా" అని చెప్పారు.

"అప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఇంకా ఎక్కువ సినిమాలు చేయాలనుకునేదాన్ని. నటిగా నాకు ముగింపు ఉండదనుకున్నాను. అదే ఒక రకమైన అహంకారం. కానీ ఆ విరామం తర్వాత నా కెరీర్‌కూ ఓ ముగింపు ఉంటుందనే విషయాన్ని అర్థం చేసుకున్నా. అది నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చింది. తిరిగి సినిమాల్లోకి వస్తే కొన్ని పాత అలవాట్లు మార్చుకోవాలని అప్పుడే నిర్ణయించుకున్నా" అని సమంత తెలిపారు. 2022లో తాను మయోసైటిస్ అనే ఆటో ఇమ్యూన్ వ్యాధితో బాధపడుతున్నట్లు సమంత వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం జూన్ 19న విడుదల కానుంది.

## సూర్య క్రేజీ లైనప్ వ్యూహాలు..
# సుప్రీమ్ ఛైర్ కోసమే?



తమిళ చిత్ర పరిశ్రమ చరిత్రలోనే ఎన్నడూ లేనంత ఆసక్తికరమైన ట్రేడ్ సమీకరణాలు నడుస్తున్నాయి. ఇండస్ట్రీని దశాబ్దాలుగా ఏలిన అగ్ర నటుడు దళపతి విజయ్ పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి వెళ్ళిపోవడం.. మరో స్టార్ హీరో అజిత్ కుమార్ పూర్తి దృష్టిని రేసింగ్ ట్రాక్‌లపై కేంద్రీకరించడంతో కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద నెంబర్ వన్ స్థానానికి శూన్యత ఏర్పడింది. ఈ సింహాసనాన్ని దక్కించుకోవడానికి పలువురు హీరోలు పోటీపడుతున్న తరుణంలో విలక్షణ నటుడు సూర్య మైండ్ బ్లోయింగ్ అప్‌కమింగ్ లైనప్‌తో అందరికంటే ముందు వరుసలో నిలుస్తున్నారు. ఇటీవల ఆయన నటించిన కరుప్పు (తెలుగులో వీరభద్రుడు) సాధించిన చారిత్రాత్మక విజయం ఈ రేసుకు మరింత ఆజ్యం పోసింది. ఇండస్ట్రీలో నెంబర్ వన్ స్థానాన్ని శాసించాలంటే కేవలం నటన మాత్రమే సరిపోదు. ట్రేడ్ వర్గాలను షేక్ చేసే తిరుగులేని బాక్సాఫీస్ స్టామినా అవసరం. ఆర్జే బాలాజీ దర్శకత్వంలో వచ్చిన -కరుప్పు- ప్రపంచవ్యాప్తంగా దాదాపు 340 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సరికొత్త రికార్డు సృష్టించడంతో సూర్య రేంజ్ ఒక్కసారిగా మారిపోయింది. ఈ సంచలన విజయంతో సూర్య పూర్వ వైభవాన్ని అందుకున్నారు. విజయ్-అజిత్ అందుబాటులో లేని ప్రస్తుత తరుణంలో క్రేజీ కమర్షియల్ కథలతో వస్తున్న అగ్ర దర్శకులకు.. నిర్మాణ సంస్థలకు సూర్య ఫస్ట్ ఛాయిస్ ఐకాన్‌గా మారిపోయారు. ఈ క్రేజీ ప్రయాణంలో సూర్య తదుపరి అడుగును వ్యూహాత్మకంగా వేస్తున్నారు. టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య నటిస్తోన్న -విశ్వనాథ్ అండ్ సన్స్- చిత్రం ఇప్పటికే శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకుని ఆగస్టు 14న గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న పక్కా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, క్లాస్ - ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించడమే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో సూర్యకున్న బలమైన మార్కెట్‌ను మరింత రెట్టింపు చేయడమే టార్గెట్ గా పెట్టుకుంది.

# కలం పట్టి రచయితలు అయిన నటీమణులు







వెండి తెరపై హీరోయిన్లు మాత్రమే కాదు. అవసరం మేర కలం పట్టి రచయితలు అయిన నటీమణులు కొందరున్నారు. భానుమతీ రామకృష్ణ తెలుగు సినిమా చరిత్రలో బహుముఖ ప్రజ్ఞాశాలి. భానుమతి కేవలం హీరోయిన్ మాత్రమే కాదు.. రచయిత్రి గాను సేవలందించారు. తన ఆత్మకథ 'నాలో నేను' తో పాటు అనేక కథలు, పాటలు రాశారు. ఆమె రాసిన 'అత్తగారి కథలు' అప్పట్లో ఎంతో ప్రసిద్ధి. బాలీవుడ్ చైల్డ్ ఆర్టిస్ట్ గా కెరీర్ ప్రారంభించారు హనీ ఇరానీ. అటుపై హీరోయిన్ గా, అనంతరం ఇండియాలోనే టాప్ స్క్రీన్ రైటర్లలో ఒకరిగా ఎదిగారు.'లమ్హే', 'ఐనా', 'డర్', 'కహో నా ప్యార్ హై', 'క్రిష్' వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలకు కథలు అందించారు. ప్రస్తుత కాలంలో అత్యంత ప్రతిభావంతురాలైన నటి కొంకణా సేన్. 'ఏ డెత్ ఇన్ ద గంజ్' సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే అందించారు. సౌత్ లో ఒకప్పుడు టాప్ హీరోయిన్ గా కొనసాగిన సుహాసిని మణిరత్నం కూడా రచయిత్రిగా ముద్ర వేసారు. 'తిరుడా తిరుడా', 'ఇద్దరు' సినిమాలకు డైలాగ్స్ రాయడంలో సహకరించారు. బాలీవుడ్ హీరోయిన్ కంగన రనౌత్ కూడా రైటర్ గా, దర్శకురాలిగా రాణిస్తోన్న సంగతి తెలిసిందే. కల్కి కోచ్లిన్ వైవిధ్యమైన పాత్రలకు కేరాఫ్ అడ్రస్ మాత్రమే కాదు రచయిత్రిగా కూడా గుర్తింపు పొందారు. 'ద గర్ల్ ఇన్ ఎల్లో బూట్స్' సినిమాకు కో-రైటర్‌గా పని చేశారు. వీరి బాటలోనే నవతరం నటీమణులు కెరీర్ ని నిర్దేశించుకుని ప్రయాణం ముందుకు సాగిస్తున్నారు. కీర్తి సురేష్ ఇప్పటికే సౌత్ లో ఎన్నో సినిమాల్లో హీరోయిన్ గా నటించింది. బాలీవుడ్ లో కూడా అవకాశాలు అందుకుంటుంది. అంతేనా కెప్టెన్ కుర్చీ ఎక్కడానికి అమ్మడు సిద్దమవుతుంది. ఈ క్రమంలో సొంత కథలు రాయడం మొదలు పెట్టింది. సరైన కథ సిద్దమైన తర్వాత దర్శకురాలిగానూ మారడానికి రెడీ అవుతోంది. అలాగే సమంత సొంతంగా నిర్మాణ సంస్థను స్థాపించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా డైరెక్షన్ , రైటింగ్ టీమ్తో ఎన్నో స్క్రిప్ట్ డిస్కషన్స్ లో పాల్గొంటుంది. అవసరమైన సూచనలు, సలహాలు క్రియేటివ్ గా అందించే ప్రయత్నం చేస్తుంది. తాను కూడా సొంతంగా కథలు రాసే ఆలోచనలో ఉంది. మల్టీ ట్యాలెంటెడ్ బ్యూటీ శ్రుతి హాసన్ గురించి చెప్పాల్సిన పనిలేదు. నటిగా, గాయనిగా, మ్యూజిషియన్ గా సత్తా చాటుతుంది. అవసరం మేర సాహితి వేత్తగానూ మారిపోతుంది. ఇందులో మరింత ప్రొఫెషనల్ కావాలను కుంటుంది. డాడ్ కమల్ హాసన్ తరహాలో స్క్రిప్ట్ లు కూడా రాయాల నుకుంటోంది. వరలక్ష్మి శరత్ కుమార్ ఇప్పటికే నటిగా సత్తా చాటింది. 'సరస్వతి' సినిమాతో దర్శకురాలిగానూ ఎంట్రీ ఇస్తుంది. సక్సెస్ అయిందంటే? కెప్టెన్ కుర్చీని కంటున్యూ చేసే అవకాశాలున్నాయి. అలాగే మలయాళం బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ రైటర్ గా మారే ఆలోచనలో ఉంది.

# పెళ్లి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన శ్రీముఖి



సరైన వ్యక్తి కోసం ఎదురుచూస్తున్నానన్న శ్రీముఖి

తాను కోరుకున్న వ్యక్తి దొరికిన వెంటనే పెళ్లి చేసుకుంటానని వెల్లడి

త్వరలోనే గుడ్ న్యూస్ చెప్పండి అంటూ నెటిజన్ల స్పందన

యాంకర్, నటి శ్రీముఖి తన పెళ్లి గురించి చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. సమంత తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడుతూ... "ఈ సినిమా ప్రారంభమైనప్పుడు సమంత పెళ్లి జరిగింది. ఇప్పుడు సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ అయితే నా పెళ్లి కూడా జరగాలని కోరుకుంటున్నాను" అని నవ్వుతూ వ్యాఖ్యానించింది. సరైన పెళ్లి కొడుకు కోసం ఎదురుచూస్తున్నానని, దొరికిన వెంటనే పెళ్లి చేసుకుంటానని తెలిపింది. ఈ సందర్భంగా ప్రేక్షకులు, సినీ ప్రముఖులు చప్పట్లతో స్పందించగా, అభిమానులు సోషల్ మీడియాలో ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కొందరు "త్వరలో గుడ్ న్యూస్ చెప్పండి" అంటూ సరదా కామెంట్లు చేస్తున్నారు. కాగా, దర్శకురాలు నందినీ రెడ్డి తెరకెక్కించిన 'మా ఇంటి బంగారం' జూన్ 19న విడుదల కానుంది. ఈ చిత్రంలో శ్రీముఖి కీలక పాత్ర పోషించింది.

# కల్కి సీక్వెల్.. సాయిపల్లవి కాకపోతే మరెవరు?






పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లీడ్ రోల్ లో దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి 2898 ఏడీ సినిమా భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొనే పోషించిన సుమతి (సమ్-80) కోల్ స్టోరీలో కీలకంగా నిలిచింది. మూవీ మొత్తం ఆ పాత్ర చుట్టూనే తిరగడంతో, ఇప్పుడు రూపొందుతున్న కల్కి-2లో సుమతి రోల్ ను ఎవరు పోషిస్తారన్నది హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే ఆ రోల్ కు సంబంధించిన అనేక రకాల వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కొన్ని కాల్షీట్ల సమస్యలు, ఇతర కారణాల వల్ల దీపికా పదుకొనే సీక్వెల్ నుంచి తప్పుకున్నారు. దీంతో ఆమె ప్లేస్ లో కొత్త హీరోయిన్ కోసం మూవీ టీమ్ సెర్చ్ చేసినట్లు తెలిసింది. ఆ సమయంలో బాలీవుడ్ బ్యూటీ అలియా భట్, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా పేర్లు వినిపించాయి. ఆ తర్వాత నేచురల్ బ్యూటీ సాయి పల్లవి పేరు తెరపైకి వచ్చింది. సుమతి పాత్రలో కనిపించేది ఆమెనేనని, ఇప్పటికే సెలెక్ట్ చేశారని కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. అంతేకాదు, ప్రభాస్ తో కలిసి సాయిపల్లవి షూటింగ్ లో పాల్గొనాల్సి ఉండగా, ఆమె ఆరోగ్య సమస్యల కారణంగా షెడ్యూల్ వాయిదా పడిందంటూ మరో రూమర్ కూడా వైరల్ అయింది. కంప్లీట్ ఎమోషన్స్ తో నిండిన సుమతి రోల్ కు సాయిపల్లవి న్యాయం చేయగలదని, సరైన సెలక్షన్ అవుతుందని అభిమానులు కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఆ ప్రచారాలన్నింటికీ దర్శకుడు నాగ్ అశ్విన్ తాజాగా చెక్ పెట్టారు. కల్కి-2కి సంబంధించి ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. సినిమాలో సుమతి పాత్ర చాలా మెయిన్ అని, ఆ పాత్రను తొలగిస్తున్నారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. అలాగే, సుమతి పాత్ర కోసం సాయిపల్లవిని ఎంపిక చేశారన్న వార్తలను కూడా ఆయన ఖండించారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు. సరైన సమయంలో ఆ పాత్రకు సంబంధించిన అధికారిక వివరాలను అనౌన్స్ చేస్తామని తెలిపారు. ఇప్పటికే కల్కి-2కి సంబంధించిన రెండు షెడ్యూళ్లు పూర్తయ్యాయని నాగ్ అశ్విన్ వెల్లడించారు. సెప్టెంబర్ నుంచి సినిమా షూటింగ్ నాన్ స్టాప్ గా కొనసాగుతుందని చెప్పారు. ఏదేమైనా సుమతి పాత్ర విషయంలో నెలకొన్న సస్పెన్స్ కు దర్శకుడు కొంతవరకు తెరదించినా.. ఆ రోల్ లో చివరికి ఎవరు కనిపిస్తారన్న ప్రశ్నకు మాత్రం ఇంకా ఆన్సర్ రాలేదు. సాయిపల్లవి పేరు ప్రచారంలో ఉన్నప్పటికీ, అది నిజం కాదని నాగ్ అశ్విన్ స్పష్టం చేయడంతో అభిమానులు ఇప్పుడు అనౌన్స్మెంట్ కోసం వెయిట్ చేస్తున్నారు. ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబినేషన్ లో వస్తున్న కల్కి సీక్వెల్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా స్టోరీలో కీ పాయింట్ గా నిలిచిన సుమతి పాత్రను ఎవరు పోషిస్తారనేది ఇప్పుడు కల్కి-2కి సంబంధించి బిగ్గెస్ట్ క్వశ్చన్ గా మారింది. అఫీషియల్ అనౌన్స్మెంట్ వచ్చే వరకు ఆ రూమర్లకు తెరపడే అవకాశాలు కనిపించడం లేదు. మరి సాయి పల్లవి కాకుండా ఎవరు యాక్ట్ చేయనున్నారో వేచి చూడాలి.

Printed, Polished, Owned by BESTHA SHIVA RAMUDU & Printed UTTEJITA PRINTERS H.NO -801, BUDHAWAR PETA, KURNOOL, ANDHRA PRADESH - 518001.
APTEL2023/88704 & Published at D.No.4-458, PAIGEAR, NANDAVARAM, V&P. KURNOOLD.T. (A.P)-518343,CELL:9494741301.